

ఈనాడు విజయనగరం

బుధవారం 3 జనవరి 2018 | 16 పేజీలు

ప్రజల ముంగిటకు పాలన

జిల్లాలో ఘనంగా ప్రారంభమైన 'జన్మభూమి-మాఊరు'

● అయిదో విడత ముగిసేలోగా మెరుగైన మార్పు : మంత్రి ● బాడంగి, పాచిపెంట, కొత్తవలస, కొమరాడల్లో నిరసనలు



విజయనగరంలో కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి రంగారావు, చిత్రంలో జడ్పీ అధ్యక్షురాలు స్వాతిరాణి, ఎమ్మెల్సీ గాదె, ఎమ్మెల్యే గీత, కలెక్టరు తదితరులు

ఈనాడు-విజయనగరం

జిల్లాలో పాలన మొత్తాన్ని ప్రజల ముందుకు తెస్తూ అయిదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర గనుల శాఖ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు విజయనగరం పట్టణం 21వ వార్డు పరిధిలోని ధర్మపురి పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులందరినీ ప్రజల ముంగిటకు తీసుకొచ్చామని ప్రజలు వారి సమస్యల్ని చెప్పి పరిష్కరించుకోవాలన్నారు. తెదేపా ప్రభుత్వం ఏటా జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తుందని, అయిదో విడత కార్యక్రమం పూర్తయ్యేసరికి ప్రజల జీవన విధానంలో మెరుగైన మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని ఆయన చెప్పారు. అదే సభలో పాల్గొన్న జడ్పీ అధ్యక్షురాలు శోభా స్వాతిరాణి మాట్లాడుతూ జన్మభూమి సభల్లో ప్రజల సమస్యలు 80 శాతం వరకూ పరిష్కారమవుతున్నాయన్నారు. కలెక్టరు వివేక్‌యాదవ్ మాట్లాడుతూ కార్యక్రమం జరిగే పది రోజులు రోజుకో అంశంపై చర్చాగోష్ఠి ఉంటుందన్నారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో జరిగిన సభల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా జన్మభూమి కోలాహలమే కనిపించింది.

నిరసనలు.. నిలదీతలు: జన్మభూమి తొలిరోజు సభలో ప్రధానంగా రేషన్ కార్డులు, పింఛన్లు అర్హులకు ఇవ్వడం లేదంటూ అనేకచోట్ల నిరసనలు వ్యక్తమయ్యాయి. ఉపాధి వేతనదారులకు కూలీ అందకపోవడంపైనా కొందరు నేతలు నేరుగా విమర్శలు గుప్పించారు. రెవెన్యూ సమస్యలపై ప్రధానంగా వినతులు సైతం (మిగతా 15వ పేజీలో)



కూచ్‌బిహార్ ట్రోఫీలో భాగంగా ఆంధ్రా-గుజరాత్ జట్ల మధ్య అండర్-19 క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా ప్రారంభమైంది. 7లో


పాఠశాల యాజమాన్యంపై కేసు



పార్వతీపురంలో ఓ ప్రైవేటు పాఠశాలలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా విద్యార్థులకు ఏర్పడిన కంటి సమస్యల 'కళ్ల'కలం మంగళవారం కొనసాగింది. రెండోరోజు పలువురు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన యాజమాన్యంపై పోలీసులు కేసునమోదు చేశారు.

వివరాలు 3లో

మనది 20



స్వచ్ఛభారత్‌లో జాతీయస్థాయిలో మెరుగుపడిన ర్యాంకు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్‌లో జిల్లాకు మరో ఖ్యాతి దక్కింది. బహిరంగ మలవిసర్జన రహితం దిశగా వడివడిగా అడుగులు వేస్తున్న జిల్లా అత్యంత ప్రగతి చూపుతున్న జిల్లాల సరసన చేరింది. స్వచ్ఛభారత్ మిషను తాజాగా విడుదల చేసిన ప్రకటనలో జిల్లా 20 ర్యాంకులో నిలిచినట్లు అధికారులు వెల్లడించారు. 2016లో 674లో నిలిచిన జిల్లా .. క్రమంగా ర్యాంకును మెరుగుపర్చుకుంటూ వచ్చింది.

జిల్లా ర్యాంకింగ్ ఇలా..	2016 మార్చిలో	2017 అక్టోబరులో	2018 జనవరి ఒకటికి
	674	217	20

కన్నెత్తి చూడరు.. కనికరించరు..

● జలసిరి యూనిట్లు మొరాయిస్తే తిప్పలే

● ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని ఏజెన్సీలు

2లో...

అలజడి

● 50మీ॥లకు పైగా ముందుకు వచ్చిన సముద్రం

రెండు రోజులుగా ప్రశాంతంగా ఉన్న సముద్రం సోమవారం అర్ధరాత్రి నుంచి అలలధాటితో తీరప్రాంత వాసులను భయపెడుతోంది. ఎగిసిపడుతున్న అలలు, హోరుగాలుల తీవ్రతతో భోగాపురం మండలం తీర ప్రాంత గ్రామమైన ముక్కాంవాసులు ఆందోళనకు గురయ్యారు. 50 మీటర్లకు పైగా ముందుకొచ్చిందని హుద్‌హుద్ తుపాను సమయంలో కూడా ఇలాంటి పరిస్థితులు కనిపించలేదని చెబుతున్నారు. రక్షణ గోడ సైతం కూలిపోయి, రహదారి కోతకు గురైన పరిస్థితి ఇక్కడ ఉంది.




ముక్కాం రెండో వీధిలో పూర్తిగా కూలిన రక్షణగోడ



వివరాలు 6లో



ఎన్టీఆర్ జలసిరి-2లో దరఖాస్తులు	రైతులు సొమ్ములు చెల్లించినవి	యూనిట్లు బిగించినవి	యూనిట్ ఏర్పాటు వ్యయం	నెడ్‌క్యాప్ వాటా	ఈపీడీసీఎల్ వాటా	ప్రత్యేక అభివృద్ధి నిధులు	రైతు వాటా
2,396	2,000	1478	రూ.3,05,999	రూ.1,62,000	రూ.88,999	రూ.30,000	రూ. 25,000



బలిజపేట మండలంలో బోరు మరమ్మతుతో ఎండిపోయిన వరి నారుమడి

కన్నెత్తి చూడరు.. కనికరించరు..

- జలసిరి యూనిట్లు మొరాయిస్తే తిప్పలే
- చాలాచోట్ల మోటార్లు సైతం కాలిపోతున్న వైనం
- ఫిర్యాదు చేస్తున్నా కన్నెత్తి చూడని ఏజెన్సీలు
- అయిదేళ్ల గ్యారంటీ అని చెప్పి పత్తా లేకుండా పోయారు

ఈనాడు పరిశీలన

ఈనాడు–విజయనగరం

ఏ యంత్రమైనా సరే అయిదేళ్ల గ్యారంటీ ఇస్తున్నారంటే కచ్చితంగా బాగా పనిచేస్తుందని అనుకోవడం సహజం.. కాని ఎన్టీఆర్ జలసిరిలో బిగిస్తున్న సోలార్ యూనిట్లు మాత్రం అనేక చోట్ల వారం పదిరోజులకే మొరాయిస్తున్నాయి. కొన్ని చోట్లయితే ఏకంగా కొత్త మోటార్లే కాలిపోతున్నాయి. దీంతో రైతాంగం ఫిర్యాదుచేస్తున్నా అయిదేళ్ల గ్యారంటీ అని చెప్పిన వివిధ ఏజెన్సీల ప్రతినిధులు పత్తా లేకుండా పోతున్నారు.

ఎన్టీఆర్ జలసిరి పథకంలో భాగంగా అన్నదాతల పొలాల్లో సోలార్ పంపుసెట్ల యూనిట్ల ఏర్పాటులో విజయనగరం జిల్లా మన రాష్ట్రంలోనే ముందంజలో ఉంది. కేవలం ఉత్తరాంధ్ర పరంగానే చూసుకున్నా జిల్లాలో ఇప్పటికే 1,478 యూనిట్లు బిగిస్తే పక్కనే ఉన్న శ్రీకాకుళంలో ఒకే ఒక్కటి, విశాఖపట్టణంలో 131 మాత్రమే ఏర్పాటు చేశారంటే జిల్లా అధికారులు ఎంతగా కృషి చేస్తున్నారో ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. జిల్లాలో పెరుగుతున్న సోలార్ పంపుసెట్లతో ఇంతకాలం రబీలో సాగు చేయని రైతులు సైతం పంటలు పండించుకోవచ్చని సంబరపడ్డారు. అయితే జిల్లావ్యాప్తంగా అనేకచోట్ల జలసిరి యూనిట్లు ఆశించిన స్థాయిలో నీరివ్వలేకపోతున్నాయి. కనీసం రెండు అంగుళాల వైశాల్యంతో పైపుల నుంచి నీరు రావాల్సి ఉన్నా చాలాచోట్ల అది సాధ్యం కావడం లేదు. 200 అడుగుల లోతులో బోర్లు తవ్వినా నీరు రాకపోవడమేంటన్న అనుమానం రైతుల నుంచి వ్యక్తమవుతుంది. కొన్నిచోట్లయితే మోటార్లు వేసిన వారం పది రోజుల తరువాత పూర్తిగా మొరాయిస్తున్నాయి. మోటార్లు సైతం కాలిపోతున్నాయి. పైపులైన్లు, వైర్లు సైతం నాణ్యమైనవి కాదని రైతులే చెబుతున్నారు. కేవలం ఏజెన్సీలు లాభాలు మిగుల్చుకోవాలన్న కక్కుర్తితో బాగా నాసిరకమైనవి తెచ్చి బిగించేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇదంతా ఒకత్తెయితే మరమ్మతులకు గురైనప్పుడు అన్నదాతలు ఫిర్యాదులు చేస్తున్నా ఏజెన్సీల ప్రతినిధులు స్పందించడం లేదు. ఒకవేళ వచ్చినా మోటార్లు కాలిపోయాయని మళ్లీ తెస్తామని చెప్పి వెళ్లిపోతున్నారు. తరువాత సదరు బాధిత రైతులు ఫోన్ చేసినా తీయడం లేదు.



శివరాంపురంలో జలసిరిబోరు మరమ్మతుకు గురైందని చూపిస్తున్న రైతు

★ కొమరాడ మండలం కొట్టు పంచాయతీలో మూడు యూనిట్లలో మోటార్లు కాలిపోయి పనిచేయడం లేదు. మోటార్లు నాసిరకమైనవి ఇచ్చేస్తున్నారని అందుకే కాలిపోతున్నాయని రైతులు విమర్శిస్తున్నారు.

★ సాలూరు మండలం కూర్మరాజుపేటలో ఏర్పాటుచేసిన యూనిట్లు పదే పదే మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటికీ అక్కడ అయిదు యూనిట్లు పనిచేయడం లేదు. మోటార్లు, పైపులు, వైర్లు ప్రతీది నాసిరకమైనవే వేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగానే ఏజెన్సీ నిర్వాహకులొచ్చి సోలార్ పంపుసెట్లు నాణ్యతతో ఉన్నాయని సంతకం పెట్టమంటే పెట్టలేదని చెబుతున్నారు.

నిబంధనలన్నీ నీళ్లపాలు

వాస్తవానికి ఎన్టీఆర్ జలసిరిలో బోరు కావాలంటే రైతులు జిల్లా నీటియాజమాన్య సంస్థలో రిజిస్టర్ చేసుకోవాలి. వారి ఆమోదంతో బోరు తీసుకున్నాక రైతు తన వాటాగా రూ. 25,000 డ్వామాకి కడితే వారు మరో రూ. 30,000 కలిపి మొత్తంగా రూ. 55,000 సొమ్మును ఈపీడీసీఎల్‌కి చెల్లిస్తారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా బోర్ల కోసం సొమ్ములు చెల్లించిన వారి సంఖ్య ఆధారంగా ఈపీడీసీఎల్ సీఎండీ కార్యాలయంలోని సోలార్ విభాగం టెండర్లను పిలిచి ఏజెన్సీలకు వాటి ఏర్పాటు బాధ్యతలు అప్పగిస్తుంది. జిల్లాలో ప్రస్తుతం 15 ఏజెన్సీలు రూ. 3,05,999 ధర ప్రకారం 2,396 యూనిట్లు బిగించే బాధ్యతలు తీసుకున్నాయి. ఇప్పటికే 1,478 బిగించాయి. వాస్తవానికి నెడ్‌క్యాప్ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అక్కడ బిగించిన యూనిట్లలో మోటార్లు, సోలార్ ప్యానెళ్లు, వైరింగ్ వ్యవస్థ, పైపులు అన్నీ నాణ్యమైనవేనా కాదా అన్నది పరిశీలించి ధ్రువీకరించాలి. ఆ తరువాతే బిల్లులు జరగాలి. కాని నాణ్యమైనవి బిగించకపోయినా బిల్లులు అయిపోవడం వెనక కొందరు అధికారుల అవినీతి వ్యవహారం ఉన్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు ఒక్కసారి యూనిట్ బిగించిన తరువాత అయిదేళ్ల పాటు ఏ మరమ్మతు లొచ్చినా సదరు ఏజెన్సీనే బాధ్యత వహించాలి. కాని ఏజెన్సీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సీఎండీ కార్యాలయంలో వారు గ్యారంటీగా పెట్టిన పది శాతం సొమ్మును నిలిపేసే అధికారముంది. అయినా రైతులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడు కనిపించడం లేదు. జలసిరి పథకం మొత్తంగా డ్వామా, ఈపీడీసీఎల్, నెడ్‌క్యాప్ మూడు శాఖల ద్వారా అమలవుతుండడంతో ఎవరికి వారే ఒకరిపై మరొకరు నెట్టుకుంటూ రైతుల సమస్యలపై శీతకన్నేస్తున్నారు.

ఆది నుంచి అగచాట్లే



మార్చి 28వ తేదీన బోరు తవ్వాను. నవంబరు 6వ తేదీకి మోటారు బిగించారు. పదిరోజుల్లో కాలిపోయింది. పదే పదే ఫిర్యాదుచేస్తే నవంబరు 26వ తేదీన దాన్ని తీసుకెళ్లిపోయారు. ఇప్పటివరకూ తిరిగి వేయలేదు. నేరుగా బొబ్బిలి ఈపీడీసీఎల్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఏజెన్సీకి ఫోన్ చేసినా తీయడం లేదు.

– రెడ్డి రమణమూర్తి, రైతు, రెడ్డివానివలస, సీతానగరం మండలం

మా తిప్పలు దేవుడికే తెలుసు



రెండు నెలల క్రితం నా పొలంలో జలసిరి బోరు బిగించారు. 15 రోజులే పని చేసింది. అప్పటినుంచి అధికారులకు ఫిర్యాదుచేస్తున్నా పట్టించుకునేవాళ్లు కరవైపోయారు. నా ఒక్కడికే కాదు ఒక్క మా గ్రామంలోనే 12 జలసిరి బోర్లు బిగిస్తే మూడు మాత్రమే సక్రమంగా పనిచేస్తున్నాయి. ఆరు కాలిపోయి మూలకు చేరిపోయాయి. మరో మూడు సాంకేతిక లోపాలతో పావుగంటకి మించి నీరివ్వని స్థితిలో ఉన్నాయి. ప్రభుత్వం లక్షలు ఖర్చు బెడుతున్నా అది ఏజెన్సీలకే లబ్ధి అవుతుంది.

– టి.శంకరరావు, పదమాయవలస, బలిజపేట మండలం

రాతపూర్వకంగా ఫిర్యాదుచేయాలి



ఎన్టీఆర్ జలసిరి బోర్లు మరమ్మతులకు గురైతే ఏజెన్సీలే బాగు చేస్తాయి. అయిదేళ్ల వరకూ వారిదే గ్యారంటీ.. ఎక్కడైనా బోర్లు మొరాయిస్తే రాతపూర్వకంగా ఫిర్యాదుచేస్తే ఏజెన్సీలకు మెయిల్ పంపిస్తాం. అక్కడి నుంచి వారొచ్చి నిర్ణీత సమయంలోనే బాగుచేస్తారు.

– పి.వెంకటేశ్వరరావు, డీఈ(టెక్నికల్), విజయనగరం సర్కిల్

జన్మభూమి నోడల్ అధికారులు వీరే..

విజయనగరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం నుంచి ప్రారంభమైన జన్మభూమి- మా ఊరు కార్యక్రమాలకు నియోజకవర్గాల వారీగా నోడల్ అధికారులను ప్రభుత్వం నియమించింది. కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాలకు నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఈవో, ఎండీ కె. సాంబశివరావు, సాలూరు, బొబ్బిలి నియోజకవర్గాలకు నేషనల్ గ్రీన్ క్రాప్స్ సంచాలకులు బి.ఎ.వి.కృష్ణమూర్తి నియమితులయ్యారు. చీపురుపల్లి, గజపతినగరం నియోజకవర్గాలకు మేకలు, గొర్రెలు అభివృద్ధి సంస్థ ఎండీ శ్రీనివాసరావు, నెల్లిమర్ల, విజయనగరం నియోజకవర్గాలకు భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ వెంకటేశ్వర్లు, శృంగవరపుకోట నియోజకవర్గానికి పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు వి.ఎస్.భార్గవ్‌ను నియమించారు. వీరంతా జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు ఆయా నియోజకవర్గాల్లో సాఫీగా సాగేలా బాధ్యత వహిస్తారు. ప్రతిరోజూ వారికి కేటాయించిన నియోజకవర్గంలో గ్రామసభ, వార్డుసభలను సందర్శిస్తారు. రోజూ ఉదయం, సాయంత్రం గ్రామసభలు పూర్తయిన వెంటనే నివేదికలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. సాంకేతిక సమస్యలను సచివాలయంలో ఏర్పాటు చేసిన రియల్‌టైమ్ గవర్నెన్స్ కంట్రోల్ రూమ్ ప్రాజెక్టు మేనేజర్ దృష్టికి తీసుకురావాలని సూచించింది.

ప్రజల జీవన ప్రమాణాల మెరుగే ప్రభుత్వ ధ్యేయం

- ఉగాది నుంచి కొత్త పింఛన్లు మంజూరు
- జన్మభూమి - మా ఊరులో మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: తెదేపా అధికారంలోకి వచ్చాక క్రమం తప్పకుండా జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గనులు, భూగర్భ గనుల శాఖా మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు తెలిపారు. మంగళవారం విజయనగరం పట్టణం 21వ వార్డు పరిధిలోని ధర్మపురి పాత పంచాయతీ కార్యాలయం వద్ద 5వ విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ముందుగా పుర కమిషనర్ వి. రవీంద్ర అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ముందుగా జన్మభూమి ఉద్దేశం చదివి వినిపించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల వద్దకే అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నారని తెలిపారు.

రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గానికి కొత్తగా 2 వేల పింఛన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉగాది పండగ నుంచి వీటిని మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. జడ్పీ అధ్యక్షురాలు స్వాతిరాణి మాట్లాడుతూ జన్మభూమి ద్వారా 80 శాతం ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఎమ్మెల్యే మీసాల గీత, కలెక్టరు వివేక్‌యాదవ్ మాట్లాడుతూ జన్మభూమిలో ప్రతీ రోజు ఒక అంశంపై చర్చాగోష్ఠి ఉంటుందని తెలిపారు. వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. కార్యక్రమంలో పురపాలక సంఘ అధ్యక్షుడు ప్రసాదుల రామకృష్ణ, పుర ఉపాధ్యక్షులు కనకల మురళీమోహన్, వార్డు కౌన్సిలరు గేదెల ఆదిబాబు, అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులు డాక్టరు వీఎస్ ప్రసాద్, కరణం విజయకుమారి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సైలాడ త్రినాధ్, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు తదితరులు పాల్గొన్నారు



వసతి గృహం వెనుక నిలిచిపోయిన మురుగును పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టరు

మంత్రి సమస్యల ఏకరవు: మంత్రి పట్టణంలోని పద్మావతినగర్‌లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ బాలుర కళాశాల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్నంలో రాళ్లు ఉంటున్నాయని, ఒక్కోసారి భోజనం బాగుండడం లేదని పలువురు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వసతిగృహ సంక్షేమాధికారి సుబ్బారావును ప్రశ్నించారు. పౌరసరఫరాల శాఖ ద్వారా వస్తున్న బియ్యం పెడుతున్నామని సమాధానం ఇచ్చారు. వసతిగృహం వెనుక మురుగునీరు నిలిచి అపరిశుభ్రంగా ఉందని, దానిపై ఒకరోజులో చర్యలు తీసుకోవాలని పుర అధికారులను ఆదేశించారు.

పార్వతీపురం నియోజకవర్గానికి ప్రత్యేకాభివృద్ధి నిధులు విడుదల

కలెక్టరేట్, న్యూస్‌టుడే: పార్వతీపురం నియోజకవర్గానికి ప్రత్యేకాభివృద్ధి(ఎస్‌డీఎఫ్) నిధులు రూ.2 కోట్లు మంజూరు చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాల్సి ఉంటుంది. స్థానిక శాసనసభ్యుల ప్రతిపాదనల మేరకు కలెక్టర్ ఈ పనులకు ఆమోదం తెలపాల్సి ఉంటుంది.

ఉద్యోగులపై బెదిరింపులు బాధాకరం

ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: గత నెల 31న జడ్పీ సమావేశాల్లో ఉద్యోగులపై ప్రజాప్రతినిధుల వ్యవహరించిన తీరు బాధాకరమని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం జిల్లా కార్యదర్శి జి.బి. నాయుడు, రాష్ట్ర కమిటీ ట్రెజరర్ ఎం.అర్జున అప్పారావు, ఏపీ పంచాయతీరాజ్ డిప్లమో ఇంజినీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వి.రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్లను గజపతినగరం శాసనసభ్యులు కె.ఎ.నాయుడు, బొండపల్లి, విజయనగరం జడ్పీటీసీ సభ్యులు బెదిరింపు ధోరణితో హెచ్చరించడాన్ని తప్పుపట్టారు. ఈ ఘటనతో పంచాయతీరాజ్‌లోని అన్ని స్థాయిల్లో ఇంజినీర్లు మనోధైర్యాన్ని కోల్పోయారని పేర్కొన్నారు. రాష్ట్రమంత్రి, కలెక్టర్, జడ్పీ అధ్యక్షురాలు సమక్షంలో ఈ ఘటన జరగడం బాధాకరమని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీర్లకు మద్దతుగా నిలిచిన జిల్లా అధికారుల సంఘానికి, ఎన్‌జీవో ఉద్యోగ జేఏసీకి కృతజ్ఞతలు తెలిపారు.

అత్యుత్సాహమే కారణమా..?

- కార్యక్రమానికి అనుమతి తీసుకోని పాఠశాల యాజమాన్యం
- నిర్వాహకుల తీరుపై తల్లిదండ్రులు, ప్రజా సంఘాల ఆందోళన
- రెండోరోజు వైద్యం అందించిన వైద్యులు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పార్వతీపురం,/గ్రామీణం న్యూస్‌టుడే

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పార్వతీపురం పట్టణంలోని సురేష్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు కళ్లకు ఇబ్బందులు తలెత్తిన ఘటనలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేడుకలు ఘనంగా నిర్వహించాలనే అత్యుత్సాహమే ప్రస్తుత పరిస్థితికి కారణమైంది. పిల్లలను ఎంత సమయం వరకు వేడుకలకు అనుమతించాలో.. అంతవరకు వారిని అనుమతిస్తే బాగుండేది. అలా కాక తెల్లవార్లూ వారిని అనుమతించడం విమర్శలకు తావిస్తోంది. పాఠశాల ఊరు శివారున ఉండడం వల్ల చుట్టూ చల్లటి వాతావరణం అలుముకుంది. దీనికి తోడుగా చలి గాలి తోడుకావడంతో చిన్నపిల్లల శరీరం తట్టుకోలేకపోయింది. సోమవారం కంటివ్యాధులు సోకిన వెంటనే వారికి విశ్రాంతినిచ్చి, ఇళ్లకు సమాచారం ఇస్తే చాలావరకు కుదుటపడే వాతావరణం ఏర్పడేది. అందుకు భిన్నంగా పాఠశాల యాజమాన్యం వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైంది.

అనుమతి తీసుకోకుండా..

మూడురోజుల ముందు నుంచే పోలీసు అధికారులు వేడుకలు నిర్వహణపై నియంత్రణ అమలు చేస్తున్నట్లు ప్రకటిస్తూ వచ్చారు. ఎవరైనా మైక్‌సెట్లు వినియోగించాలంటే విధిగా అనుమతి తీసుకోవాలని సూచనలు జారీచేశారు. రాత్రి పదిన్నర దాటిన తర్వాత ఎటువంటి ప్రదర్శనలు చేయకుండా నిలువరించేందుకు చర్యలు తీసుకున్నారు. పట్టణంలో అయితే ప్రత్యేక పికెట్లు ఏర్పాటుచేశారు. ప్రదర్శనలు నిర్దేశిత సమయానికి మించి నిర్వహించకుండా ప్రయత్నించారు. అయితే.. ఇవేవీ సురేష్ పాఠశాలలో అమలుచేయలేదు. కార్యక్రమ ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని పోలీసులే ప్రకటించారు. నిబంధనలను అమలుపరిచి, పోలీసుల సూచనలు పట్టించుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు.

ప్రజా సంఘాల ఆందోళన

విద్యార్థుల కంటి సమస్యలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ప్రజాసంఘాలు డిమాండు చేస్తూ ఉద్యమించాయి. కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లలకు అనారోగ్యంగా ఉందనే విషయాన్ని తమకు ప్రసార సాధనాల ద్వారా తెలిసి, పిల్లలతో మాట్లాడి తెలుసుకున్నామని, సమాచారాన్ని తల్లిదండ్రులకు తెలియజేయకపోవడానికి కారణమేమిటని ప్రశ్నించారు. ఈమొత్తం వ్యవహారంలో నిర్లక్ష్యం ఆ వహించిందని భారతవిద్యార్థిసమాఖ్య పాఠశాల ఎదుట ప్రదర్శన నిర్వహించింది. ఇదిలా ఉండగా పాఠశాలలో జరిగిన ఘటనకు సంబంధించి రాష్ట్ర బాలల హక్కుల సంఘం ఛైర్‌పర్సన్ హైమావతి పార్వతీపురం వచ్చి సురేష్ పాఠశాల విద్యార్థుల్లో అనారోగ్యం బారిన పడ్డవారిని పరామర్శించారు. అక్కడి పరిస్థితులను విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పిల్లలకు ఏర్పాటు చేయాల్సిన వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. కొన్ని లోటుపాట్లు ఉన్నాయని, వాటికి సంబంధించి రెవెన్యూ, విద్యాశాఖ, సంక్షేమ శాఖలకు చెందిన అధికారులకు నివేదిక కోరనున్నట్లు తెలిపారు. భవననిర్మాణాలు, అనుమతులు, అందులోని ఉన్న లోపాలను గుర్తించి నివేదిక కోరుతామన్నారు.


పిల్లలతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న కమిషన్ ఛైర్‌పర్సన్ హైమావతి

పాఠశాలకు రెండురోజుల సెలవు

నేత్ర, చిన్నపిల్లల వైద్యనిపుణులు మంగళవారం ఉదయం మరోసారి వైద్యపరీక్షలు నిర్వహించారు. సోమవారం వైద్యం చేసిన తర్వాత 90శాతం మందికి కళ్లలో ఇబ్బందులు తగ్గిపోయాయని వైద్యులు యాళ్ల వివేక్ చెప్పారు. మిగిలిన పదిశాతం మందికి బుధవారం నాటికి కుదుటపడుతుందన్నారు. విశ్రాంతి అవసరమని తెలిపారు. దీంతో సురేష్ పాఠశాలకు రెండురోజులు సెలవు ప్రకటించారు. వసతిగృహంలో విద్యార్థులకు ఇళ్లకు పంపించేశారు. ఇదిలా ఉండగా పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులకు పార్వతీపురం గ్రామీణ పోలీసులు వైద్యపరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ పరీక్షలు నిర్వహించి, వైద్యం అందించారు. పిల్లలకు సంబంధించి వివరాలు తెలుసుకొనేందుకు మండల విద్యాశాఖాధికారి, ఉపతహశీల్దారు, సాంఘికసంక్షేమ సహాయాధికారి పాఠశాలలోనే ఉండి పరిస్థితులను సమీక్షించారు. బాలలహక్కుల కమిషనరు ఛైర్‌పర్సన్‌కు వారు పరిస్థితిని వివరించారు. ఆదివారం రాత్రి జరిగిన వేడుకలకు సంబంధించి సమాచారాన్ని తెలిపారు.

ఎనిమిది మంది ఆసుపత్రికి తరలింపు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: కంటి సమస్యతో బాధపడుతున్న ఎనిమిది మంది విద్యార్థులను మంగళవారం మధ్యాహ్నం పార్వతీపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. గ్రామీణ పోలీసులు సమక్షంలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేయించారు. అత్యధిక ఓల్టేజీ వెలుగుకు పాఠశాల విద్యార్థులు వందలాది వందికి కంటి చూపు సమస్య ఎదురైన విషయం తెలిసింది. అధికారుల సమక్షంలో వైద్యసేవలు అందించినప్పటికీ కొద్దిమంది విద్యార్థుల కళ్లకు వాపుతో పాటు నీరు కారడం వంటివి ఎదురవ్వడంతో అటువంటి వారికి ప్రత్యేక వైద్యం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

యాజమాన్యంపై కేసు నమోదు: సీఐ

పార్వతీపురం, న్యూస్‌టుడే : విద్యార్థుల అనారోగ్యానికి కారకులైన సురేష్ పాఠశాల యాజమాన్యంపై కేసును నమోదుచేసినట్లు పార్వతీపురం సర్కిల్ ఇన్‌స్పెక్టరు జి.రాంబాబు చెప్పారు. ఒక విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగు సెక్షన్లలో కేసు నమోదుచేశామన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, నూతనసంవత్సర వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాటుచేసే వేదికలను అనుమతులు అవసరమని ముందుగా హెచ్చరించినప్పటికీ ఆయా అనుమతులు లేకుండానే వేడుకలు నిర్వహించడం, మైక్‌లు వినియోగించడం చట్టవిరుద్ధమన్నారు. వీటన్నింటి నేపథ్యంలో పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


కొత్త సమావేశమందిరంలో మాట్లాడుతున్న మోహనరావు

మరింతగా సేవలు అందించేందుకు కృషి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పేద ప్రజలకు మెరుగైన వైద్యం సేవలు అందించే ప్రాంతీయ ఆసుపత్రిలో మరింత మెరుగైన సేవలకు అంతా కృషిచేయాలని ఆసుపత్రి అభివృద్ధిక మిటీ ఛైర్మన్ డి.మోహనరావు కోరారు. శనివారం సాయంత్రం ఆసుపత్రిలో ఆధునికీకరించిన సమావేశ మందిరాన్ని ఆయన శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

4న జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'జన్మభూమి' కార్యక్రమంపై జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలను ఈనెల 4న ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఉడా కాలనీలోని గురజాడ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ సముద్రాల గురుప్రసాద్ తెలిపారు. 7వ తరగతి నుంచి 10 తరగతిలోపు విద్యార్థులు అర్హులని తెలిపారు.

'న్యాయ పోరాటం చేస్తాం'

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి భంజ్‌దేవ్ గిరిజన కుల ధ్రువీకరణ పత్రం మంజూరుపై న్యాయపోరాటం చేస్తామని గిరిజన ఉద్యోగుల సంఘ న్యాయ సలహాదారు రేగు మహేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన జనాభాలో 31 తెగలు ఉన్నాయని వాటిలో గాని, రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్‌లో గాని కొండరాజు కులం లేదన్నారు. కుల ధ్రువీకరణ పత్రం మంజూరులో డీఎల్ఎస్‌సీ నివేదికను పక్కన పెట్టారని, రాజ్యాంగ విరుద్ధంగా ఇచ్చారని ఆరోపించారు. కలెక్టర్ వద్ద సాలూరు శాసనసభ్యుడు రాజన్నదొర అప్పీల్ పెండింగ్‌లో ఉందన్నారు. హైకోర్టులోనూ దీనిపై ఆయన అప్పీలు చేశారన్నారు. ఈ దశలో భంజ్‌దేవ్ కుల ధ్రువీకరణపై విచారణ లేకుండా ధ్రువీకరించడం సరికాదన్నారు. రిపబ్లికన్ పార్టీ నాయకుడు గొంప ప్రకాశరావు, మణ్యసీమ రాష్ట్ర సాధన సమితి ప్రతినిధి మాలువ సింహాచలం పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్రాయిలర్ (బ్యాగ్) లైవ్: 98; డ్రెస్‌డ్: 166; స్కిన్‌లెస్: 176, లేయర్: లైవ్: 109; డ్రెస్‌డ్: 158; స్కిన్‌లెస్:180, సుగుణ: లైవ్ 108; డ్రెస్‌డ్: 157; స్కిన్‌లెస్: 184.


మృతుడు రామారావు

మద్యం మత్తులో ఓ ప్రాణం చిత్తు!

- పకీరుకిత్తలిలో ఒకరి హత్య
- కుటుంబ కలహాలే కారణం

పకీరుకిత్తలి(గుర్ల), న్యూస్‌టుడే: మద్యం మత్తు, కుటుంబ కలహాల నేపథ్యంలో వివాదం ముదిరి ఒకరి హత్యకు దారి తీసింది. గుర్ల మండలం పకీరుకిత్తలి గ్రామంలో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఇదే గ్రామానికి చెందిన సబుకు రామారావు అలియాస్ ఈశ్వరరావు(35) హత్యకు గురయ్యారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... పూటుగా తాగిన మైకంలో రామారావు తన తల్లి చిన్నమ్మ, సోదరి రాణి ఇంటిమీదకి తగువుకు వెళ్లాడు. కుటుంబ వివాదం నేపథ్యంలో ఇతను కత్తితో అక్క ఇంటివద్ద ఉన్న జామచెట్టుని నరికి వేశాడు. అనంతరం గునపంతో ఇంటి తలుపులను మోదడంతో కన్నాలు పడ్డాయి. దీంతో భయకంపితులైన తల్లి చిన్నమ్మ సమీప బంధువైన సబుకు శ్రీనుకు సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి రామారావును సముదాయించాడు. అయితే గొడవ సద్దుమణిగిన కాసేపటికే శ్రీను మళ్లీ వచ్చి తన భర్తని రాడ్డుతో కొట్టాడని రామారావు భార్య సింహాచలం చెబుతోంది. అతను కూడా అప్పటికే తాగి ఉన్నాడని, కుటుంబ కలహాల నేపథ్యంలో అమానుషత్వానికి పాల్పడ్డాడని, ఈ దాడిలో భర్త ప్రాణాలు కోల్పోయాడని ఆమె రోదిస్తోంది. డీఎస్పీ విచారణ: పకీరుకిత్తలిలో వ్యక్తి హత్య ఘటనపై డీఎస్పీ ఎ.వి.రమణ విచారణ చేపట్టారు. మంగళవారం ఆమర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాడికి దారితీసిన కారణాలపై ఆరా తీశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో హత్య జరిగినట్లు అభిప్రాయపడ్డారు. ఈయన వెంట విజయనగరం గ్రామీణ సీఐ లక్ష్మణరావు, నెల్లిమర్ల, గుర్ల ఎస్ఐలు ఉపేంద్రరావు, రవి ఉన్నారు. రామారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ఆసుపత్రికి తరలించారు.

దిక్కు కోల్పోయిన కుటుంబం: కుటుంబ యజమానిని కోల్పోవడంతో తమ పోషణ ఎలా అంటూ హతుని భార్య సింహాచలం విలపిస్తోంది. ఇప్పుడు పిల్లలను ఎలా పెంచాలంటూ ఆమె విలపిస్తోంది. కూలీ పనులు చేసుకుంటూ ఇంటిని నెట్టుకొచ్చే రామారావు మృతితో ఆ కుటుంబం దిక్కు కోల్పోయింది. ఇతనికి భార్యతో పాటు కుమార్తె పైడితల్లి, కుమారులు వెంకటరమణ, రాంబాబు ఉన్నారు. ఇదిలా ఉండగా.. రామారావు గతంలో హత్యకేసులో నిందితునిగా ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

నాటుసారా మత్తులో..: పకీరుకిత్తలి గ్రామంలో నాటుసారా ఏరులై పారుతోంది. మద్యానికి తోడు కొంత మంది గిరిజనులు నాటుసారా తయారీ చేసి విక్రయిస్తున్నారు. పూటుగా తాగడం వల్లే మత్తులో హత్య జరిగినట్లు భావిస్తున్నారు. తక్కువ ధరకు దొరికే నాటుసారాపైనే మందుబాబులు ఆసక్తిని కనబరుస్తున్నారు. తాగిన మైకంలో గొడవలు జరుగుతున్నాయి, నాటుసారాను పూర్తిగా నియంత్రించాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు.



విచారణ నిర్వహిస్తున్న డీఎస్పీ రమణ,సంఘటన స్థలంలో మృతుని భార్యాబిడ్డలు

శృంగవరపుకోట

విద్యార్థులకు ప్రతిభా పోటీలు

జామి, న్యూస్‌టుడే: జామి ఎమ్మార్సీలో ఒ.డి.ఎఫ్.పై విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పోటీలు మంగళవారం సాయంత్రం మండల విద్యా శాఖాధికారిణి జయశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 40 మంది వరకు పాల్గొన్నారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పి.లావణ్య(9వ తరగతి-కె.జి.బి.వి. కుమరాం), కె.లావణ్య(7వ తరగతి-జామి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల), బి.మోహన్(8వ తరగతి-అలమండ, బాలురు), పి.అశ్విని(9వ తరగతి-కుమరాం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల), ఆర్.సాయిమౌనిక(9వ తరగతి-కె.జి.బి.వి. కుమరాం), కె.నవ్య(8వ తరగతి-జామి), ఎస్.రాజేష్(10వ తరగతి-అలమండ బాలురు), డి.అప్పలరాజు(7వ తరగతి-లొట్లపల్లి), బి.రోహిణి(9వ తరగతి-కె.జి.బి.వి.)లు ఎంపికయ్యారు. వీరందరికీ బహుమతులు అందచేయనున్నట్లు మండల విద్యాశాఖాధికారిణి తెలిపారు.

విద్యుత్తు బిల్లులు సమాచారం

శృంగవరపుకోట గ్రామీణం, న్యూస్‌టుడే: బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గృహ వినియోగానికి సంబంధించిన బిల్లులు ఎస్.కోట విద్యుత్తు కార్యాలయం వద్ద వసూలు చేస్తారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు వ్యాపార, పరిశ్రమలకు సంబంధించిన విద్యుత్తు బిల్లులు స్వీకరిస్తారని జూనియర్ సహాయకులు సీహెచ్.రామునాయుడు తెలిపారు.

సమస్యల పరిష్కారవేదిక.. జన్మభూమి- మాఊరు : ఎమ్మెల్యే

ఖాసాపేట, తలారి, వీరభద్రపేట(లక్కవరపుకోట), న్యూస్‌టుడే: నవ్యాంధ్ర ప్రదేశ్‌ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పురిటిబిడ్డలా తీర్చిదిద్దుకుని ప్రగతి సాధనకు ముందడుగు వేస్తున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం పండగ వాతావరణంలో జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని లక్కవరపుకోట, ఖాసాపేట, వీరభద్రపేట, తలారి గ్రామాలలో ఎంపీడీఓ జీవీ రమణమ్మ, తహసీల్దారు జె.రాములమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమపథకాలు క్షేత్రస్థాయిలో పరిశీలన, ప్రజలకు కావాల్సిన అవసరాలు తెలుసుకోవడం, సమస్యలు గురించి తెలుసుకోవడం తదనుగుణంగా ప్రగతి సాధనకు భవిష్యత్తు ప్రణాళిక రూపొందించుకోవడానికి జన్మభూమి మా ఊరు కార్యక్రమం ప్రయోజనం చేకూర్చుతుందని చెప్పారు. . మండల ప్రత్యేక అధికారి(డీపీఓ) బి.సత్యనారాయణ మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఎంపీపీ కొల్లి వెంకటరమణమూర్తి, జడ్పీటీసీ సభ్యులు కరెడ్ల ఈశ్వరరావు, సర్పంచి సంగం నాగమణి, నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త కేబీఏరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. ఖాసాపేటలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. దేశభక్తిగేయాలు విద్యార్థులు ఆలపించారు. వినతులు స్వీకరించడానికి ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేశారు. వినతులకు రసీదులు తీసుకోవాలని చెప్పారు.

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: పోషకాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన పండంటి బిడ్డను కనాలని గర్భిణులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సూచించారు. ఎల్.కోటలో మంగళవారం సామూహిక సీమంతాలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మాతాశిశు మరణాల నివారణకు పలు రకాల చర్యలు తీసుకొంటుందన్నారు.



ఖాసాపేటలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, డీపీఓ

భీమసింగి, అన్నమరాజుపేట(జామి), న్యూస్‌టుడే: భీమసింగి, అన్నమరాజుపేట గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. భీమసింగిలో ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్పంచి ధనియాల హైమావతి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. అన్నమరాజుపేటలో తహసీల్దారు కె.ఆనందరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి ఎన్నింటి మంగ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ పారశాన అప్పయ్యమ్మ హాజరయ్యారు.



అన్నమరాజుపేట గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దారు ఆనందరావు

చింతలదిమ్మ(కొత్తవలస), న్యూస్‌టుడే: కొత్తవలస పంచాయతీ శివారు గ్రామం చింతలదిమ్మలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించి సంక్షేమం, సంతోషం, సంతృప్తి అంశంపై ప్రజలకు అవగాహన కలిగించారు. 5వ విడత 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాశాల తరఫున 11వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రధాన ఆచార్యులు కె.మల్లేశ్వరరావు చెప్పారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు అండగా నిలవాలి

గోపాలపల్లి, పోతనాపల్లి(శృంగవరపుకోట గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు అంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరుగా సమస్యలు తన దృష్టికి వచ్చేందుకు కొత్తగా 'సాధికార మిత్ర'లను నియమించారని స్పష్టం చేశారు. చంద్రన్న బీమా, పింఛనులు వంటి పథకాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. అర్హులందరికీ ప్రభుత్వ పరంగా న్యాయం జరుగుతాదన్నారు. మండలంలోని గోపాలపల్లి, పోతనాపల్లి లో జన్మభూమి కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. పోతనాపల్లి సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఇంటికి నెలకు ఆదాయం కనీసం రూ.పదివేలు రావాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఎరుకులపేటకు చెందిన మహిళలు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరటంతో ఆమె స్పందిస్తూ రెండు, మూడు నెలల్లో జీవో విడుదల అవుతాదన్నారు. తహసీల్దారు ఎం.అరుణకుమారి, ఎంపీపీ వెంకన్న, తెదేపా మండలాధ్యక్షులు జీఎస్‌నాయుడు తదితరులు ప్రసంగించారు.



పోతనాపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

సమస్యలు పరిష్కరించని జన్మభూములెందుకు?

కిల్లంపాలెం, బొడ్డవర(శృంగవరపుకోట గ్రామీణం), న్యూస్‌టుడే: కిల్లంపాలెం పంచాయతీ బర్నాపురం గ్రామంలో మంగళవారం జన్మభూమి-మాఊరు పండగ వాతావరణంలో ప్రారంభమైంది. గోరీపురం విద్యానికేతన్ చిన్నారులు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. అనంతరం శాఖ పరంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అధికారులు వివరించారు. ఇంతలో లోక్‌సత్తా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కాండ్రేగుల ప్రసాదు, మాజీ సర్పంచి సుంకరి ఈశ్వరరావు, పాలకేంద్రం కార్యదర్శి నాయుడు, బీఈడీ కళాశాల అధ్యాపకులు జయవిష్ణు తదితరులు మాట్లాడుతూ విద్యుత్తు శాఖ పనితీరుపై ధ్వజమెత్తారు. తొలి జన్మభూమి నుంచి రెండో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బొడ్డవరలో ఏర్పాటు చేయాలని ఇస్తున్న వినతులు చెత్తబుట్టకు పరిమితమవుతున్నాయని ఆరోపించారు. ఉప కలెక్టరు, మండల ప్రత్యేకాధికారి ఎం.గణపతిరావు, ఎంపీడీవో జె.మన్మధరావు, మండలాధ్యక్షులు రెడ్డి వెంకన్న, తెదేపా మండలాధ్యక్షులు జీఎస్‌నాయుడు తదితరులు ప్రసంగించారు. సర్పంచి బంగారమ్మ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షురాలు సావిత్రమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు సుకురు రామలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు బీశెట్టి అరుణ, మాజీ ఎంపీపీ ఒంటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



బర్నాపురంలో విద్యుత్తుశాఖ ఏఈని నిలదీస్తున్న గ్రామస్థులు

చిన్నిపాలెం భూములపై నిలదీత

చినరావుపల్లి, చిన్నిపాలెం(కొత్తవలస), న్యూస్‌టుడే: చిన్నిపాలెం రెవెన్యూలో రైతుల సాగులో ఉన్న భూములకు భూస్థితి మార్చుతూ(ల్యాండ్ కన్వర్షన్) ఎలా అధికారాలు కల్పించారని చిన్నిపాలెం పంచాయతీలో మంగళవారం జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో రైతులు, సీపీఎం ప్రతినిధులు అధికారులను నిలదీశారు. సర్పంచి దాలయ్య అధ్యక్షతన ఎంపీడీవో పి.నారాయణరావు నిర్వహించిన గ్రామసభలో భూముల సమస్యపై అంతా ప్రశ్నించారు. ఇక్కడ సమస్యపై 12 సంవత్సరాల నుంచి పోరాటం చేస్తుంటే రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థల పేర్లతో దస్త్రాలు సిద్ధం చేయడంపై రైతు ప్రతినిధులు సయ్యద్, మొయ్యి దేముడుబాబు, చిటికిరెడ్డి సత్యనారాయణ, బాదిరెడ్డి రమణ, సీపీఎం కొత్తవలస మండల కన్వీనర్ గాడి అప్పారావు, డేగల అప్పలరాజు తదితరులు నిలదీశారు. రెవెన్యూలోని గెడ్డలు, చెరువులు మూసేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తని విధంగా వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. సమస్యను ఉన్నత అధికారులకు నివేదిస్తామని ఉప తహసీల్దారు అప్పలనాయుడు, ఎంఆర్‌ఐ తిరుపతిరావు చెప్పారు.

● అప్పన్నదొరపాలెంలో సర్పంచి ఉగ్గిన అమ్మతల్లి అధ్యక్షతన మండల ప్రత్యేక అధికారి, డీఈవో జి.నాగమణి ఆధ్వర్యంలో గ్రామసభను తహసీల్దారు కె.శ్రీనివాసరావు నిర్వహించారు. తాత్కాలిక ఎంపీపీ పి.రాజన్న, జడ్పీటీసీ సభ్యురాలు కోళ్ల రమణమ్మ, తెదేపా మండల శాఖ అధ్యక్షులు కోళ్ల వెంకటరమణ పాల్గొని వెలుగు ఆధ్వర్యంలో చంద్రన్న బీమా పథకం కింద విద్యార్థులకు మంజూరైన ఉపకార వేతనాల పత్రాలను పంపిణీ చేశారు. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని, గిరిజనులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, గత జన్మభూమిలో పింఛన్ల కోసం ఇచ్చిన దరఖాస్తులు పరిష్కరించాలని, గ్రామంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని, గిరిజనుల సాగులో ఉన్న భూములకు 'డి'పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య తరఫున నాయకులు గిరిబాబు, నర్సింగరావు వినతిపత్రాలు అందజేశారు. ● రెల్లిలో సర్పంచి బోగాది జగదీశ్వరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఖరీఫ్‌లో వేసిన వరిపంట వర్షాభావం వల్ల దెబ్బతిందని ఆదుకోవాలని రైతులు కోరారు. రెల్లి ఎస్సీకాలనీ వాసులకు శ్మశానభూమి కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.

● చినరావుపల్లిలో సర్పంచి బి.రమణ అధ్యక్షతన ఎంపీడీవో పి.నారాయణరావు గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి పూర్తిస్థాయిలో చెల్లింపులు చేయకపోవడంపై పలువురు అధికారుల ముందు అసంతృప్తి వ్యక్తంచేశారు. గ్రామ సభలో ఈవోపీఆర్‌ఆర్‌డీ ఎన్.అప్పలనాయుడు, ఎంఈవో జి.శ్రీదేవి, విద్యుత్తుశాఖ ఏఈ రవి, వ్యవసాయ అధికారి స్వాతికుమారి, వెలుగు ఏపీఎం ఉమామహేశ్వరరావు, గ్రామీణ నీటి సరఫరా ఏఈ సన్యాసిరావు, జలవనరులశాఖ ఏఈఈ ఉమాశ్రీ, ఉపాధి హామీ ఏపీవో రత్నమాల పాల్గొన్నారు.

ఫిర్యాదుల వెల్లువ

ఓబలయ్యపాలెం(వేపాడ), న్యూస్‌టుడే: ముకుందపురం, ఓబలయ్యపాలెం, పాటూరు, బొద్దాం గ్రామాలలో మంగళవారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ముకుందపురంలో ప్రాథమిక పాఠశాలలోని ఆనందలహరి అభ్యసన కార్యక్రమాన్ని మండలాధ్యక్షురాలు దాసరి లక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో అధికారులంతా జన్మభూమి ప్రతిజ్ఞ చేశారు. పాటూరులో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఎన్టీఆర్ జలసిరిలో బోరుబావుల కోసం దరఖాస్తు చేసుకుంటే ఉపాధి అధికారులు సాధారణ జలసిరిలో నమోదు చేయడం వలన రాయితీని కోల్పోయామంటూ ముకుందపురం మాజీ సర్పంచి నాగిరెడ్డి కనకరాజు తదితరులు ఫిర్యాదు చేశారు. ఓడీఎఫ్‌లో భాగంగా నిర్మించుకున్న మరుగుదొడ్లు నిర్మించుకొని ఆరు నెలలు కావస్తున్నా బిల్లులు చెల్లించలేదంటూ ఓబలయ్యపాలెం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీవో కేవీఆర్.పట్నాయక్ హామీ ఇచ్చారు. జన్మభూమిలో ప్రోటోకాల్ పాటించలేదంటూ బొద్దాం గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు జనపురెడ్డి జగ్గారావు అధికారులను నిలదీశారు. ఎంపీటీసీ సభ్యురాలైన తన భార్య ఈశ్వరమ్మకు ఎటువంటి ఆహ్వానం పంపకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది కరవు గ్రామంగా ప్రకటించిన బొద్దాంలో చాలా మంది రైతులకు పరిహారం సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమ కాలేదని ఆరోపించారు. ఈ విషయంపై వ్యవసాయాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ పేర్కొన్నారు. తహసీల్దారు డి.పెంటయ్య స్పందిస్తూ ప్రోటోకాల్ విషయాన్ని జిల్లా అధికారులకు నివేదించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. మండల ఉపాధ్యక్షుడు గళ్ల శ్రీరాములు నాయుడు, తెదేపా నాయకులు గుమ్మిడి భారతి, జాగరపు రామునాయుడు, గొలగాని కృష్ణమూర్తి, జనపురెడ్డి ఈశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



బొద్దాంలో అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు జగ్గారావు

విరుచుకుపడిన అలలు..

- 50 మీటర్లు ముందుకొచ్చిన సంద్రం
- ముక్కాం తీరంలో కోత.. విధ్వంసం
- కూలిన కట్టడాలు, విద్యుత్తు స్తంభాలు
- భీతిల్లి సురక్షిత ప్రదేశాలకు స్థానికులు

భోగాపురం, న్యూస్‌టుడే: సముద్రంలో వస్తున్న మార్పులను అధికారులు గమనిస్తూ తీరప్రాంత మత్స్యకారులను అప్రమత్తం చేస్తుంటారు. ఎలాంటి హడావుడి లేకుండానే సముద్రం ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చితే విధ్వంసం ఎలా ఉంటుందో ఊహించుకోవాలంటే భయం వేస్తుంది. మంగళవారం భోగాపురం మండలం ముక్కాం తీరప్రాంతంలో ఇదే పరిస్థితి చోటుచేసుకుంది.



ముక్కాం దిగువ వీధిలో కోతకు గురైన సీసీ రహదారి

వేకువజామున ఒక్క ఉదుటున..

సోమవారం అర్ధరాత్రి 12గంటల వరకు ప్రశాంతంగా ఉన్న సముద్రం ఆతర్వాత ఉగ్రరూపం దాల్చింది. అలలు, గాలుల హోరుతో ఒక్కసారిగా పరిస్థితిలో మార్పు వచ్చింది.. తీరంలో కెరటాలు ఎగిసిపడుతున్నాయి. ఏమి జరుగుతుందోనని చలిగాలుల్లో బయటకొచ్చిన స్థానికుల కాళ్లకు అలలు తాకాయి.. అంతే ముప్పు ముంచుకొచ్చిందంటూ అరుపులు.. కేకలు. మంగళవారం వేకువజామున ముక్కాం తీరగ్రామంలో స్థానికులను కలవరపెట్టిన పరిస్థితులు. గతంలో హుద్‌హుద్ తుపాను సమయంలో కూడా ఇలాంటి విధ్వంసం కనిపించలేదు. సముద్రం 50మీటర్లకు పైగా ముందుకొచ్చింది. అలల తాకిడికి గృహ సముదాయాలకు ఉన్న రక్షణగోడ కూలిపోయింది. గత రెండురోజులుగా సముద్రంలో సాధారణ మార్పులే కనిపించాయి. అమావాస్య, పౌర్ణమి సమయాల్లో ఆటుపోట్లు సహజంగా ఉంటాయి. అలలు కాస్త ముందుకొస్తుంటాయి. ఈ పౌర్ణమినాడు అలల ఉద్ధృతి ఎక్కువై కకావికలం చేసింది. తీరం కోతకు గురవ్వడంతో సిమెంటు రోడ్డు, విద్యుతు స్తంభాలు దెబ్బతిన్నాయి. గత 50ఏళ్లలో ఇలాంటి అలజడిని ఎప్పుడూ చూడలేదని స్థానికులు, మత్స్యకారులు చెబుతున్నారు. రాత్రివేళ చీకటల్లోనే ఒడ్డున ఉన్న ఇళ్లను ఖాళీ చేసి ఎగువవీధికి కుటుంబాలు చేరుకొని తలదాచుకోవలసి వచ్చింది. అలల ధాటికి మూడు విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోగా.. ఇటీవల వేసిన సీసీ రహదారి అడుగు భాగంలో కోతకు గురైంది. గతంలో నిర్మించిన రక్షణగోడ పూర్తిగా ధ్వంసమైంది. సూర్యుడు ఉదయించే సమయానికి అలలు కాస్త నెమ్మదించగా.. ఉదయం 9గంటల కల్లా సముద్రం వెనక్కి తగ్గి మామూలు పరిస్థితి ఏర్పడింది. విధ్వంస జాడ మాత్రం మిగిలింది. ఎళ్లీ ఎక్కడ అలలు ఎగిసిపడతాయోనన్న భయంతో స్థానికులు ఇళ్లను వీడి ఎగువ వీధిలో ఉన్న బంధువుల వద్ద తలదాచుకుంటున్నారు. ప్రభుత్వం సత్వర స్పందించి రక్షణ గోడ పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.



ముక్కాం రెండో వీధిలో పూర్తిగా కూలిన రక్షణగోడ

ఇలాంటి పరిస్థితి చూడలేదు..



నేను సముద్రంపై వేట మాని 15ఏళ్లు అవుతోంది. గత 50ఏళ్లలో అలలు ఇంతలా ముందుకొచ్చి భయభ్రాంతులు చేసిన పరిస్థితి చూడలేదు. హుద్‌హుద్ తుపాను సమయంలోనూ సముద్రం ఇంతలా ముందుకు రాలేదు. పౌర్ణమి, అమావాస్యలకు ఆటుపోట్లు సహజమే కాని ఇంత తీవ్రత ఎప్పుడూ లేదు.

– నూకన్న, గ్రామస్థుడు, ముక్కాం

చాలా భయం వేసింది..



అర్ధరాత్రి సమయంలో ఏమి చేయలేని పరిస్థితి. చాలా భయం వేసింది. ఒడ్డున ఉన్న ఇళ్లలో ఉన్న అందరం ఆందోళన చెందాం. వెంటనే వెనుక వీధిలో ఉన్న బంధువుల ఇళ్లకు వెళ్లిపోయాం. మేము చూస్తుండగానే అలల కోతకు గురై.. సీసీ రహదారి ఒకవైపు ధ్వంసమై పోయింది. అధికారులు వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలి.

– అంకమ్మ, గ్రామస్థురాలు, ముక్కాం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

ముక్కాం తీరంలో పరిస్థితిని పరిశీలించాం. చాలా వరకు కోతకు గురైంది. రక్షణగోడతో పాటు సీసీ రోడ్డు, విద్యుత్తు స్తంభాలు దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

– సైదానాయక్, మత్స్యశాఖ అధికారి

‘అమ్మ’కానికి అద్దె గర్భం..?

బాధితులను విచారిస్తున్న పోలీసులు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నీ పరిస్థితి చూస్తే చాలా బాధగా ఉంది. పేదరికంతో ఇలా ఎన్నాళ్లు ఉంటావ్. ఒక పనిచేయ్. నీ గర్భంలో ఒకరి వీర్యకణాలను ఉంచి.. ఒక బిడ్డను కని అవతలి వ్యక్తికి ఇస్తే నీకు రూ. 7లక్షల నుంచి రూ. 8లక్షల వరకు వస్తాయ్. అందాక ఈ మందులు వాడండంటూ కొంత మంది యువతుల నుంచి డబ్బులు వసూలు చేసి పరారైన ఘటన ఇది. పేద యువతులే లక్ష్యంగా వల వేసి ప్రలోభాలు పెడుతున్నట్లు ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. అయితే ఇందులో ఎంత వరకు వాస్తవం ఉందనేది పోలీసుల విచారణలో తేలనుంది. భీమిలి నుంచి వచ్చిన ఒక మహిళ మధ్యవర్తిగా అవతారం ఎత్తి పేద మహిళలు ఉన్న చోటికి వెళ్లి గర్భసంచి బేరసారలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పట్టణంలో ఒక ఇంట్లో అందరూ సమావేశమైనట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆ ఇంటిని చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. కొందరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కొంచెం నీరసంగా ఉన్న మహిళలను ఎంచుకొని రేపు లక్షల్లో డబ్బులు వస్తాయి.. ఇప్పటి నుంచే బాగా తినాలంటూ ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ మందులు, ఇంజక్షన్లు ఇస్తాను వాడండని వారి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై సంబంధిత స్టేషన్ పోలీసులను ‘న్యూస్‌టుడే’ వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామని, ఇందులో ఎంత వాస్తవం ఉందనేది తేలాల్సి ఉందని రెండో పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

ఎస్సీల వర్గీకరణతోనే అభివృద్ధి సాధ్యం

బల్లంకి(వేపాడ), న్యూస్‌టుడే: ఎస్సీల వర్గీకరణతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ మాదిగ మంగళవారం అన్నారు. బల్లంకి గ్రామంలో ఉపవాస దీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో మాదిగ, రెల్లి, పైడి, గోసంగి వంటి ఎస్సీ ఉప కులాలు సంక్షేమ, అభివృద్ధి, రాజకీయ రంగాల్లో వెనుకబడిపోయాయని ఆరోపించారు. దళితుల్లో సమానత్వం రావాలంటే ఎస్సీల వర్గీకరణ అవసరం అని జస్టిస్ రామచంద్రయ్య, జస్టిస్ ఉషామెహ్రా కమిషనులు సిఫారసు చేశాయన్నారు. గతంలో యూపీఏ, ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వాలు ఎస్సీల వర్గీకరణకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయన్నారు. తక్షణమే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త కనితి సోమనాథం, కె.చిన్నారావు, బి.అప్పారావు పాల్గొన్నారు.



బల్లంకిలో దీక్షలు చేస్తున్న ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు

ముఖ్యమంత్రి సభకు నేతల సన్నాహాలు

బొబ్బిలిలో 5న జన్మభూమికి హాజరు



పురపాలక కార్యాలయంలో సీఎం ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహించిన ప్రత్యేకాధికారి గణపతిరావు, పురపాలక అధ్యక్షురాలు అచ్యుతవల్లి

బొబ్బిలి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 5వ తేదీన బొబ్బిలి జన్మభూమి సభకు హాజరవుతున్నట్లు స్థానిక నాయకులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు ఏర్పాట్లు చేపడుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో కూడా అధికారులు మంగళవారం సాయంత్రం సమావేశాలు ఏర్పాటు చేసుకుని సమాయత్తమయ్యారు. బొబ్బిలి పురపాలక సంఘంలో కూడా ప్రత్యేకాధికారి గణపతిరావు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి సభకు హాజరవుతున్న నేపథ్యంలో అధికారులు పక్కాగా ఉండాలన్నారు. పురపాలక అధ్యక్షురాలు తూముల అచ్యుతవల్లి కూడా అధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకుని పింఛన్లు, రేషన్‌కార్డులు అర్హులకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. 20వ వార్డులో సభ జరుగుతున్నందున మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంత్రి సుజయ్‌కృష్ణరంగరావు కూడా మంగళవారం సాయంత్రం కోటలో పార్టీ ముఖ్యులతో సమావేశమయ్యారు. సీఎం రాకపై చర్చించారు. తొలుత రాజా కళాశాల మైదానంలో సభను ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. ఇక్కడైతే పార్కింగు స్థలం లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా రైల్వే వంతెన దిగువన విశాలంగా ఉన్న స్థలంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. పారిశ్రామికవాడలో హెలిప్యాడ్ ఉన్నందున అక్కడినుంచి నేరుగా వంతెన దిగువకు చేరుకునేందుకు అవకాశం ఉంది. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు. పోలీసులు కూడా ఇక్కడే బాగుంటుందని సూచిస్తున్నారు. ఇంతవరకు మైదానం ఖరారు కాలేదు. బుధవారం మంత్రి సుజయ్, కలెక్టర్ వివేక్‌యాదవ్, ఎస్పీ పాలరాజులు పరిశీలించి ఖరారు చేసే అవకాశం ఉంది.

ఉత్సాహభరితంగా కూచ్‌బిహార్ ట్రోఫీ మ్యాచ్

తొలి ఇన్నింగ్స్‌లో కుప్పకూలిన ఆంధ్రా జట్టు





అత్యధికంగా 95 పరుగులు సాధించిన ఆంధ్రా ఆటగాడు వంశీకృష్ణ, వంశీకృష్ణ ఔట్‌ను అప్పీలు చేస్తున్న గుజరాత్ ఆటగాళ్లు

డెంకాడ, న్యూస్‌టుడే: కూచ్ బిహార్ ట్రోఫీలో భాగంగా డెంకాడ మండలంలోని చింతలవలస వద్ద ఉన్న డాక్టర్ పీవీజీ రాజు-ఏసీఏ స్పోర్ట్సు కాంప్లెక్స్ మైదానంలో మంగళవారం ఆంధ్రా-గుజరాత్ జట్ల మధ్య అండర్-19 క్రికెట్ మ్యాచ్ ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. ముందుగా టాస్ గెలిచిన ఆంధ్రాజట్టు బ్యాటింగ్‌ను ఎంచుకుంది. మిడిల్ ఆర్డర్ కుప్పకూలడంతో తొలి ఇన్నింగ్స్‌లో మొత్తం 55.3 ఓవర్లలో 201 పరుగులకే ఆలౌట్ అయింది. గుజరాత్ బౌలర్ల ధాటికి ఆంధ్రా ఆటగాళ్లు వరుసగా వికెట్లు కోల్పోయారు. వీరిలో వంశీకృష్ణ 141 బంతుల్లో 17 ఫోర్లు కొట్టి అత్యధికంగా 95 పరుగులు సాధించగా, కె.మహీప్ కుమార్ 26, మునీష్‌వర్మ 27 పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లు ఆకాష్‌పాండే 3, కె.ఆర్.పటేల్ 3, ఎస్.ఎస్.సూర్యల్ 2 చొప్పున వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన గుజరాత్ జట్టు 32 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 71 పరుగులు చేసింది. ఈ జట్టులో హెట్ 92 బంతుల్లో 6 ఫోర్లు కొట్టి 36 సాధించగా ఉమ్రిగర్ 32, వి.డి.షాహు 2 పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు. రెండోరోజు ఉదయం 9.30 గంటల నుంచి మ్యాచ్ యథావిధిగా కొనసాగుతుందని ఏసీఏ ప్రతినిధులు తెలిపారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ సాధారణమే

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: ప్రతి ఉద్యోగికి బదిలీ, ఉద్యోగ విరమణ సాధారణమే అయినప్పటికీ పనిచేసే కాలంలో సంపాదించుకున్న వృత్తిపరమైన సవాళ్లే ప్రశంసలుగా నిలిచిపోతాయని కలెక్టర్ వివేక్ యాదవ్ అన్నారు. పార్వతీపురం సబ్ డివిజన్ ఏఎస్పీగా పనిచేసి విశాఖపట్నం పాడేరు సబ్ డివిజన్ ఏఎస్పీగా బదిలీ అయిన అమిత్ బర్దర్‌ను సోమవారం రాత్రి ఎస్పీ నివాసంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన బర్దర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్పీ జి.పాలరాజు, ఓఎస్‌డీ విక్రాంత్ పాటిల్, అదనపు ఎస్పీ ఏవీ రమణ, పార్వతీపురం ఏఎస్పీ దీపికా పాటిల్, పలువురు డీఎస్పీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం, కుటుంబం రెండుకళ్లు

పార్వతీపురం, న్యూస్‌టుడే: పోలీసులకు విధి నిర్వహణ, ఉద్యోగ బాధ్యతలు ఎంత కీలకమో, కుటుంబ బాగోగులు చూడడం కూడా అంతే కీలకంగా భావించాలని పార్వతీపురం ఏఎస్పీగా పనిచేసి బదిలీపై పాడేరు వెళ్తున్న అమిత్‌బర్దర్ అభిప్రాయపడ్డారు. మంగళవారం పార్వతీపురం పోలీసు సబ్‌డివిజనులోని ఎల్విన్‌పేట, సాలూరు, పార్వతీపురం సర్కిళ్ల ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు ఆయన్ను వీడ్కోలు పలికారు. ఉద్యోగంలోకి వచ్చిన వారంతా దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారేనన్నారు. ఈస్థాయికి వచ్చేందుకు ఎంత శ్రమించారో, ఎంత నిబద్ధతతో వ్యవహరించారో బాధ్యతలు నిర్వహణలో కూడా అంతే నిబద్ధతతో ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్వతీపురం సర్కిల్ ఇన్‌స్పెక్టరు జి.రాంబాబు, ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టరు జి.రాము, సాలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టరు సంజీవరావు, డివిజనులో పనిచేస్తున్న సబ్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. బదిలీపై వెళ్తున్న ఏఎస్పీని దుశ్శాలువాతో సత్కరించారు.



అమిత్ బర్దర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన మోహనరావు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: లక్కవరపుకోట బీసీ కాలనీకి చెందిన గండ్రేటి మోహనరావు అండర్-19 జాతీయస్థాయి టెన్నిస్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యానన్నాడు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచి బెస్‌ప్లేయర్‌గా (విక్కీ కీపర్‌గా) ఎంపికై జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలియజేశాడు. జాతీయస్థాయి పోటీలు ఈ నెల 14 నుంచి 18 వరకు హైదరాబాదులో నిర్వహిస్తారని తెలిపాడు. ఈ సందర్భంగా గ్రామస్థులు, స్నేహితులు యువకుడిని అభినందించారు. జాతీయస్థాయిలో రాణించాలని ప్రోత్సహించారు

పలువురు సీఐలకు స్థానచలనం

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరం పట్టణంలో పలువురు సీఐలకు స్థాన చలనం చేస్తూ రేంజ్ డీఐజీ సీహెచ్ శ్రీకాంత్ ఉత్తర్వులు విడుదల చేశారు. స్పెషల్ బ్రాంచ్ సీఐగా ఉన్న బీవీజే రాజు రెండో పట్టణ సీఐగా, ఇక్కడ ఇన్‌ఛార్జి సీఐగా విధులు నిర్వర్తిస్తున్న రఘు శ్రీనివాస్‌ను డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. రెండో పట్టణ సీఐగా పనిచేస్తున్న సమయంలో అనిశాకు పట్టుబడిన ఇ.నర్సింహమూర్తిను స్పెషల్ బ్రాంచ్‌కు అటాచ్ చేశారు. ప్రస్తుతం ఈయన సస్పెన్షన్‌లో ఉన్నారు. డీసీఆర్‌బీ సీఐ జి.రామకృష్ణను విజయనగరం స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. వీరంతా ఆయా విభాగాల్లో బాధ్యతలు స్వీకరించారు.

అంతర వైద్య కళాశాలల క్రీడా పోటీల్లో

ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా మిమ్స్



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన క్రీడాకారులతో మిమ్స్ కళాశాల ఛైర్మన్ మూర్తిరాజు తదితరులు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: గుడివాడలో జరిగిన అంతర వైద్య కళాశాలల క్రీడా పోటీల్లో మిమ్స్ హోమియో కళాశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నట్లు కళాశాల వ్యాయామ అధ్యాపకుడు కె.కళావెంకటరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నెల్లిమర్ల మిమ్స్ హోమియో వైద్య కళాశాల క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారని చెప్పారు. మహిళా విభాగంలో వాలీబాల్, త్రోబాల్ పోటీల్లో ప్రథమస్థానం, బ్యాడ్మింటన్‌లో ద్వితీయస్థానం సాధించగా.. పురుషుల విభాగంలో క్రికెట్‌లో ద్వితీయస్థానం పొందినట్లు వివరించారు. అథ్లెటిక్స్ విభాగంలో లాంగ్‌జంప్, 100, 200 మీటర్ల పరుగులో ప్రియాంక ప్రథమస్థానం సాధించగా.. యశ్వసి డిస్కస్‌త్రోలో ద్వితీయ, 4100 రిలే పరుగులో ప్రథమస్థానంలో నిలిచిందని చెప్పారు. పురుషుల విభాగంలో లోకేష్ డిస్కస్‌త్రో, షాట్‌పుట్‌ల్లో, రవితేజ 100, 200 మీటర్ల పరుగులో ద్వితీయస్థానాలు సాధించారన్నారు. మిమ్స్ ఫిజియోథెరపీ కళాశాల విద్యార్థులు పురుషులు, మహిళల విభాగాల్లో టేబుల్ టెన్నిస్‌లో ద్వితీయస్థానం, షాట్‌పుట్, సాహిత్యం పోటీల్లో ప్రథమస్థానం సాధించినట్లు చెప్పారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను మిమ్స్ ఛైర్మన్ మూర్తిరాజు, మేనేజింగ్ ట్రస్టీ సత్యన్నారాయణరాజు, లైఫ్‌ట్రస్టీలు ప్రవీన్ వర్మ, దిలీప్‌వర్మ, డీన్ టీపీవీ. నారాయణరాజు, ప్రిన్సిపల్ లక్ష్మీకుమార్, సూపరింటెండెంట్ రఘురామ్, హోమియో డైరెక్టర్ నర్సింహారావు, హోమియో ప్రిన్సిపల్ శ్రీధర్, ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ రవికుమార్ అభినందించారు.

కొత్త పింఛను ఎవరిని వరించెనో..!

● పల్స్ సర్వేలో ఉంటేనే అర్హులు



పింఛన్లు తీసుకుంటున్న వృద్ధులు

ప్రభుత్వం సామాజిక పింఛన్లను ఐదు రేట్లు పెంచి నిరుపేదలకు ఆర్థిక భరోసా ఇస్తోంది. దీనికి తోడు కొత్తగా మంజూరు చేసింది. గతంలో నిర్వహించిన ప్రజాసాధికార సర్వే ఆధారంగా అర్హులని గుర్తించి మంజూరు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో అధికారులు అర్హులను గుర్తించే పనిలోపడ్డారు.

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే:

అగ్గి తెగులు: ఈ తెగులు నారుమడిలోను, తరువాత నాటిన పంటను ఆశిస్తుంది. ఎదిగిన మొక్కల ఆకులు కణుపులు, వెన్నులపైన దారపు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చల చుట్టూ ఎరుపు గోధుమరంగు అంచులు ఉంటాయి. కణుపులపై తెగులు ఆశిస్తే కణుపులు విరగుతాయి. వెన్నుపై ఆశిస్తే గింజలు తాలుగా మారుతాయి. దీని నివారణకు పంట పొలాల్లో కలుపు మొక్కలు లేకుండా చూడాలి. ముందు జాగ్రత్త చర్యగా విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. ఈ తెగులను తట్టుకునే రత్నగిరి, శ్రీచైతన్య, భారతి రకాలను ఎంపిక చేసుకోవాలి. మొక్కలపై అక్కడక్కడా మచ్చలు కనిపించినప్పుడు లీటరు నీటికి 1 గ్రాము కార్బెండిజిమ్ చొప్పున కలిపి పిచికారి చేయాలి. నత్రజని ఎరువులను సిఫారసుకు మించి వాడరాదు. నారు నాటే ముందు బ్లైటాక్స్ లేదా మాంకోజెబ్ 3 గ్రా., లీటరు నీటికి చొప్పున కలిపిన ద్రావణంలో నారును ముంచి శుద్ధి చేసి నాటడం ద్వారా పంటను మొదటి దశల్లో ఆశించే తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చు. వెదజల్లి విత్తే పద్ధతిలో .3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి.

– న్యూస్‌టుడే, ఒంటిమిట్ట



అగ్గి తెగులు

వ్యాధి సోకిన జీవాలకు చికిత్స

జీవాలకు వ్యాధి సోకినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. సన్న జీవాలకు వ్యాధిని తట్టుకునే శక్తి తక్కువ. అందుకే వ్యాధి సోకినట్లు అనుమానం వచ్చిన వెంటనే చికిత్స ప్రారంభించటం మంచిది. ఎంత త్వరగా చికిత్స ప్రారంభిస్తే అంత త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.



- ★ వ్యాధి సోకిన జీవాలను మంద నుండి వేరుచేసి ప్రత్యేకంగా చికిత్స చేయాలి. మందతో పంపించటం వల్ల వ్యాధి తీవ్రత ఎక్కువవుతుంది. వ్యాధి ముదిరితే చికిత్స కష్టంగా మారుతుంది.
- ★ వ్యాధి సోకినప్పుడు యాంటిబయాటిక్ ఇంజక్షన్లు వైద్యుల సలహా ప్రకారం వాడాలి.
- ★ జ్వరం తగ్గటానికి పారాసిటమాల్ ఇంజక్షన్లు, నొప్పులు, వాపులు తగ్గటానికి తగిన మందులు వాడాలి.
- ★ నీరసం, ఆకలిలేమి తగ్గటానికి, మేత మేయటానికి బీ-కాంప్లెక్స్, లివర్‌కు సంబంధించిన ఇంజక్షన్లు వాడితే ప్రయోజనం ఉంటుంది.
- ★ డీహైడ్రేషన్ తగ్గటానికి డెక్ట్రోజ్ సెలైన్ రక్తనాళాల్లోకి ఎక్కించాలి.
- ★ నోటిపుండ్లను 1 శాతం పొటాషియం పర్మాంగనేటు ద్రావణంతో శుభ్రం చేసి, జింక్ ఆక్సైడ్ ఆయింట్‌మెంట్ పూయాలి. ముఖంపైన, కాళ్లపైన పుండ్లకు ఈగ, దోమలు వాలకుండా వేపనూనె వంటివి వాడాలి.
- ★ జీవాలు వ్యాధులకు గురయినప్పుడు మేత మేయక నీరసంతో చనిపోతుంటాయి. ఈ జీవాల సంరక్షణపై ప్రత్యేకదృష్టి సారించకపోతే ఇబ్బందులు తలెత్తుతాయి. రాగి, జొన్న జావ లేదా అరటిపళ్లు తినిపించాలి. అందులో చిటికెడు ఉప్పు, కొద్దిగా బెల్లం కలిపి ఇవ్వాలి. నమిలేందుకు వేపాకు లేత కొమ్మలు అందుబాటులో ఉంచాలి. విరేచనాలతో బాధపడుతూ, మరీ నీరసంగా ఉన్న జీవాలకు కొబ్బరి నీళ్లు తాగించాలి.
- ★ యాంటిబయాటిక్ మందుల్ని విచక్షణారహితంగా వాడకూడదు. ఈ మందుల వాడకం ప్రారంభిస్తే 3-5 రోజులపాటు వరుసగా వాడాలి. అలాకాకుండా మధ్యలో మందులు మార్చకూడదు.
- ★ పొటాషియం పర్మాంగనేటు ద్రావణాన్ని చిక్కగా తయారుచేసి వాడితేనే ప్రయోజనం ఉంటుందన్నది అపోహ మాత్రమే. ఎక్కువ మోతాదులో వాడితే దుష్ఫలితాలు ఉంటాయి.

ఒడుదొడుకులు ఎలా ఎదుర్కోవాలి

● విద్యార్థి దశలోనే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు గురువులకు శిక్షణ ● సామాజిక కార్యక్రమాలపై అవగాహనకు ఐటీడీఏ అడుగులు



గుడారాల నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతిఒక్కరూ ఉరుకులు, పరుగులతో జీవనం సాగిస్తున్నారు. మానవతా విలువలకు సైతం తావులేకుండా స్వార్థపూరిత ప్రయోజనాలకే తొలిప్రాధాన్యం ఇస్తున్నారు. అలాంటి నేపథ్యంలో విద్యార్థి దశ నుంచే సామాజిక కార్యక్రమాలు, విపత్తులను ఎదుర్కోవడం, ఆపదలు వచ్చే సమయాల్లో తమవంతు ఎలా సాయం చేయడం, నిత్య జీవితంలో మానవుడు ఎడారి ప్రాంతానికి వెళ్లినా అక్కడి పరిస్థితులను తట్టుకోవడం, వ్యాయామం, పరిశుభ్రత తదితర అంశాలపైన ఉపాధ్యాయుల నుంచి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పార్వతీపురం ఐటీడీఏ పీవో లక్ష్మీశ ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఇప్పటికే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నూతన హంగులు కల్పించిన పీవో హైదరాబాద్‌కు చెందిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో తొలిదశగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు ఇటీవల గుమ్మలక్ష్మీపురం వైటీసీలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మునుపెన్నడు లేనివిధంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపైన శిక్షణ ఇవ్వడం ఇదే తొలిసారి. 27 మంది గైడ్స్ (స్త్రీలు), 37 మంది స్కౌట్స్ (పురుషులు)కు వారం రోజులపాటు రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు హైదరాబాద్ నుంచి వచ్చిన ఐదుగురు ప్రత్యేక శిక్షకులు అనేక అంశాలపైన అవగాహన కల్పించారు. శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులకు భోజన సౌకర్యంతో పాటు, ఏకరూప దుస్తులు, బూట్లు ఐటీడీఏ అధికారులే అందజేశారు.

సామాజిక అంశాలపైనా శిక్షణ

ఉపాధ్యాయులకు సామాజిక అంశాలపైన ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా వ్యాయామం, ఆరోగ్యం, సమాజంలో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలు, అగ్నిప్రమాదాలు, వరదలు సంభవించినప్పుడు చేయాల్సిన సాయం, మంటల్లో చిక్కుకున్నవారిని రక్షించడం, నీటిలో మునిగిపోయిన వారిని ఎలా రక్షించవచ్చు, ఎత్తయిన భవనాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే తాళ్ల సహాయంతో ఎలా పైకి చేరుకోవాలి, తాళ్లకు ఎలా ముడులు వేయాలి వంటి అంశాలను క్షుణ్ణంగా వివరించారు. అటవీ, ఎడారి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు, విపత్తులు సంభవించే సమయాల్లో సేదతీరేందుకు తక్కువ సమయంలోనే గుడారాలు నిర్మించే విధానం, దట్టమైన అటవీ ప్రాంతం నుంచి గమ్యానికి చేరుకోవడం, రోజంతా అలసిపోయినప్పుడు ఉపశమనం పొందేందుకు చేయాల్సిన అంశాలపైనా శిక్షణ ఇస్తున్నారు.

ఇలా వివరిస్తారు

శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు వివరించాల్సి ఉంటుంది. విద్యార్థులను గ్రూపులుగా విభజించి, ప్రవేశం, ప్రథమ, ద్వితీయ, తృతీయ అంశాలపైన బోధించాల్సి ఉంటుంది. అనంతరం రాష్ట్రస్థాయి ఆదేశాలకు అనుగుణంగా జిల్లా స్థాయిలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గవర్నర్ సంతకంతో ఉన్న 'రాజ పురస్కార్' ధ్రువపత్రాలను అందజేస్తారు. అనంతరం ఆరునెలల తరువాత నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు రాష్ట్రపతి సంతకంతో ఉన్న ధ్రువపత్రాలను ఇవ్వనున్నారు. అంతేగాక రాష్ట్రపతి పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి తప్పకుండా రైల్వే శాఖలో ఉద్యోగం వస్తుందని శిక్షకులు చెబుతున్నారు.



ఎత్తైన ప్రాంతాలకు తాళ్ల సాయంతో వెళ్లేందుకు ముడులు వేసే విధానంపై శిక్షణ

ప్రయోగాత్మకంగా వివరిస్తున్నాం



విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించేందుకు ఐటీడీఏ పీవో ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు ఇచ్చిన శిక్షణలో ప్రయోగాత్మకంగా వివరించాం. ఆపదలు వచ్చే సమయాల్లో ఎలా ఎదుర్కోవాలి, గుడారాల నిర్మాణం, భవనాలు, నదులు, కొండలను చూసి వాటి విస్తీర్ణం, కొలతలను ఎలా చెప్పాలి. పర్వతారోహణ వంటి అంశాలను తెలియజేశాం. ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.

- కేపీఆర్‌బీ శర్మ, శిక్షకుడు, హైదరాబాద్

విద్యార్థులకు వివరిస్తాం..



విద్యార్థులకు సామాజిక అంశాలపైన అవగాహన కల్పించేందుకు ఇస్తున్న శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు వివరిస్తాం. శిక్షకులు అందజేసిన పుస్తకాలను విద్యార్థులకు బోధించి పరీక్షలకు సన్నద్ధం చేస్తాం. చదువుతో పాటు సామాజిక, నైతిక విలువలతో కూడిన అంశాలు విద్యార్థి దశనుంచే అందించేందుకు ఐటీడీఏ అధికారులు శ్రీకారం చుట్టడం గొప్ప విషయం.

- ఎం.వాసుదేవరావు, వ్యాయమ ఉపాధ్యాయుడు, పార్వతీపురం

చదువుపై ప్రత్యేక దృష్టిసారించే అవకాశం



ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాక సామాజిక, నైతిక, దేశభక్తి, క్రమశిక్షణ, సేవాగుణం తదితర అంశాలపైన పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో శిక్షణ ఏర్పాటు చేశాం. ఉపాధ్యాయులంతా ఉత్సాహంగా శిక్షణలో పాల్గొన్నారు. విద్యార్థులు కొత్తగా కనిపిస్తుండడంతో తల్లిదండ్రుల్లో కూడా చైతన్యం వస్తుంది. ఇలాంటి కార్యక్రమాలు వలన విద్యార్థులు చదువుపైన ప్రత్యేక దృష్టిసారించే అవకాశం ఉంటుంది. విద్యార్థులచే క్షేత్రస్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు చేపడతాం.

- జి.లక్ష్మీశ, ఐటీడీఏ పీవో

రైల్వే చర్యలతో ఇక్కట్లు



సిమెంటు దిమ్మల పైనుంచి రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనాలు

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస రైల్వేగేటు వద్ద కొత్తవలస-కిరండూల్ రైలుమార్గం ఓవరాయలింగ్ పనుల్లో భాగంగా పట్టాల మధ్య రహదారిని తవ్వేసి పనులు పూర్తిచేయకపోవడంతో వాహనాల రాకపోకలకే కాకుండా పాదచారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిని తవ్వేసి ఇప్పటికే వారం రోజులు అవుతుంది. పట్టాల మధ్య ఉన్న రహదారిని తవ్వేసి సిమెంటు దిమ్మలు వేశారు. దీనివల్ల వాటిని దాటే సమయంలో వాహనాలు మొరాయిస్తున్నాయి. పాదచారులు ఏమాత్రం ఏమరపాటుగా నడిచినా పడిపోతున్నారు. దీనివల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ సమస్యను రైల్వే పీడబ్ల్యూఐ గౌరినాయుడు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించింది. రైలుపట్టాలు ఓవరాయిలింగ్ పనుల కోసం రహదారి తవ్వినట్లు చెప్పారు. మరోలైను తవ్వవలసి ఉందన్నారు. ఈ పని బుధవారం మొదలు పెడతామని వారం రోజుల్లోగా బీటీ(తారు) రహదారి వేస్తామని చెప్పారు. అంతవరకు వాహన చోదకులు, ప్రజలు సహకరించాలని కోరారు.

'అనర్హులకు జె.గుమడాం అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు'

విజయనగరం గంటస్తంభం, న్యూస్‌టుడే: బొండపల్లి మండలంలోని జె.గుమడాం అంగన్‌వాడీ కార్యకర్త పోస్టును అనర్హులకు కేటాయించారని ఆ గ్రామానికి చెందిన ఎల్.ఆదిలక్ష్మి, ఎల్.విజయకుమారి, ఎస్.వనిత, ఎం.రాజేశ్వరి ఆరోపించారు. ఇందుకు సంబంధించి ఆధారాలను అధికారులకు చూపించారు. ఈ మేరకు మంగళవారం స్త్రీ, శిశు సంక్షేమశాఖ పథక సంచాలకులు కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు విలేకరులకు వారు తెలిపారు. ఇటీవల జె.గుమడాం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానించారని చెప్పారు. అన్ని అర్హతలూ ఉన్న తాము దరఖాస్తు చేసుకున్నామన్నారు. మౌఖిక పరీక్షలకు సైతం హాజరయ్యామని చెప్పారు. స్థానికులకు కాకుండా యడ్లపాలేనికి చెందిన తాడ్డి ఆదిలక్ష్మికి పోస్టు కేటాయించారని తెలిపారు. రాజకీయ అండదండలతోనే ఆమెకు ఉద్యోగం కల్పించారని ఆరోపించారు. గ్రామ స్థిర నివాసి కానుందన తక్షణమే ఆమెను తొలగించాలని డిమాండ్ చేశారు.

అంపకానికి బయలుదేరిన పెద పోలమాంబ



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న పూజారి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు

శంబర,(మక్కువ), న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శ్రీ శంబర పోలమాంబ మేనత్త అయిన పెదపోలమాంబ అంపకోత్సవానికి బయలుదేరారు. మంగళవారం మధ్యాహ్నం అమ్మవారి చదురుగుడి వద్ద ఘటాలకు ప్రత్యేక పూజలు చేసి అలంకరణతో తీసుకువెళ్లారు. ముందుగా గ్రామంలోని తొలి పూజ అందుకునేందుకు గిరడ వారింటికి, రెండవ పూజ అప్పటి మునుసుబు ఇంటికి, తదుపరి పూజలకు పూడి వారింటికి అమ్మవారిని తీసుకువెళ్లారు. అక్కడ నుంచి గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగింపు నిర్వహించి అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. అర్ధరాత్రి వరకు గ్రామంలో ఊరేగింపు నిర్వహించి యాత్రస్థలం గద్దె వద్దకు తీసుకువచ్చి విశ్రాంతి తీసుకున్నారు. ఆ సమయంలో ఏర్పాటు చేసిన వినోద కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొన్నారు. బుధవారం ఉయ్యాలా కంబాలా నిర్వహించి అంపకోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు అధ్యక్షులు వసంతల భాస్కరరావు, మాజీ అధ్యక్షులు పూడి దాలినాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంలో గ్రామీణ వైద్యుల పాత్ర కీలకం

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో గ్రామీణ వైద్యుల పాత్ర కీలకమని జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు స్వాతిరాణి అన్నారు. గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా శాఖ సమావేశం మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె గ్రామీణ వైద్యుల సేవలు, వారి భవిష్యత్తు బాధ్యతలపై పలు సూచనలు చేశారు. అనంతరం కాలమానిని ఆవిష్కరించి నిర్వాహకులకు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్ఎంపీ కార్యదర్శి డాక్టర్ గణపతిరావు, సంయుక్త కార్యదర్శి అచ్చిరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు జంగం జోషి, అధ్యక్ష, కార్యదర్శులు జి.చిరంజీవి, ఎఎఎన్ శర్మ, జోనల్ కన్వీనర్ ఐ.గోపి, సలహాదారులు సూర్యనారాయణ, ఎస్.రాజశేఖర్, రామరాజు, కనకాచారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్వాతిరాణి

సంక్రాంతికి తాగునీరందిస్తాం

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: తాటిపూడి జలాశయం నుంచి పైలట్ ప్రాజెక్టుగా శుద్ధిచేసిన తాగునీటిని గ్రామాలకు అందజేస్తున్న పనులు వేగవంతంగా చేస్తున్నామని ప్రాజెక్టు డీఈఈ వై.గోవిందరావు అన్నారు. మంగళవారం ధర్మసాగరం చెరువు సమీపంలో వేస్తున్న పైపులైన్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటివిడతగా రూ.30 కోట్ల అంచనా వ్యయంతో 30 గ్రామాలకు తాగునీటిని అందజేస్తున్నామన్నారు. రెండవ విడతగా 71 గ్రామాలకు తాగునీటిని అందించడానికి రూ.45 కోట్లతో చేపట్టిన పనులు సాగుతున్నాయని, ఇప్పటికే 95 శాతం పనులు పూర్తాయినట్లు తెలిపారు. ఎల్.కోటలో నిర్మించిన అతిపెద్ద ట్యాంకుకి నీటిని ఎక్కించే పనులు ట్రయల్ నిర్వహించామన్నారు. సంక్రాంతికి సుమారు 60 గ్రామాలకు నీటిని అందజేస్తామన్నారు. మూడో విడతగా రూ.90 కోట్లతో అంచనా వ్యయం రూపొందించామని ఇంకా నిధులు మంజూరు కాలేదని తెలిపారు.



ధర్మసాగరం చెరువు సమీపంలో పైపులైన్ల పనులను పరిశీలిస్తున్న డీఈఈ గోవిందరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ప్రసాద్



అనగనగా ఓ ఊరుంది... అక్కడంతా బోలెడు వజ్రాలు.... ఎన్నంటే టన్నులకు టన్నులు... ఏ గోడ చూసినా వజ్రాలే... ఏ గుంజ చూసినా అవే... అయితే వాటిని ఎవ్వరూ తియ్యరు... అస్సలు పట్టించుకోరు... ఎందుకో? ఏంటో?

తళుకుల్ బెళుకుల్... ఊరంతా వజ్రాల్!



ఎక్కడైనా వజ్రాలు దొరుకుతాయంటే అంతా వెళ్లి గబగబా ఏరేసుకుందాం అనుకుంటాం. అయితే ఓ చిన్న టౌనుంది. ఎక్కడంటే జర్మనీలో. చూస్తే మామూలు టౌనుల్లానే ఉంటుంది ఇదీనూ. ఇక్కడ బోలెడన్ని వజ్రాలుంటాయి. ఎన్నంటే ఏకంగా 72,000 టన్నుల వరకూనట. అయినా చిత్రంగా వాటిని ఎవ్వరూ పట్టించుకోరు.

■ ఈ ఊరి పేరు నోర్డ్‌లింగన్. వజ్రాల్ని పొదుముకున్న టౌననీ దీన్ని పిలుస్తారు. ఇక్కడుండే గోడలు, దుమ్ము... ఇలా అన్ని చోట్లా వజ్రాలు నిక్షిప్తమై ఉంటాయి. కావాలని ఎవరూ వీటినిలా నిక్షిప్తం చెయ్యలేదు.

■ తొమ్మిదో శతాబ్దానికి ముందు నుంచే ఇక్కడ నివాసాలు ఉన్నాయి. అయితే అందుకు పూర్వం ఇక్కడ ఒక అగ్నిపర్వత బిలం ఉండేది. 15 మిలియన్ సంవత్సరాల క్రితం ఇక్కడో గ్రహ శకలం వచ్చి భూమిని బోలెడు ఒత్తిడితో ఢీకొంది.

■ దీంతో అక్కడ రసాయన సమ్మేళనాలు జరిగి చాలానే ఖనిజాలు పుట్టాయి. వీటిల్లో వజ్రాలూ ఉన్నాయి. అయితే అవి మైక్రోస్కోప్‌లో పెట్టి చూస్తే గాని కనిపించనంత బుల్లి బుల్లి రేణువుల్లా ఉంటాయి. ఇక్కడి దుమ్ముల్లో కలిసిపోయి ఉంటాయి.

■ కనీసం కంటికి కనిపిస్తే వాటిని మనం ఆభరణాల్లోనో, మరో విధంగానో వాడుకుంటాం. కానీ రేణువుల్లా కంటికి కనిపించకుండా ఉండే వాటిని ఏం చేసుకుంటాం. అందుకే వాటికి మార్కెట్ విలువా అంతంత మాత్రమే.

■ అందుకే వీటిని ఇక్కడ ఎవ్వరూ పట్టించుకోరన్నమాట. అయితే రెండో ప్రపంచ యుద్ధం సమయంలో జర్మనీలో భీకర వాతావరణం ఉండేది. ఎప్పుడూ యుద్ధాలు జరుగుతుండేవి. ఈ ఊరిని రక్షించుకునేందుకు ఇక్కడి వారు ఆ పక్క పక్కన దొరికే ఇసుక, మట్టిని ఉపయోగించి గోడలు కట్టుకున్నారు. దానితోనే ఇక్కడ కొన్ని ఇళ్లు కూడా కట్టుకున్నారు.

■ సూర్యరశ్మి ఎప్పుడైనా ఏటవాలుగా ఆ గోడలపై పడితే వజ్రాలు ధగధగమని మెరుస్తూ మనకు కనిపిస్తాయి తప్ప ఒట్టిగా అయితే అవి కనే కనిపించవు.

■ ఇక్కడి అగ్ని పర్వత బిలం దాదాపుగా 25 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండేదట. దీంతో ఆ చోటంతా ఇలా చిన్న రేణువుల్లాంటి వజ్రాలు నిక్షిప్తమయ్యాయట.


■ ఈ వివరాలన్నీ తెలిపేలా ఇక్కడ ఒక మ్యూజియం కూడా ఉంది. పేరు రైస్ క్రేటర్ మ్యూజియం. ఆ అగ్ని పర్వతం పేరు మీదే దీనికీ పేరు పెట్టారు.

■ దీంతో ఈ చిత్రమైన ఊరుని, మ్యూజియంని చూడటానికి ఇక్కడికి ఏటా బోలెడు మంది పర్యాటకులు వస్తుంటారు. తమాషాగా ఉన్న ఈ వివరాలన్నీ వినడానికైతే భలేగా ఉన్నాయి కదూ!

■ వజ్రాలు చిన్న చిన్న రాళ్లలా కాకుండా ఇలా రేణువుల్లా ఎందుకు మారిపోయాయబ్బా? అని ఎవ్వరికైనా సందేహం కలుగుతుంది కదూ! అంతకు ముందు ఇక్కడ గ్రహశకలం పడటం వల్ల పుట్టిన ఒత్తిడికే ఇవిలా రేణువుల్లా మారిపోయాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి.


నీడేది?

మొదటి బొమ్మ నీడను పట్టుకోండి



సబ్జెక్ట్ ల్యాబ్ — గణితం

బొమ్మలు, అంకెలు, గుర్తుల్ని బట్టి లెక్క చేయగలరా?



జవాబులు: **స్కూల్ సవాల్:** 1. జాన్ లోగీ బైర్డ్ 2. సహారా ఎడారి 3. మైఖేల్ ఫారడే **నీడేది:** 2 **సబ్జెక్ట్ ల్యాబ్- గణితం:** 22 (నీలం గ్లాసు-8, పసుపు గ్లాసు-20, ఎర్ర గ్లాసు-10)

కలర్‌టీవీని కనిపెట్టిందెవరు?

స్కూల్ సవాల్

1. కలర్‌టీవీని కనిపెట్టిందెవరు?
2. ప్రపంచంలో అతి పెద్ద ఎడారి?
3. డైనమోని కనిపెట్టిందెవరు?



- డీఎస్ రాజేష్, పదో తరగతి, ఎస్‌కేఆర్ఐఎమ్ స్కూల్, గోరంట్ల, అనంతపురం జిల్లా

నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

Bomb - బామ్

Climb - క్లైమ్

ఆణిముత్యం

శక్తి అనేది డబ్బులో లేదు, మంచితనం, పవిత్రతల్లో ఉంటుంది

- స్వామి వివేకానంద

చిటపట చినుకులు!

పిల్లగాలి తెమ్మెరొకటి రాలడానికి సిద్ధంగా ఉన్న వాన చినుకుతో కబుర్లకు దిగింది. మబ్బులోని ఆ చినుకు దిగాలుగా ఉంది. కారణమడిగిన గాలితో 'ఎక్కడ రాలతానో, నా బతుకేంకానుందో' అంది దిగులుగా. 'చక్కగా మట్టిలోనో, చెరువులోనో పడతావంతేగా' అంది గాలి.

'అంటే పురుగులు, క్రిములు ఉండే మట్టిలోకో, నాచు నిండిన చెరువులోకో పడి పతనం కావాలా నేను?' అంది చినుకు ఏడుపు ముఖంతో.

'పోనీ ఏ వేడి పదార్థంపైనో పడి ఆవిరవుదువుగానీలే' అంది గాలి ఓదార్పుగా. 'అంటే పుట్టి క్షణం గడవకముందే బతుకు కడతేరిపోతుందా?' అంది చినుకు గాభరాగా.

కథ



'ఏమో! ముత్యపు చిప్పలో పడే అదృష్టం పొందుతావేమో దిగులెందుకు' అంది గాలి.

'అంటే నింగిలో స్వేచ్ఛగా విహరించిన నన్ను చిప్పలోను, తర్వాత నగలో పొదిగి బంధీగా పడి ఉండమనా?' అంది చినుకు ఉక్రోషంగా. దాని దిగులును పోగొట్టే ఆఖరి ప్రయత్నంగా గాలి 'పోనీ తళతళమంటూ స్వచ్ఛంగా తామరాకు మీద నిల్చుందువులే' అంది.

'ఛీ.. నిలిచి ఉన్న ఆకునైనా తాకలేని బతుకూ ఓ బతుకేనా?' అంది చినుకు చీదరింపుగా.

సంతోషమే లేని ఆ చినుకు ధోరణికి గాలి నిట్టూర్చింది. పక్కకు చూసింది. ఎంతో కుతూహలంతో నేలను తాకాలని తహతహలాడుతోంది ఓ చినుకు. దాని ముఖమంతా ఉత్సాహం పరుచుకుని ఉంది. ఆశ్చర్యంతో దాన్ని పలకరించింది గాలి.

'నీకు మట్టిలో కలిసిపోతానని భయం లేదా?' అడిగింది.

'ఎందుకూ! అప్పుడు నేను మట్టిలో ఖనిజ లవణాల్ని కరిగించుకుంటాను. చెట్లు నన్ను పీల్చుకోగానే వాటిని అందించగలను. ఎంత మంచి అవకాశం' అంది చినుకు కులాసాగా.

'మరి ఏ వేడి వస్తువుపైనో పడి వెంటనే ఆవిరైపోతే' అంది గాలి.

'మరీ మంచిది. మళ్లీ నింగిలోకి ప్రయాణం. మబ్బు తునకలో భాగంగా స్వేచ్ఛా విహారం' అంది చినుకు తేలిగ్గా.

'ముత్యపు చిప్పలో పడి ముత్యమైపోతావేమో, నింగికెగిరే అవకాశం లేకుండా' అంది గాలి జాలిగా.

'ఆహా! ఎంత భాగ్యం. అప్పుడే కదా. జన్మకు సార్థకత. శాశ్వతత్వం' అంది చినుకు మురిసిపోతూ.

'తామరాకుపై నిలుస్తావనిపిస్తోంది నాకు' అంది గాలి చివరిగా.

'ఎంత చల్లని మాట చెప్పావ్. స్వచ్ఛతను కోల్పోని సంతోషపు బతుకు అప్పుడు' అంది చినుకు చలాకీగా.

ఆ ఆలోచనా ధోరణికి ముగ్ధురాలైంది గాలి. 'ఒకే మబ్బులో పుట్టిన రెండు చినుకులకీ ఎంత తేడా ఉంది? ఆనందమో, విచారమో... మన బతుకు తీరు తేల్చేది మన ఆలోచన విధానమే కదా' అనుకుంది గాలి.

- గుడిపూడి రాధికారాణి

ప్రజల ముంగిటకు పాలన

(మొదటిపేజీ తరువాయి) వచ్చాయి.

☛ బాడంగి మండల కేంద్రంలో జరిగిన సభలో ఉపాధి హామీ వేతనదారులకు వేతనలు ఇవ్వకపోవడం, పింఛన్లు సకాలంలో పంపిణీ చేయకపోవడం, అర్హులకు రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వకపోవడంపై స్థానిక వైకాపా నేత, బాడంగి మాజీ సర్పంచు పెద్దింటి రామారావు అధికారుల్ని నిలదీశారు. ఈ సందర్భంగా ఉపాధి ఏపీవో ఎస్.పెదఅప్పలనాయుడు రాష్ట్ర మొత్తం మీద రూ.7.11 కోట్ల బకాయిలు విడుదల కావాల్సి ఉందని అవి రాగానే చెల్లించేస్తామని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

☛ బాడంగి సభలో ప్రతీ నెలా పింఛన్లు సకాలంలో పంపిణీ చేయడం లేదని ప్రజలు నిలదీస్తే, ప్రభుత్వం మంజూరు చేస్తే ఇస్తాం కాని మా జీతాలిస్తామా అంటూ బాడంగి ఎంపీడీవో పి.చంద్రమ్మ నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో సభలో కాసేంత వాగ్వాదానికి దారితీసింది.

☛ కొత్తవలస మండలం చిన్నిపాలెం గ్రామసభలో 1204 ఎకరాల ఇనాం భూములపై సమస్యలు తీర్చాలంటూ వాటిని సాగు చేసుకుంటున్న రైతులు, స్థానిక సీపీఎం నేతలు అధికారుల్ని నిలదీశారు. విజయనగరం మండలం నారాయణపురం గ్రామసభలో పింఛన్లు అర్హులకు ఇవ్వడం లేదని, అధికార పార్టీ వారికే ఇస్తున్నారంటూ సర్పంచి మజ్జి జయ ప్రశ్నించారు.

☛ గుమ్మలక్ష్మీపురం మండలం ఆమిటి, కొండవాడ జన్మభూమి సభల్లో బోయ, వాల్మీకుల్ని ఎస్టీ జాబితాలో చేర్చొద్దని గిరిజనులు నిరసన తెలిపారు. కురుపాం మండలం తొంపలపాడులో గృహాలు మంజూరు చేయాలని స్థానిక గిరిజనులు అధికారుల్ని నిలదీశారు. కొమరాడ మండలం విక్రాంపురం సభలో వేదికపై ఉన్న ఉప సర్పంచు రామకృష్ణ 25 ఏళ్లుగా వితంతువుగా ఉన్నవారికి పింఛను ఇవ్వలేదంటూ సమస్యని లేవనెత్తారు.

☛ పాచిపెంట మండలం పి.కోనవలసలో గత జన్మభూమిలో కార్డులిచ్చినా రేషన్ ఇవ్వడం లేదంటూ కొందరు బాధితులు ఆందోళనకు దిగారు. ఎస్.కోట మండలం పోతనాపల్లిలో అయిదు విడత జన్మభూమిలోను ఇళ్ల స్థలాల కోసం కోరుతున్నామని స్థానికులు అడిగారు.

పాతికేళ్లుగా పింఛను లేదు



నా భర్త చనిపోయి పాతికేళ్లైంది. ఇప్పటికీ నాకు పింఛను లేదు. 12 ఏళ్లుగా దరఖాస్తు చేస్తున్నా ఏదొక కారణం చెప్పి పింఛను మంజూరుచేయడం లేదు. అనర్హులకు ఇస్తున్నారు తప్ప నాలాంటివాళ్లకు ఇవ్వడం లేదు.

– గంట్యాడ సత్యవతి, విక్రాంపురం, కొమరాడ మండలం

పేరు చేర్చక నష్టపోతున్నాను



మా కుటుంబానికి రేషన్‌కార్డు ఉంది. దాంట్లో నా పేరు చేర్చమంటూ అయిదేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను. అయినా చేర్చలేదు. దీనివల్ల నా పిల్లల చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించక ఫీజులు కట్టుకోవాల్సి వచ్చింది. ఇటీవల నాకు కడుపులో శస్త్రచికిత్స జరిగితే తెల్లకార్డు లేక సొంత సొమ్మే పెట్టుకోవాల్సి వచ్చింది.

– జి.త్రినాథరావు, పి.కోనవలస, పాచిపెంట మండలం

బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దంటూ నిరసన



ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న యువత

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దన్న డిమాండ్‌తో మంగళవారం పి.ఆమిటి, కొండవాడలో నిర్వహించిన జన్మభూమిలో యువత నిరసన తెలిపారు. ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేపట్టారు. రాజకీయ స్వార్థం కోసం గిరిజనేతరులైన బోయ, వాల్మీకులను ఎస్టీలో చేర్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ఎస్టీలో చేర్చినట్లైతే నిజమైన గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ విజయరామరాజుకు వినతి అందించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: పోలవరం సాధన కోసం కాంగ్రెస్ నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షులు యడ్ల ఆదిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాయంలో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం వరకు జరిగే పాదయాత్రలో పార్టీ జాతీయ అధ్యక్షుల రాహుల్ గాంధీ, పాండిచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి తదితరులు పాల్గొంటారని తెలిపారు. జనవరి 10న సాముహిక సత్యాగ్రహం చేపడుతున్నట్లు తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ తరగతుల నిర్వహణ ఆశలు.. ఈ ఏడాదికి అడియాసలైనట్లే. అదిగో ఇదిగో అంటూ ఊరటించి..ఉసూరుమనిపించారు. ముందు భవనాల కొరతని, ఆ తరువాత మౌలిక వసతులు లేవని, అంతర్జాలం ఏర్పాటులో సమస్యలని , బోధన, బోధనేతర సిబ్బంది నియామకంలో టెండర్ల గందరగోళ సమస్యలు పరిష్కారం కాలేదంటూ కాలయాపన చేసేశారు. ఫలితంగా ఈ ఏడాది ప్రారంభం నుంచి స్థానికంగానే తరగతులు నిర్వహిస్తామని చెప్పిన నేతలు ఈ ఏడాది ముగిస్తున్నా ప్రారంభించలేదు. రూ.కోట్లతో చేపట్టిన పనలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. కనీసం ఎప్పుడు తరలిస్తారో సంబంధిత అధికారుల్లో స్పష్టత లేకపోవడం విడ్డూరం.



తరగతుల నిర్వహణకు కేటాయించిన గురుకుల భవనాలు

నూజివీడులోనే ఉండనేల ఎదురుచూస్తోంది సిక్కోలు నేల!

➪ కొలిక్కిరాని భూసమస్య ➪ సమస్యల పేరుతో కాలయాపన ➪ రూ.కోట్లతో చేపట్టిన పనులు నిరుపయోగం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా జిల్లాకు 2016-17 విద్యా సంవత్సరంలో ట్రిపుల్ ఐటీని ప్రభుత్వం మంజూరుచేసింది. దీనిలో ఏడాదికి వెయ్యి మందికి ప్రవేశాలు కల్పించేలా రెండేళ్ల కిందట ట్రిపుల్‌ఐటీని ప్రారంభించారు. అప్పటి జిల్లాలో స్థల కేటాయింపు, భవనాల సౌకర్యం లేకపోవటంతో కృష్ణా జిల్లాలోని నూజివీడులోనే ఆ ఏడాది తరగతులు ప్రారంభించారు. 2017-18 విద్యాసంవత్సరంలో జిల్లాలోనే తరగతులు ప్రారంభించేందుకు ఎచ్చెర్ల మండలం షేర్‌మహ్మద్‌పురం పంచాయతీలోని గురుకుల భవనాలను ట్రిపుల్‌ఐటీకి కేటాయించారు. వెయ్యి మందికి ప్రవేశాలు కల్పించి గురుకల భవనాలు, మిత్ర ఇంజినీరింగ్ కళాశాలలో తరగతులు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు.

తరలింపు ఎప్పుడో...: 2017 ఆగస్టు 1 నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు. కొన్ని పనులు పూర్తికాలేదని ఒకటి రెండు నెలల్లో జిల్లాకు విద్యార్థులను తరలిస్తామని చెబుతూవచ్చారు. తీరా రెండు నెలలయ్యాక పూర్తిస్థాయిలో పనులు కాలేదని దసరా తరువాతన్నారు. అయినా ఆ పని జరగలేదు. ఒప్పంద విధానంలో భద్రతకు సంబంధించిన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, భోజన ఏజెన్సీలకు చెందిన టెండర్లు ఖరారు కాలేదని అందుకే తరలించలేకపోతున్నామని , పండగ తరువాత తరలిస్తామని అధికారులు చెప్పారు. తీరా పండగ సెలవులు సమీపించినా అధికారులకు తరలింపుపై స్పష్టత రాలేదు. క్షేత్రస్థాయిలో రెండు చోట్ల అంతర్జాల సౌకర్యం సమకూరకపోగా, వంట ఏజెన్సీలకు సంబంధించిన టెండర్లు ఖరారు కాలేదు. దీంతోపాటు అవసరమైన ల్యాప్‌ట్యాప్‌లు, మంచాలు, పరుపులు కొనుగోలు చేయలేదు.

భూసమస్యతో గందరగోళం : అధికారులు ట్రిపుల్ ఐటీకి 200 ఎకరాలు స్థలం కేటాయిస్తూ అన్ని రకాల ధ్రువపత్రాలు అందజేశారు. రూ.82 కోట్లతో భవనాలు నిర్మించేందుకు టెండర్లు పూర్తిచేసి నిర్మాణ పనులు ప్రారంభించే సమయంలో కొందరు స్థానికులు ఆ స్థలం తమదంటూ పనులు అడ్డుకోవడంతో పెద్ద సమస్య వచ్చి పడింది. చేసేది లేక ట్రిపుల్ ఐటీ అధికారులు ప్రణాళికతో సంబంధం లేకుండా అభ్యంతరం లేని చోట భవనాలు నిర్మించేందుకు నిర్ణయించి ఆ పనులు ప్రారంభించారు. ఆ రైతులు అడ్డుకున్న స్థల వివాదం మాత్రం అలాగే ఉంది.

రూ.లక్షల ఖర్చు వృథా: గురుకుల భవనాలకు మరమ్మతు చేసి, అదనంగా భోజనశాల, మరుగుదొడ్ల నిర్మాణంకు రూ.1.6 కోట్లు ఖర్చు చేశారు. ఈ మరమ్మతులు చేసినా వినియోగించకపోవటంతో మళ్లీ తాగునీటి ట్యాంకులు, గొట్టాలు, ఇతర విద్యుత్తు పరికరాలు శిథిలమవుతున్నాయి. లీజుకు తీసుకున్న మిత్ర ఇంజినీరింగ్ కళాశాలను వినియోగించకుండా నెలకు రూ.4.25 లక్షల చొప్పున అద్దె చెల్లించాల్సి వస్తుంది. ప్రారంభమైన పనులు వచ్చే విద్యాసంవత్సరానికి మూడు వేలమంది విద్యార్థులకు వసతి కల్పించి తరగతులు నిర్వహించుకునేలా రూ.82 కోట్లతో భవనాల నిర్మాణ పనులు నెల రోజుల కిందట ప్రారంభమయ్యాయి. వచ్చే జులై నాటికి తొమ్మిది భవనాలను 15 ఎకరాల్లో నిర్మించే పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

సమకూరని సౌకర్యాలు : మిత్ర ఇంజినీరింగ్ కళాశాల, గురుకుల భవనాలకు అంతర్జాల సౌకర్యం సమకూర్చలేదు. విద్యార్థులకు నేటికీ ల్యాప్‌టేప్‌లు కొనుగోలు చేయలేదు. భోజనాలకు సంబంధించిన ఏజెన్సీలకు టెండర్లు పూర్తి కాలేదు. భవనాల్లోని విద్యార్థుల వసతిగదుల్లో పరుపులు, మంచాలు సైతం కొనుగోలు చేయలేదు. అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చిన తరువాత తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి చెందాక మాత్రమే విద్యార్థులను తరలించాలని లేని పక్షంలో తరలించవద్దని రాజీవ్‌గాంధీ వైజ్ఞానికి సాంకేతిక విశ్వవిద్యాలయం కులపతి రాజారెడ్డి తెలియజేస్తున్నారని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం ఉన్న గురుకుల భవనాలు, మిత్ర ఇంజినీరింగ్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది వసతులకు, ఇతర పరిపాలనకు వినియోగించి అదనపు భవనాల నిర్మాణం పూర్తయ్యాక మాత్రమే తరగతులు తరలించాలనే ఉన్నతాధికారులను ఆదేశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది.



అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాం : ఏదో చిన్న పాఠశాలల తరగతులు నిర్వహించలేం. వేలమంది విద్యార్థులతో తరగతులు ప్రారంభించాలంటే అన్ని రకాల సౌకర్యాలు ఉండాలి. సౌకర్యాలు లేకుండా తరలిస్తే ఇక్కడ ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అంతర్జాల సౌకర్యం, విద్యార్థులకు ల్యాప్‌టేప్‌లు, భోజన నిర్వహణ ఏజెన్సీ టెండర్లు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. ఇవన్నీ పండగ నాటికి పూర్తిచేసి కులపతిని రప్పించి చూపించి తరగతులు తరలించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం.

– ఎస్.హరశ్రీరాములు, సంచాలకులు, ట్రిపుల్ ఐటీ

4న బ్రెయిలీ జయంతి వేడుకలు

విజయనగరం కోట, న్యూస్‌టుడే: అంధుల చదువుకోవాలని ప్రత్యేక లిపి కనిపెట్టిన లూయిస్ బ్రెయిలీ జయంతిని ఈ నెల 4న నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకుడు జీవన్‌బాబు తెలిపారు. విజయనగరం పూల్‌బాగ్ కాలనీ అంధుల ఆశ్రమ పాఠశాల్లో కార్యక్రమం జరుగుతుందని ఆయన చెప్పారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, అంధులు హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యుద్దీకరణ లేక అవస్థలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: పారిశ్రామికవాడలో కొన్ని ప్రాంతాలకు విద్యుద్దీకరణ సదుపాయం లేక కార్మికులు అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారులను అనుసరించి విద్యుదీకరణను ఏర్పాటు చేశారు. ఆయా దీపాలు సక్రమంగా పనిచేయడంలేదు. అనుబంధ రహదారులను అనుసరించి స్తంభాలు వేసినా దీపాలు వేయకపోవడంతో రాత్రిపూట విధులకు వెళ్లే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. యూనిట్లు పనిచేస్తున్న వైపు విద్యుదీకరణ సదుపాయం లేదు. యూనిట్లు లేనిచోట మాత్రం వెలగడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి ఔత్సాహికులు తీసుకువెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఈ పారిశ్రామిక వాడను రెండు జోన్లుగా విభజించారు. తూర్పువైపు అధిక యూనిట్లు ఉన్నాయి. ఇక్కడ విద్యుద్దీపాలు సరిపడనంత లేవు. దీనివల్ల వారంతా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు కొన్ని ప్రాంతాలకు డ్రైనేజీలు ఏర్పాటు చేసినప్పటికీ ఆయా భూములు ఔత్సాహికులకు కేటాయించలేదు. దీంతో అవి చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారాయి. వీటిని కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. విద్యుదీకరణ లేని ప్రాంతాలకు దీపాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పారిశ్రామికవాడ ప్రబంధకులు కరుణాకర్ తెలిపారు.



పారిశ్రామికవాడకు తూర్పువైపు లేని విద్యుద్దీకరణ



మాట్లాడుతున్న ప్రసాద్

గ్రామీణ వైద్యులు అనుసంధానకర్తలు

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్ తదితర వైద్యులకు గ్రామీణ వైద్యులు అనుసంధానకర్తలుగ వ్యవహరిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషించాలని కేంద్ర ఆసుపత్రి అభివృద్ధి ఛైర్మన్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం తెలుగు నాడు పారా మెడికల్ గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు సౌకర్యం లేని మారుమూల గ్రామాల ప్రజలకు వైద్యంది అందిస్తున్న గ్రామీణ వైద్యుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు సాంబశివరావు, సంఘం జిల్లా అధ్యక్షులు పేరి రామయ్య పంతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-3లో జిల్లాకు 169.22 గరిష్ఠ మార్కులు

● కటాఫ్ అంచనాల్లో అభ్యర్థులు ● బీసీల్లో 'డి' మినహా ఇతర కేటగిరిల్లో 145 మార్కులు దాటిన వారికే అవకాశాలు!

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన గ్రూపు-3 పంచాయతీ కార్యదర్శుల (గ్రేడ్-4) మార్కుల వివరాలు అందుబాటులోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషను విడుదల చేయడంతో అభ్యర్థులంతా కటాఫ్ అంచనాల్లో తలమునకలయ్యారు. ఏ కేటగిరికి ఎంత కటాఫ్ వస్తుందన్న దానిపై అంచనాలు వేసుకుంటున్నారు.

గ్రూపు-3 పోస్టులకు ప్రాథమిక, ప్రధాన పరీక్షలు రెండు దశలుగా నిర్వహించారు. ప్రాథమిక పరీక్షకు 20,137 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వీరిలో ఒక పోస్టుకు ముగ్గురు చొప్పున 2,800 మంది ప్రధాన పరీక్షకు అర్హత సాధించారు. వీరికి ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. గ్రూపు-2 మాదిరిగానే అంచనాలకు మించి గరిష్ఠ మార్కులు రావడంతో ఉద్యోగాలపై ఆశలు పెట్టుకున్న అభ్యర్థులు కొందరు ఖంగుతిన్నారు. జిల్లాకు గరిష్ఠంగా 300 మార్కులకు 169.22 మార్కులు వచ్చాయి. 140 మార్కులు పైబడినవారు వందకుపైగానే ఉన్నారు.



తేనెల రామకృష్ణ (158.97 మార్కులు)



మీసాల అప్పలస్వామి (163.75)



మీసాల రాంబాబు (153.42)

జిల్లాలో 56 పోస్టులు భర్తీ

జిల్లాలో 56 కార్యదర్శుల పోస్టులు భర్తీ కానున్నాయి. ఏపీపీఎస్సీ మార్కుల జాబితా ఆధారంగా జిల్లా స్థాయిలోనే నియామకాలు చేపట్టనున్నారు. ఇందులో ఓపెన్ కేటగిరిలో 16 పోస్టులు మాత్రమే ఉన్నాయి. ఊహించని మార్కులతో అభ్యర్థులు, శిక్షణ సంస్థల నిపుణుల అంచనాలు బట్టి కటాఫ్‌లు భారీగా ఉండొచ్చన్నది సూచిస్తున్నారు. ప్రధానమైన ఓపెన్ కేటగిరికి 153.42 మార్కులుండే అవకాశముందన్నది అంచనా. బి.సి. డి కేటగిరిలో రెండు పోస్టులుండడంతో 152 మార్కులు కటాఫ్ ఉంటుందని పేర్కొంటున్నారు. పోటీలో ప్రధానంగా నిలిచిన బీసీల్లో ఇతర కేటగిరిల్లో 145 మార్కులు పైబడే కటాఫ్‌లుంటాయని అభ్యర్థుల అంచనాల బట్టి తెలుస్తుంది.

అప్పలస్వామికి రెండో ర్యాంకు

మెరకముడిదాం మండలం ఊటపల్లి గ్రామానికి చెందిన మీసాల అప్పలస్వామి 163.75 మార్కులతో రెండో ర్యాంకు సాధించాడు. అదే గ్రామానికి చెందిన మీసాల రాంబాబు 153.42 మార్కులతో 15 ర్యాంకు సాధించాడు. నెల్లిమర్ల మండలం బుచ్చన్నపేట గ్రామానికి చెందిన తేనెల రామకృష్ణ 158.97 మార్కులతో తొమ్మిదో ర్యాంకులో నిలిచాడు.

జిల్లాలో పరిస్థితి (అభ్యర్థులు, పలు శిక్షణ సంస్థల నిపుణుల అంచనాలను బట్టి కటాఫ్ అంచనాలు ఇలా ఉండొచ్చన్నది మెజార్టీ వారి అభిప్రాయం).

- జిల్లాలో పోస్టులు -56
- గరిష్ఠ మార్కులు -169.22 మార్కులు
- ఓపెన్ కేటగిరి -153.42
- బి.సి.డి -152.00

ఈనాడు-ఈటీవీ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న
ముత్యాల ముగ్గుల పోటీలో జనవరి 1 విజేతలు

1. డి.శ్రీలత, కావలి; 2. పి.శ్రీవాణి, షాద్‌నగర్; 3. ఎస్.శ్రావణి, నెల్లూరు; 4. డి.లక్ష్మి సరస్వతి, నంద్యాల; 5. బి.పద్మావతి, తిరుపతి; 6. వై.జ్యోతిర్మయి, జగ్గయ్యపేట; 7. పి.సుధారాణి, గూడూరు; 8. ఎ.పద్మ, కావలి; 9. డి.అభినయ, ఒంగోలు; 10. కె.రజని కుమారి, ఒంగోలు. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చును.

నా 'జన్మభూమి'

పెరుమాళి(తెర్లాం), న్యూస్‌టుడే: జన్మభూమి స్ఫూర్తిని నింపుతూ అధ్యాపకులు, ప్రిన్సిపల్ విద్యార్థుల్లో అవగాహన కలిగించారు. మంగళవారం అయిదో విడత జన్మభూమి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంపై పెరుమాళి ఆదర్శ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జన్మభూమి లోగోను ముగ్గు రూపంలో వేసి అదే ఆకారంలో విద్యార్థులను ఉంచారు. ప్రిన్సిపల్ ఆర్.ఈశ్వరరావు, తెలుగు అధ్యాపకులు కోట తిరుపతిరావు ఈ విద్యార్థులను అభినందించారు.



జన్మభూమి లోగో ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

బిల్లుకు వ్యతిరేకంగా వైద్యుల నిరసన

ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు నిలిచిన ఓపీ సేవలు

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఎన్ఎంసీ (జాతీయ వైద్య కౌన్సిల్) బిల్లుకు వ్యతిరేకంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయనగరం శాఖ నిరసన వ్యక్తం చేసింది. మంగళవారం ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు వరకు అన్ని ప్రయివేట్ ఆసుపత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేయగా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నల్ల రిబ్బన్లు కట్టుకొని విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయనగరం ఐఎంఎ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎంఎ నాయకులు వైద్యులు వీఎస్ ప్రసాద్, అధ్యక్షులు కుమారస్వామి, జేసీ నాయుడు మాట్లాడుతూ ఎన్ఎంసీ బిల్లు అప్రజాస్వామికమని, ప్రజా వ్యతిరేకమని, వైద్యుల నుంచి ఎన్నుకోవల్సిన ఎంసీఐని రద్దు చేసి ఐఎఎస్ వారితో నియమించడం సరికాదన్నారు. అయూష్, హోమియో వాళ్లకు బ్రిడ్జి కోర్సుతో అల్లోపతి సేవలు అందించడానికి అవకాశం కల్పించడం దారుణమని మండిపడ్డారు. సంఘ నూతన అధ్యక్షులు డాక్టర్ మృత్యుంజయరావు మాట్లాడుతూ అత్యవసర సేవలు మినహా మిగిలిన కేసులు నిలిపివేసినట్లు చెప్పారు. డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు వైద్య విద్యను సరైన పద్ధతిలో నియంత్రించడానికి విశ్వ విద్యాలయాలకు అవకాశమివ్వకపోవడం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యదర్శి మధుకర్, రాజశేఖర్, శివరాం, ఎస్.వెంకటేశ్వరరావు, ప్రభుత్వ వైద్యుల సంఘం కార్యదర్శి డాక్టర్ త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

మౌజన్ హత్యకు నిరసనగా శాంతి ర్యాలీ

ఎస్పీ పాలరాజుకు వినతిపత్రం

విజయనగరం నేరవార్తా విభాగం, కోట, న్యూస్‌టుడే: రాజమండ్రి లాలా చెరువు నూరానీ మజిద్‌పై దాడి చేసి మౌజన్‌ను హత్య చేసి, ఖురాన్‌ను కొంత మంది గుర్తు తెలియని దుండగులు దహనం చేశారని నిరసిస్తూ పట్టణంలో ముస్లిం సోదరులు మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అంబటి సత్రం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం ఎస్పీ జి.పాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ముస్లిం ఆల్ జమాత్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శాంతి ర్యాలీలో అధిక సంఖ్యలో ముస్లిం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ధార్మిక సంస్థలన్నింటికీ భద్రత కల్పించి, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా, సమాజంలో శాంతి, సౌభ్రాతత్వ వాతావరణం నెలకొల్పాలని కమిటీ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.



ఎస్పీ పాలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ నిర్వాహకులు

ఎనిమిది మందికి సావిత్రిబాయి పూలే పురస్కారాలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో సావిత్రిబాయి పూలే పురస్కారానికి ఎనిమిది మంది మహిళా ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వారి పేర్లను మంగళవారం రాత్రి కలెక్టర్ ఆమోదించారు. ఈ మేరకు సర్వశిక్ష అభియాన్ అధికారులు వారి వివరాలను అధికారికంగా వెల్లడించారు. ఎంపికైన వారిలో ముగ్గురు కేజీబీవీల్లో పనిచేసే ప్రత్యేకాధికారి, సీఆర్టీలున్నారు. పాఠశాల సహాయకులు, గ్రేడ్-1 ప్రధానోపాధ్యాయులు, ఎస్జీటీ, సాంఘికసంక్షేమ గురుకులం, ఐఈఆర్టీ విభాగాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయినులకు అవార్డులు దక్కాయి. గతేడాదిలో ఆరుగురికి పురస్కారాలు వచ్చాయి. ఈ ఏడాదిలో 20మంది పైగా దరఖాస్తు చేసుకోగా ఎనిమిది మందికి అవకాశాలు కల్పించారు. ఎంపికైన వారికి బుధవారం విశాఖలో పురస్కారాలను ప్రధానం చేయనున్నారు.

● పి.శర్ల, ఆంగ్లం సీఆర్టీ, గంట్యాడ కేజీబీవీ ● వర్రి ఎర్రయ్యమ్మ, తెలుగు సీఆర్టీ, జామి, కేజీబీవీ ● ఇ.ధనలక్ష్మి, ప్రత్యేకాధికారిణి, చీపురుపల్లి, కేజీబీవీ ● బి.విక్టోరియారాణి, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయురాలు, జడ్పీహెచ్ఎస్, కొండవెలగాడ ● సీహెచ్.సుజాత, పాఠశాల సహాయకుల జీవశాస్త్రం, జడ్పీహెచ్ఎస్, రామవరం. ● డి.రమాదేవి, ఎస్జీటీ, ఎంపీపీఎస్, వై.వి.పాలెం, కొత్తవలస ● కె.విజయలక్ష్మి, సంగీతం ఉపాధ్యాయిని, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, చీపురుపల్లి. ● లచ్చిరెడ్డి నారాయణమ్మ, ఐఈఆర్టీ, గంట్యాడ.

కొత్త ఏఎస్పీగా దీపిక

సోమవారమే బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన కొత్త ఏఎస్పీ దీపిక, పాడేరు బదిలీపై వెళ్తున్న పూర్వ ఏఎస్పీ అమిత్‌బర్దర్

పార్వతీపురం, న్యూస్‌టుడే : పార్వతీపురం సబ్ డివిజన్ ఏఎస్పీగా దీపిక బాధ్యతలు స్వీకరించారు. అందరూ నూతనసంవత్సర సంబరాల్లో ఉన్నవేళ, ఒకరిని ఒకరు అభినందించుకుంటూ ముందుకు సాగుతున్న సమయంలో యువ ఐపీఎస్ అధికారి దీపిక సోమవారం సాయంత్రం పూర్వ ఏఎస్పీ అమిత్‌బర్దర్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం డివిజనులోని పార్వతీపురం, సాలూరు. ఎల్విన్‌పేట సర్కిళ్ల ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇనస్పెక్టర్లు కొత్త ఏఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజనులోని స్థితిగతులు, ఇతర అంశాలపై సిబ్బందితో చర్చించారు. ఏఎస్పీ కుటుంబం అంతా ఐపీఎస్ అధికారులేనన్న విషయం విదితమే. పాలన, పోలీసుశాఖపైన పట్టున్న కుటుంబం నుంచి వచ్చిన యువ అధికారి పాలన ఎలా ఉంటుందనే విషయం ఇప్పుడు అందరికీ ఆసక్తి కలిగిస్తుంది.

పండగ పనులు ఎలాగండి?

● పార్వతీపురంలో పనిచేయని ఏటీఎంలు
● నిరాశకు గురవుతున్న ఖాతాదారులు



● ఈ చిత్రంలోని యువకుని పేరు పవన్ కుమార్. పార్వతీపురం మండలం వెంకంపేట. పండగ సామగ్రి కొనుగోలు చేసేందుకు అవసరమైన నగదుకు గూడ్స్‌షెడ్ రోడ్డులోని ఏటీఎంకు వెళ్లారు. నగదు రాలేదు. ప్రధాన రహదారిలోని మరో నాలుగు ఏటీఎంలకు వెళ్లి విత్‌డ్రాకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఏటీఎంలు ఉన్నాయనే ధీమాతో ఊరు నుంచి వస్తే నిరాశే మిగిలింది. సామాన్లు కొనుగోలు చేయడం వాయిదా వేశారు.



● ఈ యువకుని పేరు బ్రహ్మాజీ. బైపాస్ కాలనీకి చెందిన ఇతను అత్యవసరంగా నగదు అవసరమై ప్రధాన రహదారిలోని ఏటీఎంకు వెళ్లారు. విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నిస్తే నగదు నిండుకున్నట్లు తెలిసింది. పండగ రోజుల్లో నగదు అవసరం ఉంటుందని, ఇటువంటి సమయంలో నగదు రాకపోతే ఎందుకీ ఏటీఎంలు అంటూ నిట్టూర్చాడు.



పార్వతీపురం పట్టణ జనాభా 60వేలు. సుమారు 15వరకు వివిధ బ్యాంకులు ఉన్నాయి. పదివరకు ఏటీఎంలు ఏర్పాటు చేశారు. మంగళవారం గూడ్స్‌షెడ్‌రోడ్డుతో పాటు ప్రధాన రహదారిలోని పలు ఏటీఎంల్లోంచి నగదు రాలేదు. తరచూ ఇదే పరిస్థితి ఎదురవుతుంది. ప్రస్తుతం సంక్రాంతి పండగ రోజులు. ఇప్పటి నుంచే ఆనేక పనులు జోరుగా చేస్తేకాని వీలుకాదు. పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి ప్రతీరోజు వేలాది మంది మార్కెట్ పనులపై ఇక్కడికి వస్తున్నారు. నగదు కోసం ఏటీఎంలకు వెళితే నిరాశే మిగులుతోంది. సంబంధిత బ్యాంకులు పండగ రోజుల్లో అయినా ఏటీఎంల్లో నగదు వచ్చేలా శ్రద్ధచూపాలని ఖాతాదారులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం.

5 నుంచి సేవా శిబిరాలు

బాడంగి, న్యూస్‌టుడే: 5 నుంచి కోడూరులో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పీఓ ఊదా శంకరరావు తెలిపారు. 5 నుంచి 11 వరకు జరగనున్న ఈ కార్యక్రమానికి బాడంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు ఎం.వెంకటరావు అధ్యక్షత వహిస్తారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొంటారన్నారు.

బొబ్బిలి

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

బాడంగి, న్యూస్‌టుడే: వ్యక్తిత్వ వికాసంపై అవగాహనా తరగతులు నిర్వహించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు ఎం.వెంకటరావు అన్నారు. భారతదేశ గొప్పదనం, విద్యార్థులు పరీక్షా సమయంలో ఒత్తిడి తగ్గించుకొనే పరిస్థితులపై అవగాహన కలిగించినట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు నిష్టల నరసింహమూర్తి ద్వారా ఈ తరగతులు నిర్వహించామన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ఊదా నరసింహమూర్తి, సిబ్బంది సహకరించినట్లు తెలిపారు.

పది పంచాయతీలకు ఒకటే

- ఇదీ నియోజకవర్గంలో పశువైద్యశాలల తీరు
- చాలీచాలని మందులు.. శిథిల భవనాలు

మూగజీవులకు వైద్యం అందించాల్సిన పశువైద్యశాలలో సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడం, మందులు చాలకపోవడం, శిథిలావస్థకు భవనాలు చేరడం తదితర సమస్యలతో రోదిస్తున్నాయి. పాలకులు, ప్రభుత్వాలు మారినా వీటిగురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి మూడు నెలలకోసారి నాలుగు దఫాలు మందులు అందిస్తున్నారు. ఇవి చాలకపోవడంతో పాడి రైతులు చికిత్సకు అవసరమైన మందులు బయట కొనుగోలు చేసుకుంటున్నారు. ఇది వారికి ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెడుతుంది.

– బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే

న్యూస్‌టుడే పరిశీలన

బొబ్బిలి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పశువైద్యం కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని పాడిరైతులు ఆవేదన చెందుతున్నారు. 20 ఏళ్లక్రితం ఏర్పాటు చేసిన కేంద్రాలు తప్ప కొత్తగా ఏర్పాటు చేయలేదు. పశువుల సంఖ్య పెరిగినా వాటినే కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా పాడిపశువులను రైతులకు రాయితీపై కొనుగోలు చేసి అందిస్తుంది. వాటికి మెరుగైన చికిత్సలు అందక మృత్యువాత పడుతున్నాయి. రామభద్రపురం, బొబ్బిలి మండలాల్లో పశువులు ఎక్కువగా ఉన్నాయి. దీంతో పాడి ఉత్పత్తి పెరుగుతుంది. చాలామంది రైతులు పాడి ఆధారంగానే జీవనం సాగిస్తున్నారు. పాత భవనాల్లో ఆసుపత్రులు కాలం వెళ్లదీస్తున్నాయి. ఎప్పుడు కూలిపోతాయోనని పనిచేస్తున్న సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా కొత్త భవనాలకు ప్రతిపాదనలు పంపించడం తప్ప ఒరిగేదేమీ లేదని అధికారులు ఆవేదన చెందుతున్నారు. బొబ్బిలి మండలంలో 15 వేల పశువులు, 21 వేల గొర్రెలు, మేకలు ఉన్నాయి. వాటితో పాటు కోళ్లు, కుక్కలు ఉన్నాయి. వాటికి వ్యాధులు సోకితే చికిత్స అందించాలి. మందులు చాలకడం లేదు. రామభద్రపురం మండలంలో 25 వేలు, తెర్లాంలో 20 వేల పశువులున్నాయి. అందుకు తగ్గట్టుగా వైద్యశాలలు లేవు. దాదాపు 10 పంచాయతీలకు ఒక్కోటి చొప్పున ఉండడంతో అంతదూరం వెళ్లడానికి పాడిరైతులు ఇబ్బందులు పడుతున్నారు.

★ బాడంగి మండలం గజరాయునివలసలో గ్రామీణ పశువైద్య భవనం కూలిపోయే స్థితికి చేరింది. కోడూరు, పాల్తేరు భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి.



ఇది బొబ్బిలి మండలంలోని పక్కి పశువైద్యశాల. ఏడాది క్రితం వరకు గ్రామీణ పశువైద్యశాలగా సేవలందించేది. ఇప్పుడు స్థాయి పెంచి ఆసుపత్రిగా మార్చారు. అయినా సౌకర్యాలు కల్పించలేదు. భవనం చిన్నది కావడంతో మందులు, దస్త్రాలు భద్రపర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. వచ్చిన పశువులకు చికిత్స చేయడానికి అనువైన స్థలం కూడా లేదు. కొత్త భవనం మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు కాలేదు. పక్కి, శివడవలస, రాముడువలస గ్రామాల పశువులు ఇక్కడకు తీసుకువస్తున్నారు. దీంతో మందులు చాలడంలేదు.

రామభద్రపురం మండలంలో పాడి పశువులు అధికంగా ఉన్నాయి. వాటికి చికిత్సలు చేయడానికి అవసరమైన పశువైద్యశాలలు కేవలం మూడే ఉన్నాయి. వాటిలో మండల కేంద్రంలో, ఆరికతోట, రొంపిల్లి పంచాయతీలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. రొంపిల్లి భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రభుత్వం అందిస్తున్న మందులు సగం రోజులకు కూడా సరిపడడం లేదు. దీంతో గర్భకోశ, పొదుగు వ్యాధులకు సంబంధించిన మందులు బయట దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.





ఇది తెర్లాం మండలం పెరుమాళి పశువైద్యశాల. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలిపోతుందోనని సిబ్బంది భయంతో విధులు నిర్వహిస్తున్నారు. కొత్తగా తెర్లాంలో ఏడీ ఆసుపత్రిగా స్థాయి మార్చారు. ఉద్దవోలు, నెమలాం ఆసుపత్రుల భవనాలు పాడైపోయాయి. మరమ్మతు చేయడానికి ప్రతిపాదనలు పంపించినా నిధులు కేటాయించలేదు. *32 పంచాయతీల్లో దాదాపు 20 వేల పశువులున్నప్పటికీ కేవలం మూడు పశువైద్య కేంద్రాలు ఉండడం వల్ల సక్రమంగా పశువులకు చికిత్సలు అందడంలేదని రైతులు అంటున్నారు.*



బొబ్బిలి మండలంలోని పెంట పశువైద్యశాలలో ఏడాదిగా వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేసిన అనిత పిరిడికి బదిలీ చేశారు. ఇద్దరు కిందిస్థాయి సిబ్బందితోనే మూగజీవులకు వైద్యం అందిస్తున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యులు వచ్చి చికిత్స చేస్తున్నారు. చింతాడ, కోమటిపల్లి, అలజంగి, పారాది కారాడ పంచాయతీల్లో గ్రామీణ పశువైద్య కేంద్రాలున్నాయి, అలజంగి, పారాది, కారాడల్లో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతు చేయడానికి కూడా వీలులేని దుస్థితికి చేరుకున్నాయి. కొత్త భవనాలు మంజూరు కాలేదు.

బాడంగి మండల కేంద్రంలోనే ఆసుపత్రి ఉంది. కొత్తభవనం నిర్మాణంలో ఉంది. 25 పంచాయతీలకు కేవలం నాలుగు మాత్రమే ఉన్నాయి. దూరప్రాంతాల రైతులు తమ పశువులను తీసుకువెళ్లడానికి చాలా అవస్థలు పడుతున్నారు. కొత్తవి ప్రతిపాదించలేదని పశువైద్యాధికారి రమణ తెలిపారు.

“శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు పంపించామని పిరిడి, బాడంగి పశువైద్యులు అనిత, కేవీ రమణ తెలిపారు. మందుల విషయంలో అత్యవసర సమయాల్లో ప్రమాదకరమైన వ్యాధులు సోకినప్పుడు మాత్రం లేనివి బయట కొనుగోలు చేయాలని రైతులకు తెలియచేస్తామన్నారు. దూరప్రాంతాల నుంచి రైతులు పశువులను తోలుకు వస్తున్నారని, నడవలేని పరిస్థితుల్లో ఉంటే ఆయా గ్రామాలకు వెళ్లి చికిత్స చేస్తున్నామన్నారు.”



యోగా తరగతుల్లో మాట్లాడుతున్న అచ్యుతవల్లి

యోగాతోనే మానసిక ప్రశాంతత

బొబ్బిలి, న్యూస్‌టుడే: యోగాతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని పురపాలక అధ్యక్షురాలు తూముల అచ్యుతవల్లి అన్నారు. మంగళవారం స్థానిక సరస్వతి శిశుమందిరంలో అఖిల భారతీయ విద్యాకేంద్రం ఆధ్వర్యంలో యోగా శిక్షణా తరగతులు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యోగాతోనే మానసిక ఆరోగ్యం ఉంటుందన్నారు. కేంద్రం రాష్ట్ర కార్యదర్శి క్రాంతి హనుమంతురావు మాట్లాడుతూ యోగాతోనే మానసిక పరిపక్వత ఉంటుందన్నారు. సరస్వతి శిశుమందిరం కార్యదర్శి పెంట స్వామినాయుడు, సమన్వయకర్త రామారావు, సంయుక్త కార్యదర్శి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో ప్రతిభ

తెర్లాం, న్యూస్‌టుడే: యువజనోత్సవాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను పలువురు అభినందించారు. స్థానిక వెంకటేశ్వర డైట్, జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇటీవల విజయనగరంలో నిర్వహించిన జిల్లా పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి జిల్లా కేంద్రంలో ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భం పురస్కరించుకుని మంగళవారం వీరిని అభినందించారు. ముగ్గుల పోటీలో ద్వితీయ సంవత్సరం డైట్ విద్యార్థిని ఎస్.భవాని, చిత్రలేఖనంలో ఎస్.లక్ష్మణ్ ప్రథమ స్థానం సాధించారు. సోలో పాటల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న బి.గౌతమి, చిత్రలేఖనంలో పి.ప్రవీణ్‌కుమార్, మౌన ప్రదర్శనలో బి.లక్ష్మణరావు, వ్యాసరచనలో బి.సాయి, నారన్నాయుడు, యు.సాయిశంకర్ ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరిని ఆయా ప్రిన్సిపాళ్లు జి.రామకృష్ణంనాయుడు, పి.వెంకటేశ్వరరావు, వైఎస్ ప్రసాద్, ఎన్నెస్సెస్ ప్రోగ్రాం అధికారి తెంటు రామారావు, పలువురు అధ్యాపకులు అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ఎన్‌ఎంసీనే కొనసాగించాలి



మాట్లాడుతున్న వైద్యులు గోపీనాథ్, బలరాంనాయుడు

బొబ్బిలి, న్యూస్‌టుడే: జాతీయ వైద్య మండలి(ఎన్‌ఎంసీ) స్థానంలో జాతీయ వైద్య కమిషన్ తీసుకువస్తే చాలా ఇబ్బందులు ఉంటాయని జాతీయ వైద్య అసోసియేషన్(ఐఎంఏ) బొబ్బిలి శాఖ అధ్యక్షులు ఎ.గోపీనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక వేణుగోపాల నర్సింగుహోంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిషన్ తీసుకువస్తే కొత్త సమస్యలు తయారవుతాయన్నారు. రాజ్యసభలో దీనిపై ఒక తీర్మానం తీసుకురావడం సరికాదన్నారు. పాత విధానాన్ని తీసుకురావాలన్నారు. వైద్యరంగంపై ప్రజలకు నమ్మకం కలిగేవిధంగా ప్రతిపాదనలు ఉండాలన్నారు. ఏళ్లతరబడి వైద్య కోర్సును అభ్యసిస్తున్న వారంతా చిన్నబోయే విధంగా సంస్కరణలు ఉన్నాయన్నారు. ఇటీవల తీసుకువచ్చిన కొన్ని సంస్కరణలు ప్రజలకు చేటు తెచ్చేవిధంగానే తయారయ్యాయని వాపోయారు. ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. ఐఎంఏ అసోసియేషన్ ప్రతినిధులు బలరాంనాయుడు, రామ నరేష్, శంకరరావు, హరిప్రసాద్ పాల్గొని మాట్లాడారు.

కూరగాయల ధరలు

బొబ్బిలి కూరగాయల మార్కెట్‌లో మంగళవారం సాయంత్రానికి ధరలిలా ఉన్నాయి.(కిలో రూ.లలో) వంగ(తెల్లవి): 30, వంగ(నల్లవి): 35, బెండ: 40, బీర: 40, చిక్కుడు(పొడవు): 40, దొండ: 40, ఉల్లి(పెద్దవి): 45, బీట్‌రూట్: 80, క్యారెట్: 80, క్యాబేజీ: 30, టమాటా: 15.

- బొబ్బిలి, న్యూస్‌టుడే

వైద్య శిబిరాలకు స్పందన

రామభద్రపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఇట్లామామిడిపల్లి, సోంపురం, బూసాయవలస, ముచ్చర్లవలస గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి వైద్యశిబిరాలకు మంచి స్పందన లభించింది. వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వివిధ గ్రామాల నుంచి రోగులు వందలాది మంది తరలివచ్చారు.

పాఠశాల తీరుపై ఫిర్యాదు

బొబ్బిలి, న్యూస్‌టుడే: నోబుల్ పాఠశాల యాజమాన్యం తీరుపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లి తీళ్ల అరుణ మంగళవారం సాయంత్రం ఎస్ఐ అమ్మినాయుడుకు ఫిర్యాదు చేశారు. ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు భార్గవి, భావనీలు సకాలంలో రుసుములు చెల్లించలేదని బయటకు నిర్దాక్షిణ్యంగా పంపించి ఇబ్బంది పెట్టారని ఆమె పేర్కొన్నారు. చంద్రిక, పావని అనే విద్యార్థినులను కూడా బయటకు పంపించారన్నారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడతానని ఎస్ఐ ఆమెకు సర్దిచెప్పారు.

దుప్పట్లు, దుస్తుల వితరణ

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం భవిత పాఠశాలలో చదువుతున్న 20 మంది దివ్యాంగ పిల్లలకు మంగళవారం ఉపాధ్యాయుడు పి.రత్నాకర్ రూ.5 వేలతో దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేశారు. ఎమార్టీలు కొల్లి ఈశ్వరరావు, అచ్యుతరావు, వెంకటేష్, శ్రీను, బొప్పె సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి జన్మభూమి వివరాలివే

తెర్లాం, న్యూస్‌టుడే: జన్మభూమి కార్యక్రమానికి సంబంధించి బుధవారం కాగాం, పాములవలస, నెమలాం, పూనువలస గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయని ఎంపీడీవో ఎ.భానుమూర్తి చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామాల పెద్దలు సహకరించాలని కోరారు.

బొబ్బిలి

తెరపై ఈనాడు

శ్రీవాసవి: ప్రాజెక్టు
సాయిగణపతి: 2 కంట్రీస్
వెంకటకృష్ణ: ఎంసీఏ
వెంకటేష్(రామా): లచ్చి
శ్రీలక్ష్మి: ఒక్క క్షణం
టీబీఆర్ సినిమాస్ స్క్రీన్1: హలో!

- బొబ్బిలి ఫోర్టు, న్యూస్‌టుడే

గిరిజన గ్రామాల అభివృద్ధికి నిధులు

జన్మభూమిలో మంత్రి సుజయ్ వెల్లడి



బొడ్డవలసలో చంద్రన్నబీమా పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి రంగారావు

చిత్రకోట బొడ్డవలస(బొబ్బిలి గ్రామీణం), న్యూస్‌టుడే: గిరిజన గ్రామాలకు కనీస సదుపాయాలు కల్పించడానికి నిధులు మంజూరు చేస్తానని భూగర్భ గనుల శాఖామంత్రి ఆర్వీ సుజయ్‌కృష్ణరంగారావు హామీ ఇచ్చారు. మండలంలోని చిత్రకోట బొడ్డవలసలో మంగళవారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నిమ్మలపాడు, వెలగవలస నుంచి కొయ్యకొండవలస వెళ్లడానికి, దేవుడిబొడ్డవలస తదితర గిరిజన గ్రామాల రాకపోకలకు రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తానని అన్నారు. బొబ్బిలి మండలంలో 11, రామభద్రపురం మండలంలో 2 గ్రామాలకు రూ.2.26 కోట్లతో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఇంటికి మంజూరు చేసిన మరుగుదొడ్ల నిర్మాణాలు ఫిబ్రవరి నాటికి పూర్తిచేయాలన్నారు. గత ప్రభుత్వాలు సాధించలేని అభివృద్ధి పనులు మూడున్నర ఏళ్ల కాలంలో పూర్తిచేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే దక్కిందన్నారు. వెలుగు ద్వారా మంజూరు చేసిన చంద్రన్న బీమా మంజూరు పత్రాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వెంగళరాయసాగర్ కాలువ ద్వారా చిత్రకోట జలాశయానికి నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎంపీపీ చింతల నీరజ, మండల ప్రత్యేకాధికారి ఉదయ్‌భాస్కర్, పార్వతీపురం ఆర్డీవో సుదర్శనదొర, వెలుగు ఏపీ స్వర్ణకుమారి, సర్పంచి రామకృష్ణ, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఉషారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోల బలరాం, తహసీల్దార్ సాయికృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పీఎంకే రెడ్డి పాల్గొన్నారు.

బొబ్బిలి, న్యూస్‌టుడే: పేదవర్గాల సంక్షేమమే తెదేపా ధ్యేయమని పురపాలక అధ్యక్షురాలు తూముల అచ్యుతవల్లి అన్నారు. మంగళవారం పట్టణంలోని 13, 14, 15వ వార్డుల్లో జన్మభూమి గ్రామసభలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో ఈ కార్యక్రమాలను తలపెట్టిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పురపాలక ఉపాధ్యక్షులు రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జన్మభూమి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రత్యేకాధికారి గణపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. అనంతరం చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. పురపాలక కమిషనర్ హనుమంతు శంకరరావు, వార్డు కౌన్సిలర్లు గొర్లి అంకులు, యేగిరెడ్డి శ్రీధర్, బీసపు పార్వతి, పట్టణ తెదేపా అధ్యక్షులు రాంబార్కి శరత్, పురపాలక డీఈ మహేశ్‌తో పాటు పలు వార్డులకు చెందిన కౌన్సిలర్లు, ఇతర అధికారులు హాజరయ్యారు. వార్డుల్లో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఆకట్టుకున్నాయి.

ఇట్లామామిడిపల్లి, సోంపురం(రామభద్రపురం), న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ అప్పికొండ శ్రీరాములునాయుడు అన్నారు. మండలంలోని ఇట్లామామిడిపల్లి, సోంపురం, బూసాయవలస, ముచ్చర్లవలస గ్రామాల్లో మంగళవారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పికొండ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల సమస్యలు పరిష్కరించడానికే జన్మభూమి కార్యక్రమాన్ని తలపెట్టారన్నారు. ఈ సందర్భంగా చంద్రన్న కానుకలు, పింఛన్లు, రేషన్‌కార్డులను అప్పికొండ, తెదేపా నేతలు మడక తిరుపతిరావు, కరణం భాస్కరరావు, కనిమెరక శంకరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎంపీడీవో రామకృష్ణంరాజు, తహసీల్దారు రత్నకుమార్, మండల పంచాయతీ అధికారి భాస్కరరావు, పీఆర్ ఏఈ రమేష్, ఉపాధి పథకం ఏపీఓ విజయలక్ష్మి, వెలుగు ఏపీఎం శ్రీరాములునాయుడు, ఏఓ అనూరాధ పండా, ఎంఈఓ తిరుమలప్రసాద్, ఉప తహసీల్దారు శంకరరావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అచ్యుతవల్లి, ప్రత్యేకాధికారి గణపతిరావు, నాయకులు

ఉద్దవోలు, సుందరాడ, ఎన్.బూర్జివలస(తెర్లాం), న్యూస్‌టుడే: అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జడ్పీటీసీ సభ్యురాలు నర్సుపల్లి వెంకటరామలక్ష్మి అన్నారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉద్దవోలు, సుందరాడ, ఎన్.బూర్జివలస, విజయరాంపురం ఉరఫ్ బూరిపేట గ్రామాల్లో సభలు నిర్వహించారు. ఉద్దవోలులో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. ముందుగా ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి ప్రజలకు అందుతున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలిచ్చిన వినతులను స్వీకరించారు. మండల ప్రత్యేకాధికారి బి.పెద్దిరాజు, తహసీల్దార్ వి.రామస్వామి, ఎంపీడీవో భానుమూర్తి, అన్ని శాఖల అధికారులు, ఎంపీపీ ప్రతినిధి వెంకటేశ్వరరావు, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు ఎన్.వెంకటినాయుడు పాల్గొన్నారు.



చంద్రన్న కానుకలు అందిస్తున్న ఎంపీపీ అప్పికొండ



ఉద్దవోలు గ్రామసభలో జడ్పీటీసీ సభ్యురాలికి వినతిపత్రం అందజేస్తున్న వృద్ధుడు

సమస్యల పరిష్కారానికే..

ఆకులకట్ట(బాడంగి), న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికే జన్మభూమి కార్యక్రమం అని తహసీల్దారు జి.జనార్దనరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఆకులకట్ట గ్రామంలో జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించుకోవడానికి వేదికే ఈ కార్యక్రమం అన్నారు. రెవెన్యూ అధికారి చంద్రశేఖర్, ఎంఈఓ సుందరరావు, విద్యుత్తుశాఖ ఏఈ ఎండీ ఇస్మాయిల్‌అలీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాడంగిలో రసాభాస..

మండల కేంద్రం బాడంగిలో ఈ కార్యక్రమం రసాభాసగా సాగింది. ఎంపీడీఓ పి.చంద్రమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తుండగా పలువురు అడ్డు తగిలారు. ముఖ్యంగా ఉపాధి వేతనాలు, పింఛన గురించి నిలదీశారు. మాజీ సర్పంచి పెద్దింటి రామారావు శాఖాపరంగా జరిగిన అభివృద్ధిపై ప్రశ్నించారు. సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. పోలీసుల సమన్వయంతో చివరకు సజావుగా సాగింది. మండల ప్రత్యేకాధికారి బి.శ్రీనివాసరావు, సర్పంచి అంబటి తవిటినాయుడు, డీటీ ఆర్.ధనం పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మహిళా సంఘాలకు రుణాలు అందజేస్తున్న ప్రత్యేకాధికారి

ఎన్.బూర్జివలస(తెర్లాం), న్యూస్‌టుడే: రుణాలు సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని మండల ప్రత్యేకాధికారి బి.పెద్దిరాజు అన్నారు. మంగళవారం మండలం ఎన్.బూర్జివలసలో రెండు మహిళా సంఘాలకు రూ.3 లక్షల చొప్పున బ్యాంకు లింకేజీ రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని పొదుపు పాటించి జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. తహసీల్దార్ వి.రామస్వామి, వెలుగు ఏపీఎం చిన్నారావు, మండల తెదేపా నాయకులు వెంకటినాయుడు, బోను అప్పలనాయుడు, అన్ని శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో క్రీడా పోటీలు

రంగరాయపురం, పిరిడి, అలజంగి(బొబ్బిలి గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని పలు పాఠశాలల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. జన్మభూమి సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించాలని అధికారులు సూచించారు. దీంతో ఉపాధ్యాయులు మంగళవారం వాలీబాల్, ఖోఖో తదితర ఆటల పోటీలు నిర్వహించారు. అలజంగిలో ముగ్గులు, పిరిడి, పెంట ఉన్నత పాఠశాలల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. 11వ తేదీన విజేతలకు బహుమతులు అందిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు.



అలజంగి పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష



నిరసన దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

పక్కి(బొబ్బిలి గ్రామీణం), న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పక్కి పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురగాల లక్ష్మణరావు మాదిగ మాట్లాడుతూ వర్గీకరణకు మద్దతుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకువెళ్లి పార్లమెంటులో చట్టబద్ధతకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ సాధించిన రిజర్వేషన్ల ఫలాలు అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణ ద్వారానే న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రశాఖ ఆదేశాలతో గ్రామ సచివాలయ కేంద్రాల వద్ద నిరసన దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. కార్యకర్తలు ఎ.నాగభూషణరావు, జి.పోలిరాజు, యందవ రాంబాబు పాల్గొన్నారు.

నేటి 104 వైద్యసేవలు

బాడంగి, న్యూస్‌టుడే: నేడు భీమవరం, గొల్లాదిలలో 104 వైద్యసేవలు నిర్వహించనున్నట్లు సమన్వయకర్త కిల్లాడ రవి తెలిపారు.

గ్యాస్ సమాచారం

బొబ్బిలిలోని వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీలో గత నెల 25, 26వ తేదీల్లో బుకింగు చేసుకున్న వినియోగదారులకు, 27వ తేదీన బుకింగు చేసుకున్న కొంతమందికి సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. గ్యాస్ సమాచారం కోసం ఏజెన్సీ ఫోను నెంబరు 08944-234997ను సంప్రదించాలి. అత్యవసరానికి చరవాణి నెంబరు 7893246977కు సమాచారం అందించాలి. డెలివరీ బాయ్ ఇంటికి సిలిండరు తీసుకుని వచ్చేటపుడు 14.2 కిలోలు బరువు ఉండేలా చూసుకుని బిల్లుపై ఉన్న మొత్తాన్ని చెల్లించాలి. వినియోగదారులు అన్నివేళలా ఆన్‌లైన్‌లో గ్యాస్ బుకింగుకు ప్రత్యేక నెంబరు 9666023456కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలి.

- బొబ్బిలి ఫోర్టు, న్యూస్‌టుడే

చీపురుపల్లి

భైరిపురంలో వైద్య శిబిరం

భైరిపురం(మెరకముడిదాం), న్యూస్‌టుడే: మండలంలోని భైరిపురం గ్రామంలో మంగళవారం గర్భాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సంధ్యారాణి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. మొత్తం 56 మంది రోగులను వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఈ శిబిరం నిర్వహణలో ఆరోగ్య, వైద్య సిబ్బంది సహకరించారు.

సోమలిగాపురంలో అగ్నిప్రమాదం

సోమలింగాపురం(మెరకముడిదాం), న్యూస్‌టుడే: మండలంలోని సోమలిగంగాపురంలో మంగళవారం మధ్యాహ్నం విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. ఇదే గ్రామానికి చెందిన డీసీఎంఎస్ ఛైర్మన్ శిరువూరి వెంకటరమణరాజు(పెదబాబు) చెందిన వరి గడ్డిలోడుతో వస్తున్న ట్రాక్టరుకు విద్యుత్తు తీగలు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాలయి. దీంతో అప్రమత్తమై ట్రాక్టరు ఇంజిన్‌ను తొలగించగా.. గడ్డితో పాగు ట్రక్కు కాలిపోయింది.

రహదారి ఇలా.. రాకపోకలెలా!



వసతిగృహం, పాఠశాలకు వెళ్లే రహదారి దుస్థితి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి పట్టణ శివారున అగ్నిమాపక కేంద్రం పక్క నుంచి ఉన్న రహదారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇక్కట్లు తప్పడం లేదు. అగ్నిమాపక కేంద్రం వెనుక ప్రాథమికోన్నత పాఠశాల, బీసీ బాలుర సమీకృత వసతిగృహం, డ్వామా శిక్షణా కార్యాలయం ఉంది. ఈ రహదారి రాళ్లు తేలి గోతుల మయం మారడంతో విద్యార్థులు, అధికారులు, సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. పెద్ద గోతులు ఏర్పడటంతో దాటి వెళ్లాలంటే యాతన తప్పడం లేదు. చాలాకాలంగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకొనే నాథుడే లేదు. ఈ రహదారి గరివిడి మండలం కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలోకి వస్తుంది. ఇప్పటికైనా నేపథ్యంలో అధికారులు దృష్టి సారించి రహదారిని అభివృద్ధికి చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

పాఠశాలల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సర్కారు బడులను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే డాక్టర్ కె.మృణాళిని అన్నారు. చీపురుపల్లి బాలురోన్నత పాఠశాలలో ఆర్‌ఎంఎస్‌ఏ-3లో రూ.41.35 లక్షలతో నిర్మించిన ఆరు అదనపు భవనాలను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సమావేశంలో మాట్లాడుతూ పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కసరత్తు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మీసాల వరహాలనాయుడు, మండల తెదేపా అధ్యక్షుడు రౌతు కామునాయుడు, మండల విద్యాశాఖాధికారి జె.మహాలక్ష్మంనాయుడు, ఉపాధిహామీ ఏపీడీ కె.మురళీబాబు, రాష్ట్ర విద్యా వసతుల మౌలిక వసతుల విభాగం డీఈఈ సత్యనారాయణ, ఏఈ గౌతం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.అప్పారావు, పీఆర్ ప్రాజెక్టు ఎఈఈ డి.రమేష్, గుత్తేదారు టి.గణేష్, తెదేపా నాయకులు కె.నాగార్జున, దన్నాన సూరపునాయుడు, పతివాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అదనపు భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మృణాళిని

సేవాభావం అలవర్చుకోవాలి



ఎన్ఎస్ఎస్ శిబిరంలో మాట్లాడుతున్న ఎస్ఐ నారాయనరావు

గొట్టిపల్లి(మెరకముడిదాం), న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలని బుదరాయవలస పోలీస్‌స్టేసన్ ఎస్ఐ నారాయణరావు అన్నారు. మండలంలోని గొట్టిపల్లి, నరస్యపేట గ్రామాల్లో ఎంఎస్ఆర్, శ్రీహర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... సమాజం, తోటివారి పట్ల సేవాభావం కలిగి ఉండాలన్నారు. పోలీసు శాఖ విధులు, సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యలు కృష్ణమూర్తి, అధాయపకులు విశ్వేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి ఉపాధ్యాయుల ధ్యేయం

అంజనేయపురం(చీపురుపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: విద్యార్థుల అభివృద్ధే ఉపాధ్యాయుల ధ్యేయం కావాలని రాష్ట్ర పీఆర్టీయూ రాష్ట్ర నిర్వహక సభ్యుడు గంగుపల్లి సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ఆంజనేయపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా కొత్త ఆంగ్ల సంవత్సరంలో విద్యాభివృద్ధి బాగుండాలని కాంక్షిస్తూ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో నెలకొన్న మౌలిక వసతుల కల్పనకు ఉపాధ్యాయ ఎంఎల్‌సీ గాదె శ్రీనివాసులనాయుడు కృషి చేస్తున్నారన్నారు. విద్యావ్యవస్థలో నెలకొన్న ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దన్నానకు సత్కారం

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి పట్టణానికి చెందిన తెలుగు అధ్యాపకుడు డాక్టర్ దన్నాన అప్పలనాయుడును పార్వతీపురంలోని జట్టు ఆశ్రమ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. వృద్ధ మిత్ర, అమ్మకు నీరాజనం అనే అంశంపై జట్టు ఆశ్రమం ఆధ్వర్యంలో అమ్మ గొప్పతనం తెలియజేస్తూ కవి సమ్మేళనం జరిగింది. అధ్యాపకుడు అప్పలనాయుడు అమ్మకమ్మని దేవత కవితా పఠనం సభికులను మెప్పించింది. ఈ సందర్భంగా ఆయన్ని జట్టు ఆశ్రమ నిర్వాహకులు సత్కరించారు.



అధ్యాపకుడు అప్పలనాయుడును సత్కరిస్తున్న నిర్వాహకులు

మొక్కజొన్నలో సస్యరక్షణ చేపట్టాలి

నిమ్మలవలస/ ఎలకలపేట (చీపురుపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: మొక్కజొన్న సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ ఎన్‌వీ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం నిమ్మలవలస, ఎలకలపేట గ్రామాల్లో సాగవుతున్న మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించి తెగులు సోకినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలో 6,280 హెక్టార్లలో మొక్కజొన్న సాగవుతోందన్నారు. గులాబీ కాండం తొలిచే పురుగు నివారణ చర్యల గురించి రైతులకు సూచించారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

భైరిపురం(మెరకముడిదాం), న్యూస్‌టుడే: మండలంలోని భైరిపురం గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని మండలాధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు ప్రారంభించారు. ఇరుకు గదుల్లో చిన్నారులు ఇబ్బందులు పడుతుండడంతో అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీలకు పక్కా భవనాలను మంజూరు చేస్తున్నారని చెప్పారు. మండలంలో 27 భవనాలు మంజూరు కాగా వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సీతారామరాజు, జడ్పీటీసీ సభ్యుడు సింహాచలం, మండల తెదేపా అధ్యక్షుడు గోవిందబాబు, ప్రధాన కార్యదర్శి రమణమోహనరావు, సర్పంచి ధనంజయ, సీడీపీవో ఎస్తేరరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన

శివరాం(గరివిడి), న్యూస్‌టుడే: మండలంలోని శివరాం గ్రామంలో మంగళవారం జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. వివిధ అంశాలపై ఆలోచింపజేసేలా బొమ్మలు వేసిన చిన్నారులను సందర్శకులు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు రంగోళి, వాలీబాల్, కోలాటం పోటీలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఏవీ నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

దాతల వితరణ

కెల్ల(గుర్ల), న్యూస్‌టుడే: మండలంలోని కెల్ల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు దాతలు సమకూర్చిన టై, బెల్టులను నాఫెడ్ డైరెక్టరు కె.వి.సూర్యనారాయణ రాజు(పులిరాజు), ఎంపీటీసీ సభ్యుడు కె.సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కె.గోవింద్‌లు పంపిణీ చేశారు. ఈ పాఠశాలలో 80 మంది విద్యార్థులకు స్థానిక నేతలు, ఉపాధ్యాయులు టై, బెల్టులను అందించగా... బెల్లానపేటలో 32 మంది చిన్నారులకు పులిరాజు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా వేళలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి పట్టణంలోని బుధవారం ఉదయం 6 గంటల నుంచి 6.45 వరకు కొత్త అగ్రహారం, రిక్షాకాలనీలకు, 6.45 గంటల నుంచి 7.30 వరకు గవిడివీధి, బజారువీధిలకు, 7.30 గంటల నుంచి 8.15 వరకు కస్పావీధి, శెగిడివీధి, పోలీస్‌లైను, రాజాం రోడ్డు ప్రాంతాలకు, 8.45 గంటల నుంచి 9 వరకు దేవాంగులవీధి, పాత కుమ్మరివీధిలకు, 9 గంటల నుంచి 9.45 వరకు పిల్లపేట, రుంకానవీధి, పాత కూరాకులవీధి, చిలుకూరివీధి, శివాలయంవీధి తదితర ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు.

తెరపై ఈనాడు

విష్ణు: 2 కంట్రీస్, వంశీ: ఒక్క క్షణం, అనురాగ్: ఎంసీఏ అమోగ్: హలో.

-న్యూస్‌టుడే, చీపురుపల్లి

ఆనంద సంక్రాంతికే కానుకలు



నాగళ్లవలసలో చంద్రన్న కానుకలు అందజేస్తున్న మండల ఉపాధ్యక్షురాలు రాధ తదితరులు

నాగళ్లవలస(గుర్ల), న్యూస్‌టుడే: గుర్ల మండలం నాగళ్లవలస గ్రామంలో మంగళవారం చంద్రన్న కానుకలను మండల ఉపాధ్యక్షురాలు చనమల రాధ, మండల తెదేపా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు, సర్పంచి పిసిని సరస్వతిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యక్షురాలు రాధ మాట్లాడుతూ సంక్రాంతిని పేద ప్రజలు ఆనందంగా నిర్వహించుకోవాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు ఉచితంగా సరకులను అందజేస్తున్నారన్నారు. జమ్ము గ్రామంలో చంద్రన్న కానుకలను సర్పంచి కిత్తంనాయుడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గోపన్నవలస(మెరకముడిదాం), న్యూస్‌టుడే: మండలంలోని గోపన్నవలస గ్రామంలో మంగళవారం మండలాధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు చేతుల మీదుగా చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలంతా ఆనందంతో సంక్రాంతి పండగ చేసుకునేందుకు ఉచితంగా సరుకులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందజేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెదేపా నాయకులు ఎస్.రమణరాజు, బంగారాజు తదితరులు పాల్గొన్నారు.



గోపన్నవలసలో సరకు/ అందజేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

సెలవులను వినియోగించని ఉపాధ్యాయులకు సత్కారం

కోనూరు(గరివిడి), న్యూస్‌టుడే: కోనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2017-18 సంవత్సరంలో కేటాయించిన సెలవులను వదులుకుని విధులు నిర్వహించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మంగళవారం ప్రధానోపాధ్యాయుడు కె.ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అతి తక్కువగా సెలవులను వినియోగించుకున్న గణిత ఉపాధ్యాయుడు ఎ.సత్యనారాయణను అభినందించారు. విధులు, బాధ్యతలకే ప్రాధాన్యత ఇచ్చిన ఆయన్ను ఉపాధ్యాయులంతా ఆదర్శంగా తీసుకోవాలని హెచ్ఎం సూచించారు.

విద్యార్థులకు పోటీలు

కొండలక్ష్మీపురం(గరివిడి), న్యూస్‌టుడే: ఐదో విడత జన్మభూమి.. మావూరు సందర్భంగా మంగళవారం గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో జన్మభూమి ప్రతిజ్ఞ చేయించి, ఈ కార్యక్రమం విశిష్టతను ప్రధానోపాధ్యాయుడు బి.పుష్పారావు వివరించారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వం పోటీలు జరిగాయి. బాలబాలికలకు వేర్వేరుగా ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రెడ్డి భారతి, ఉప సర్పంచి పాండ్రంకి కామేశ్వరరావు, ఎస్ఎంసీ ఛైర్మన్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చీపురుపల్లి

విద్యా బడ్జెట్‌లో 30 శాతం కేటాయించాలి

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండు చేశారు. మంగళవారం ఇక్కడ ఆ సంఘం జిల్లా కార్యదర్శి మీసాల అప్పలనాయుడు, అధ్యక్షుడు మామిడి శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు డి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి డి.భూపతి, గౌరవాధ్యక్షుడు పి.అచ్చెంనాయుడు తదితరులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక సమీక్షల్లో విద్యలో పురోగతి లేదంటూ పేర్కొన్నారని గుర్తు చేశారు. అమరావతిలో జాతీయ విద్యా సంస్థల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు పాఠశాలలను వేదికగా మార్చడం వలన విద్యాబోధనకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిలర్ వడ్డాది శ్రీనివాసరావు, ప్రతినిధులు ఎం.శ్రీనివాసరావు, కె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి జన్మభూమి గ్రామసభలు

గరివిడి, న్యూస్‌టుడే: జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా బుధవారం గరివిడి మండలంలోని నాలుగు పంచాయతీల్లో గ్రామసభలు జరుగనున్నాయి. కాపుశంభాం, కొండశంభాంల్లో ఎంపీడీవో అన్నపూర్ణాదేవి ఆధ్వర్యంలో, బొండపల్లి, గొట్నంద గ్రామాల్లో తహసీల్దారు సుభాష్‌బాబు ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించనున్నారు.

అందరి సంక్షేమానికే 'జన్మభూమి-మా ఊరు'


దేవరపొదిలాం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మృణాళిని

ఎమ్మెల్యే మృణాళిని

దేవరపొదిలాం/ నిమ్మలవలస(చీపురుపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: అందరి సంక్షేమాన్ని కాంక్షించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఐదో విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కిమిడి మృణాళిని అన్నారు. చీపురుపల్లి మండలం దేవరపొదిలాం, నిమ్మలవలస పంచాయతీల్లో మంగళవారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామసభల్లో మాట్లాడుతూ గత నాలుగు విడతల్లో ప్రజల నుంచి అర్జీలను పరిశీలించి.. దశల వారీగా సమస్యలను పరిష్కరించమన్నారు. ఈసారి మొత్తం 11 అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. కొత్తగా పింఛన్లు, రేషన్‌కార్డులు అందజేయాలని పభుత్వం నిర్ణయించిందన్నారు. దీనితో పాటు ఎన్టీఆర్ గృహాలుమంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, మండల తెదేపా అధ్యక్షుడు రౌతు కామునాయుడు, ఆర్ఈసీఎస్ అధ్యక్షుడు దన్నాన రామచంద్రుడు, ఎమ్మెల్యే తనయుడు నాగార్జున, ఎంపీడీవో పి.రామకృష్ణ, ఏడీఏ ఎన్వీ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దారు కేవీఎన్ మూర్తి, పీఆర్ ఏఈ డి.రమేష్, నిమ్మలవలస, దేవరపొదిలాం సర్పంచులు డీవీఎన్ వర్మ, ఎం.రమేష్, ఎంపీటీసీ సభ్యుడు బెవర సూర్యనారాయణ, తెదేపానాయకులు దన్నాన సూరపునాయుడు, కెల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

టీసీ సభ్యురాలు ఎలకల పద్మ, తెదేపా నేత అడప సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జన్మభూమి గ్రామసభల్లో విద్యార్థులతో ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

చుక్కవలస(గరివిడి), న్యూస్‌టుడే: ఐదో విడత 'జన్మభూమి- మాఊరు' కార్యక్రమానికి గరివిడి మండలంలోని చుక్కవలస గ్రామంలో మహిళలు వినూత్నంగా స్వాగతం పలికారు. మండలంలో ప్రభుత్వ పరంగా ఏ కార్యక్రమాన్ని ప్రారంభించినా ముందుగా చుక్కవలస నుంచే ప్రారంభించడం సెంటిమెంట్‌గా కొనసాగుతుంది. ఈ విడత జన్మభూమి గ్రామసభలను కూడా చుక్కవలస నుంచే శ్రీకారం చుట్టారు. మహిళలు 'జన్మభూమి-మా ఊరు' అక్షరమాలగా రంగవల్లికను తీర్చిదిద్ది స్వాగతించడం అధికారులు, ప్రజాప్రతినిధులను ఆకట్టుకుంది.


జన్మభూమి- మాఊరుకు స్వాగతం పలుకుతూ చుక్కవలసలో మహిళలు వేసిన రంగవల్లిక

జవాబుదారీ పాలనే లక్ష్యం

చుక్కవలస/శివరాం (గరివిడి), న్యూస్‌టుడే: ప్రజా సమస్యలకు పరిష్కారం చూపడంలో అధికారులంతా జవాబుదారీగా పనిచేయడమే 'జన్మభూమి- మాఊరు' కార్యక్రమ లక్ష్యమని మండలాధ్యక్షురాలు పైల సింహాచలం అన్నారు. మండలంలోని చుక్కవలస, శివరాం గ్రామాల్లో మంగళవారం జరిగిన జన్మభూమి గ్రామసభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముందుగా జన్మభూమి కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి శ్రవణ సందేశాన్ని ప్రజలకు వినిపించారు. అనంతరం సభలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులన్నింటికీ అధికారులు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పి.రమేష్, మాజీ మండలాధ్యక్షుడు పైల బలరాం, ఎంపీడీవో అన్నపూర్ణాదేవి, చుక్కవలస సర్పంచి ఎం.పైడిరాజు , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోడూరు(గరివిడి), న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులతో పాటు పాలనావ్యవస్థనంతా పల్లెల ముంగిటకు తీసుకొస్తున్న ఘనత తెదేపా ప్రభుత్వానిదేనని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు బలగం కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం కోడూరు, గడబవలస గ్రామాల్లో 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమాన్ని తహసీల్దారు సుభాష్‌బాబు ఆధ్వర్యంలోని అధికారుల బృందం నిర్వహించింది. కోడూరు గ్రామసభలో పాల్గొన్న జడ్పీ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పారదర్శక పాలనకు జన్మభూమి నిదర్శనమన్నారు. గత మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించి.. వారి అవసరాలను తెలుసుకుని తీర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోడూరు సర్పంచి అడపా జానకిరమణమ్మ, ఎంపీ

గరివిడి, న్యూస్‌టుడే: ఐదో విడత జన్మభూమిలో అర్హులందరికీ కొత్తగా తెలుపురంగు రేషన్‌కార్డులను పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పేదలంతా ఆనందపడ్డారు. మండలానికి మంజూరైన కార్డులు తక్కువగా ఉండడం, అర్జీదారులు ఎక్కువగా ఉండడంతో అందరికీ పరిస్థితి కానరావడం లేదు. కొత్తగా మంజూరైన కార్డులు 54 వరకే ఉన్నాయి. ఇప్పటికే రేషన్ కార్డులను కోరుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలు 422 వరకు ఉన్నాయి. ఇందులో ఎక్కువగా విభజన కార్డులను కోరేవారే ఉన్నారు. విభజన కార్డులకు సంబంధించి ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని అధికారులు చెబుతున్నారు

తెదేపాతోనే సుస్థిర పాలన

జి.ములగాం/ గొల్లలపాలెం(చీపురుపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: తెదేపాతోనే సుస్థిర పాలన అందుతుందని జడ్పీటీసీ సభ్యుడు మీసాల వరహాలనాయుడు అన్నారు. మంగళవారం తహసీల్దారు ముక్తేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నాలుగేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పారదర్శక పాలన కోసం సాంకేతికతను వినియోగిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. అర్హత ఉన్నవారికే పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు చంద్రన్న బీమా పత్రాలను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాశనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మహాలక్ష్మంనాయుడు, ఈవోపీఆర్డీ సురేష్, గొల్లలపాలెం ఉప సర్పంచి బెవర పురుషోత్తమనాయుడు, ఏఎంసీ పాలకవర్గ సభ్యుడు ఎ.నర్సింహమూర్తి, ములగాం తెదేపా అధ్యక్షుడు సన్యాసప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


జి.ములగాంలో లబ్ధిదారులకు చంద్రన్న బీమా పత్రాలందజేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు వరహాలనాయుడు

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఐదో విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం చీపురుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సంక్షేమం-సంతృప్తి అన్న అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. ఈ చర్చలో పాల్గొన్న జడ్పీటీసీ సభ్యుడు మీసాల వరహాలనాయుడు మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసిన, చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రస్తావించారు. ప్రజల సంతృప్తి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.రామకృష్ణ, తహసీల్దారు ముక్తేశ్వరరావు, ఈవోపీఆర్డీ సురేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భైరిపురం, గొల్లలవలస(మెరకముడిదాం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు జన్మభూమి- మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తోందని మండలాధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం భైరిపురం, గొల్లలవలసపంచాయతీల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భైరిపురం పంచాయతీ జాతీయస్థాయిలో గుర్తింపు పొందిందని గుర్తుచేశారు. గ్రామ పంచాయతీల్లో అత్యధిక నిధులు అభివృద్ధికి ఖర్చు చేసిన ఘనత భైరిపురానికే దక్కిందని చెప్పారు. గ్రామంలో సిమెంటు రహదారులు, కాలువలకు ఎక్కువ నిధులు వెచ్చించామన్నారు. పేదవారికి ఎన్టీఆర్ గృహాలు, అర్హులైన వారందరనికీ పింఛన్లు మంజూరు చేశామని చెప్పారు. ఇంకా అర్హులు ఉంటే పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. గొల్లలవలస పంచాయతీలో ఎంపీడీవో ఆరవెల్లి త్రినాధరావు ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామసభలో ఏఎంసీ ఛైర్మన్ పెరిచర్ల సీతారామరాజు, జడ్పీటీసీ సభ్యుడు పెందుర్తి సింహాచలం, మండల తెదేపా అధ్యక్షుడు రెడ్డి గోవిందబాబు, ప్రధాన కార్యదర్శి మండల రమణమోహనరావు, రెస్కో డైరెక్టరు పైడితల్లి, సర్పంచి ధనంజయ, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, తహసీల్దార్ ఎం.వి.రమణమూర్తి , వివిధశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న జడ్పీ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు


కోడూరు గ్రామసభలో నృత్యం చేస్తున్న చిన్నారులు


భైరిపురం గ్రామ సభలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

విద్యుత్తు సమస్యను తీర్చండి

చింతలపేట/ఎస్ఎస్ఆర్‌పేట(గుర్ల), న్యూస్‌టుడే: జన్మభూమి..మాఊరు కార్యక్రమం మంగళవారం మండలంలోని ఎస్ఎస్ఆర్‌పేటలో ప్రారంభమైంది. ముందుగా వీధుల్లో ఎంపీపీ జమ్ము సత్యం, జడ్పీటీసీ సభ్యురాలు టి.పద్మిని, మాజీ ఎంపీపీ వి.సన్యాసినాయుడు,ఎ ంపీడీవో రవిచంద్ర, ఉపతహసీల్దారు సత్యం తదితరులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభలో జడ్పీటీసీ సభ్యురాలు పద్మిని మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. చింతలపేట, మన్యపురిపేట,వల్లాపురం గ్రామాల్లోనూ జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించారు. చింతలపేటలో విద్యార్థులు మరుగుదొడ్ల ఆవశ్యకత గురించి కళారూపకం ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ గ్రామానికి ఆనందపురం నుంచి విద్యుత్తు సరఫరా చేయాలని స్థానికులు కోరారు. నెల్లిమర్ల ఉపకేంద్రం నుంచి విద్యుత్తు సరఫరాలో సమస్యలు వస్తే మొయిద వరకు బాగు చేస్తున్న అధికారులు తర్వాత పట్టించుకోవడం లేదని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు టి.కిరణ్‌కుమార్, చింతలపేట సర్పంచి పిళ్లా అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు అచ్చియ్యమ్మ, తెదేపా నాయకులు పి.అప్పలనాయుడు,రమణ, కమ్మిండి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి అభినందనలు

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: 2018 సంవత్సరాన్ని తెలుగు భాషా పరిరక్షణ దినోత్సవంగా ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ జిల్లా నిర్వాహకులు బోగాపురపు వాయునందన శర్మ అభినందించారు. మంగళవారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ సీఎం తీసుకున్న నిర్ణయాన్ని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉత్తర, ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.. న్యాయవ్యవస్థలో నిత్యం జరిగే కార్యకలాపాలన్నీ తెలుగులోనే వచ్చేలా చూస్తే సామాన్యులకు న్యాయ వ్యవస్థ పట్ల మరింత అవగాహన పెరుగుతుందన్నారు. విద్యార్థులు సైతం మాతృభాషలో పట్టు సాధించడానికి వీలుంటుందని చెప్పారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 7న చీపురుపల్లిలో విద్యార్థులకు ప్రతిభా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆశయ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ తెలిపారు. స్థానిక శ్రీహర డిగ్రీ కళాశాలలో.. జూనియర్ విభాగంలో 8, 9, 10 తరగతులు, సీనియర్ విభాగంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. వక్తృత్వంలో 'భారత యువత ఏ విధంగా ఉండాలని స్వామి వివేకానంద కోరుతున్నారు', చిత్రలేఖనంలో 'స్వామి వివేకానంద జీవితంలో జరిగిన సంఘటనలు' అంశాలు ఉంటాయన్నారు. ఆసక్తిగల వారు మరిన్ని వివరాలకు ఫోను నంబరు 9440937200లో సంప్రదించాలని ఆయన కోరారు.

గజపతినగరం

దంత వైద్యశిబిరానికి స్పందన

ఇంగిలాపల్లి(దత్తిరాజేరు), న్యూస్‌టుడే: మండలంలోని ఇంగిలాపల్లిలో మంగళవారం నిర్వహించిన ఉచిత దంత వైద్యశిబిరానికి స్పందన వచ్చినట్లు జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు తాడ్డి సంతోష్ తెలిపారు. ఈ శిబిరంలో 100 మంది రోగులు చికిత్స పొందినట్లు చెప్పారు. జిల్లా గొర్రెల సంక్షేమ సంఘ అధ్యక్షులు బమ్మిడి అప్పలనాయుడు, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

చంద్రన్న కానుకల పంపిణీ

జగ్గాపురం(గంట్యాడ గ్రామీణం), న్యూస్‌టుడే: సంక్రాంతి పండగను సంతోషంగా చేసుకోవడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని గంట్యాడ తెదేపా మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కరరావు అన్నారు. మంగళవారం జగ్గాపురం గ్రామంలో కార్డుదారులకు చేపట్టిన చంద్రన్న కానుకల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా చంద్రన్న కానుకలను ఉచితంగా అందజేస్తున్నారన్నారు.



బిల్లలవలసలో ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న శోభారాణి, ఎమ్మెల్యే

కుటుంబ వికాసంతోనే సమాజాభివృద్ధి

• 'జన్మభూమి'లో జడ్పీ అధ్యక్షురాలు స్వాతిరాణి

బిల్లలవలస, ముద్దూరు(బొండపల్లి), న్యూస్‌టుడే: కుటుంబ వికాసంతోనే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని తద్వారా రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందని జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి అన్నారు. ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని ముదూరు, బిల్లలవలస గ్రామాల్లో ఆయా సర్పంచులు కె.సుమతి, ఎన్.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడుతూ కుటుంబ వికాసానికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం రూపొందించిన 15 సూత్రాలపై ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యంగా జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే డా.కేఏ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా రైతు రుణమాఫీ చేయడం ఒక్క తెదేపా ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనతరం ఉపకార వేతనాలు అందించారు. ఉపాధిహామీ పథకం హెల్ప్‌డెస్క్‌ను స్వాతిరాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లమ్మ, జడ్పీటీసీ సభ్యుడు బండారు బాలాజీ, గజపతినగరం మార్కెట్ కమిటీ ఛైర్మన్ బి.నర్సింహవర్మ, సర్పంచి ఎన్.విజయలక్ష్మి, ఎమ్పీడీవో ఎం.ప్రకాశరావు, ఎమ్పీటీసీ సభ్యుడు పి.రాజినాయుడు పాల్గొన్నారు.

పథకాలు వినియోగించుకోవాలి: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి కేటీ బాలత్రిపురసుందరి కోరారు. మంగళవారం ముద్దూరు గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సర్పంచి కె.సుమతి, కార్యకర్త కె.నారాయణరావు, ఎమ్పీటీసీ సభ్యుడు రాజినాయుడుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. నెలివాడ, కెరటాం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని తహసీల్దార్ డి.బాపిరాజు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు వనపర్తి హైమావతి, రాజేటి బుచ్చితాత ఆధ్వర్యంలో సదస్సులు ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈవోపీఆర్‌డీ రవికుమార్, గృహనిర్మాణశాఖ ఏఈ వెంకట్రావు పాల్గొన్నారు.



జగ్గాపురంలో మాట్లాడుతున్న మండలాధ్యక్షురాలు దేముడమ్మ

ఎం.కొత్తవలస, కెంగువ(గజపతినగరం), న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మభూమి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే కె.అప్పలనాయుడు అన్నారు. మంగళవారం ఎం.కొత్తవలస, కెంగువ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. గత కార్యక్రమాల్లో ప్రజలు అడిగిన సమస్యల పరిష్కారంతో పాటు తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ సభ్యుడు మక్కువ శ్రీధర్, తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రావి శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు గంద్రేటి అప్పలనాయుడు, ఆత్మ కమిటీ అధ్యక్షుడు అట్టాడ లక్ష్మనాయుడు, ఆసుపత్రి కమిటీ అధ్యక్షుడు మిత్తిరెడ్డి వెంకటరమణ, రాంజీరాజు, ఎంపీడీవో బి.ఈశ్వరరావు, తహసీల్దార్ బి.శేషగిరిరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. కెంగువ గ్రామానికి రహదారి సౌకర్యం ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తారని మాజీ ఎంపీటీసీ సభ్యుడు మజ్జి రామకృష్ణ ప్రశ్నించగా త్వరలో చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా కొత్త రేషన్‌కార్డులను, చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. జన్మభూమి కార్యక్రమంలో సామూహిక సీమంతాలను చేశారు.

రామవరం, రావివలస(గంట్యాడ గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జన్మభూమి కార్యక్రమంతో సమస్యలు పరిష్కారమవుతాయని మండల ప్రత్యేక అధికారి రాజ్‌గోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని రామవరం, రావివలస గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలన్నింటినీ గుర్తించి పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ నీలకంఠరావు, గ్రామపెద్దలు అల్లు విజయకుమార్, పీరుబండి జైహింద్‌కుమార్, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

రామవరం, రావివలస(గంట్యాడ గ్రామీణం), న్యూస్‌టుడే : ప్రభుత్వం చేపట్టిన జన్మభూమి కార్యక్రమంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని మండల అధ్యక్షురాలు భీమపల్లి దేముడమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని జగ్గాపురం, నీలావతి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులైన వారందరినీ గుర్తించి అందజేస్తామన్నారు. ఎంపీడీవో రమణమూర్తి, జడ్పీటీసీ సభ్యులు కొరుపోలు రమేష్‌కుమార్, వైస్ ఎంపీపీ రంది రామునాయుడు, సర్పంచి కొండపల్లి భాస్కరరావు, అధికారులు పాల్గొన్నారు.



ముద్దూరు జన్మభూమిలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిణి బాలత్రిపురసుందరి

విజయరాంపురం/ ఎస్.చింతలవలస(దత్తిరాజేరు), న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే జన్మభూమి గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బెజవాడ రాజేశ్వరి అన్నారు. మంగళవారం విజయరాంపురంలో జరిగిన సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం అనేక ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రుణఅర్హత పత్రాలు, సంక్రాంతి కానుకలు, ఉపాధి కార్డులు పంపిణీ చేశారు. ఎస్.చింతలవలసలో తహసీల్దారు కల్పవల్లి గ్రామసభలను నిర్వహించారు. అనంతరం షికారుగంజి, పి.లింగాలవలసలో సభలు జరిగాయి. మండల ప్రత్యేకాధికారి వెంకటరావు, ఎంపీడీవో కృష్ణవేణి, సర్పంచులు మైలపల్లి సీతమ్మ, చెల్లూరు సత్యారావు, ఎంపీటీసీ సభ్యులు గణపతి, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విజయరాంపురంలో సంక్రాంతి కానుకలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజేశ్వరి



ఉపాధి కూలీలకు మస్తరు పుస్తకాలను అందజేస్తున్న ప్రత్యేక అధికారి రాజ్‌గోపాల్



ఎస్.చింతలవలసలో ఉపాధి కార్డులు పంపిణీ చేస్తున్న తహసీల్దారు కల్పవల్లి



జన్మభూమి ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు

జిల్లాను అభివృద్ధిలో నిలపండి

కొత్తపాలెం(బొండపల్లి), న్యూస్‌టుడే: జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని బొండపల్లి మండల ఉప ఎంపీపీ బొడ్డు రాము రాష్ట్ర భూగర్భగనుల శాఖ మంత్రి సుజయ్‌కృష్ణారంగారావుని కోరారు. ఆయన కొత్త సంవత్సరం సందర్భంగా మంత్రిని కలిసి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమ మండలంతో పాటు జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలని కోరారు. కొత్తపాలెం సర్పంచి బొడ్డు సత్యవతి, న్యాయవాది వి.సత్యనారాయణతో పాటు పలువురు తెదేపా కార్యకర్తలు ఉన్నారు.



మంత్రి సుజయ్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్నఉప ఎంపీపీ రాము తదితరులు

నేటి జన్మభూమి సభలు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం నాలుగు గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వసాది, కొటారుబిల్లి, సిరిపురం, మురపాక గ్రామాల్లో జరుగుతాయన్నారు.

గజపతినగరం, న్యూస్‌టుడే: జన్మభూమి గ్రామసభలు నాలుగు గ్రామాల్లో జరుగుతాయని ఎంపీడీవో బి.ఈశ్వరరావు తెలిపారు. బుధవారం ఉదయం తహసీల్దార్ బృందం లోగీశ, మధ్యాహ్నం తుమ్మికాపల్లి గ్రామంలో నిర్వహిస్తారన్నారు. ఎంపీడీవో బృందం ఉదయం జిన్నాం, మధ్యాహ్నం రామన్నపేట గ్రామాల్లో సభలు నిర్వహిస్తాయన్నారు.

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: మండలంలోని పాచలవలస, రామచంద్రపురం, ఎస్.బూర్జవలస, కె.కొత్తవలస గ్రామాల్లో బుధవారం జన్మభూమి గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణవేణి, తహసీల్దారు కల్పవల్లి తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బొండపల్లి, న్యూస్‌టుడే: బుధవారం గరుడుబిల్లి, గొట్లాం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్పీడీవో ఎం.ప్రకాశరావు తెలిపారు. ప్రజలు పాల్గొని తమ సమస్యలు వినతుల రూపాన తెలుపుకోవాలని ఆయన కోరారు.

గంట్యాడ, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం నాలుగు గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పీవీ రమణమూర్తి తెలిపారు. తహసీల్దారు బి.నీలకంఠరావు ఆధ్వర్యంలో సిరిపురం, మురపాక గ్రామాల్లో, ఎంపీడీవో ఆధ్వర్యంలో వసాది, కొటారుపల్లి గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ధర్మవరం(శృంగవరపుకోట గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వాలీబాల్ పోటీలను సర్పంచి గొర్లె దేముడు ప్రారంభించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని వర్రి కమలవాణి మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇక్కడ విజేతలు మండల స్థాయి పోటీలో పాల్గొంటారన్నారు.

బొద్దాం(వేపాడ) : మండలంలోని 29 పంచాయతీలలో జన్మభూమి క్రీడల సందడి మొదలైంది. బొద్దాం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్, కోకో క్రీడలను మండల విద్యాధికారి మంతా నాగేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. కొండగంగుబూడి, బొద్దాం తదితర పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు స్థానిక యువకులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణమోహన్ పేర్కొన్నారు. వేపాడలో ఆరుబయట మల విసర్జన రహితపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

సంక్రాంతికి తాటిపూడి నీరు

ఓబలయ్యపాలెం(వేపాడ), న్యూస్‌టుడే: శృంగవరపుకోట నియోజకవర్గానికి చెందిన 71 గ్రామాలకు సంక్రాంతికి తాటిపూడి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వై.గోవిందరావు మంగళవారం తెలిపారు. వేపాడ మండలంలోని ఓబలయ్యపాలెం సమీపంలో పైపు లైన్లకు ముందస్తు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ మంచినీటి పథకంలో భాగంగా రెండో విడతగా రూ. 43 కోట్లు మంజూరయినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని శృంగవరపుకోట, వేపాడ, లక్కవరపుకోట, జామి మండలాలకు చెందిన 71 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నట్లు ప్రకటించారు. మొదటి విడతలో శృంగవరపుకోట మండలంలోని 34 పంచాయతీలకు ఇప్పటికే నీటి సరఫరా జరుగుతుందన్నారు. కొత్తవలస మండలంతో పాటు వేపాడ, లక్కవరపుకోట, జామి, శృంగవరపుకోట మండలాల్లో మిగిలిన గ్రామాలన్నింటికీ మూడో విడతలో సరపరా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఈఈ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం

కూరగాయల ధరలు

గజపతినగరం మార్కెట్లో మంగళవారం నాటి కూరగాయల ధరలిలా ఉన్నాయి.(కిలో రూ.లలో) వంగ: 40, బెండ: 40, దొండ: 40, కాకర: 24, బీర: 40, టమాటా: 20, ఉల్లి: 30, బంగాళాదుంప: 20, చిక్కుడు: 40, బీట్‌రూట్: 40, క్యారెట్: 60, ఆనప: 12, మునగ: 3, అరటి: 3.

- గజపతినగరం, న్యూస్‌టుడే

గ్యాస్ సమాచారం

గజపతినగరం శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ పరిధిలో గల మరడాం, కోమటిపల్లి, ఇంగిలాపల్లి, పెదమేడపల్లి, పోరాం, జక్కువ గ్రామాల్లో గడిచిన వారం రోజుల్లో ఆన్‌లైన్లో నమోదు చేసుకున్న వినియోగదారులకు బుధవారం వ్యాన్‌తో గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

- గజపతినగరం, న్యూస్‌టుడే

నేటి చంద్రన్న వైద్యసేవలు

గజపతినగరం సామాజిక ఆసుపత్రి పరిధిలో గల పాచలవలస, ఆంధ్ర గ్రామాల్లో బుధవారం ఉదయం, ఎస్.చింతలవలస, లక్ష్మీపురం గ్రామాల్లో మధ్యాహ్నం చంద్రన్న సంచార వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహక సంస్థ ప్రతినిధి సూరజ్ తెలిపారు.

- గజపతినగరం, న్యూస్‌టుడే



కస్తూర్బా పాఠశాల తనిఖీ

ఈనాడు కథనానికి స్పందన

కొటారుపల్లి కూడలి(గంట్యాడ), న్యూస్‌టుడే: జన్మభూమి కార్యక్రమంలో భాగంగా డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి బొడ్డేపల్లి రాజగోపాల్ మంగళవారం కొటారుపల్లి కూడలిలోని కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి క్రీడా మైదానంపై మంగళవారం కథనం వెలువడిన సంగతి తెలిసిందే. దీనిపై విద్యార్థుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. క్రీడా మైదానం తప్పక మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు శుద్ధజల ప్లాంటు మంజూరు చేయాలని కోరారు. ప్రత్యేకాధికారిణి బలగ జ్యోతి, సిబ్బంది ఉన్నారు.



పాఠశాలలో దస్త్రాలను పరిశీలిస్తున్న పీడీ రాజగోపాల్



రూ.4 లక్షలతో కల్వర్టు నిర్మాణం

టమటాడ(బొండపల్లి), న్యూస్‌టుడే: మండలంలోని టమటాడ నుంచి ముద్దూరు గ్రామానికి వెళ్లే రహదారిలో ఓ చిన్నపాటి కాలువ ఉంది. దానిపై కల్వర్టు లేక ప్రజలు నానా అవస్థలకు గురయ్యారు. గతేడాది అక్టోబర్ నెలలో 'రహదారిపై కల్వర్టు నిర్మాణం చేయరూ' అనే కథనం ఈనాడులో వచ్చింది. దీంతో అధికారులు అప్పట్లో ప్రతిపాదనలు పంపించారు. ఇటీవల పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం ద్వారా రూ.4 లక్షలతో కల్వర్టు, కాలువకు ఇరువైపులా సీసీ కాలువ నిర్మాణం పనులు అధికారులు చేయిస్తున్నారు. శాసనసభ్యులు డా.కేఏ నాయుడు కల్వర్టు నిర్మాణం చేయిస్తున్నారని పంచాయతీరాజ్‌శాఖ మండల ఇంజినీర్ అధికారి పి.అప్పలనాయుడు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

తెరపై ఈనాడు

★ శ్రీవెంకటేశ్వర- ఎంసీఏ, ★ గంగరాజ్- ఒక్క క్షణం ★ సూర్యా- హలో!

- గజపతినగరం, న్యూస్‌టుడే

ఎప్పటికి పూర్తవుతుంది?



అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాల భవనం

ఎస్.చింతలవలస(దత్తిరాజేరు), న్యూస్‌టుడే: మండలంలోని ఎస్.చింతలవలసలో గత కొన్నేళ్ల నుంచి ఉన్న అసంపూర్తి పాఠశాల భవనాన్ని పూర్తి చేసేదెవ్వరని ఆ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. దీన్ని నిర్మించి సుమారు ఎనిమిదేళ్లు కావస్తుంది. ఇప్పటివరకు అసంపూర్తిగానే నిలిచిపోయింది. దీంతో గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నిర్మాణం పూర్తి చేయాలని ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడే కనిపించలేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరుతున్నారు.

నగదు ప్రోత్సాహకాల పంపిణీ



పాడిరైతులకు నగదు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న మారినాయుడు

వంగర(దత్తిరాజేరు), న్యూస్‌టుడే: మండలంలోని హెరిటేజ్ డెయిరీలో పాలు పోస్తున్న రైతులకు నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేసినట్లు ఆ డెయిరీ బొబ్బిలి శాఖ మేనేజరు మారినాయుడు తెలిపారు. 130 మంది రైతులకు దుప్పట్లతో పాటు రూ.1,35,000 నగదు అందజేసినట్లు చెప్పారు. డెయిరీ ప్రతినిధులు నాగఅప్పారావు, ఇమామ్‌బాషా, శంకరరావు, నారాయణరావు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల అందజేత

బొండపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో చంద్రన్న బీమా లబ్ధిదారుల పిల్లలకు ఉపకార వేతనాలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు వెలుగు ఏపీఎం కె.వెంకటనాయుడు తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 2017-18 ఏడాదికి గాను మండలంలో 2313 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.1200 చొప్పున ఉపకార వేతనాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

బుడతనాపల్లి(గంట్యాడ గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకున్నప్పుడే సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను అరికట్ట వచ్చునని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. మంగళవారం బుడతనాపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వరల్డ్‌విజన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టాలపై విద్యార్థులంతా అవగాహన పెంచుకున్నపుడు సమాజంలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చునన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలకు అవగాహన

మరుపల్లి(గజపతినగరం), న్యూస్‌టుడే: కౌమార దశలో ఉన్న బాలికలు శారీరక, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్రీయ కిశోర్ స్వస్థ అభియాన్ కౌన్సిలర్ రాధ అన్నారు. మంగళవారం మరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత, కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థినులకు కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శారీరక మార్పుల వల్ల వచ్చే ఇబ్బందులను తెలియజేశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సమాజంలో ఏవిధంగా నడుచుకోవాలనే అంశాలను వివరించారు. ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ రాధ

6న ఉద్యోగ మేళా

బొండపల్లి, న్యూస్‌టుడే: ఈ నెల 6న జిల్లాకేంద్రం మహిళా ప్రాంగణంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వెలుగు జాబ్ రిసోర్స్‌పర్సన్ జ్యోతి వెల్లడించారు. ఆమె మంగళవారం బిల్లలవలస గ్రామంలో జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో పాల్గొని విలేకర్లతో మాట్లాడారు. 6న జరుగుతున్న మేళాలో నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 9666802851 చరవాణి నెంబరుకు ఫోన్ చేసి వివరాలు పొందవచ్చని వెల్లడించారు.

చిన్నిపాలెం భూములపై నిలదీత

చినరావుపల్లి, చిన్నిపాలెం(కొత్తవలస), న్యూస్‌టుడే: చిన్నిపాలెం రెవెన్యూలో రైతుల సాగులో ఉన్న భూములకు భూస్థితి మార్పుతూ(ల్యాండ్ కన్వర్షన్) ఎలా అధికారాలు కల్పించారని చిన్నిపాలెం పంచాయతీలో మంగళవారం జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో రైతులు, సీపీఎం ప్రతినిధులు అధికారులను నిలదీశారు. సర్పంచి దాలయ్య అధ్యక్షతన ఎంపీడీవో పి.నారాయణరావు నిర్వహించిన గ్రామసభలో భూముల సమస్యపై అంతా ప్రశ్నించారు. ఇక్కడ సమస్యపై 12 సంవత్సరాల నుంచి పోరాటం చేస్తుంటే రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థల పేర్లతో దస్త్రాలు సిద్ధం చేయడంపై రైతు ప్రతినిధులు సయ్యద్, మొయ్యి దేముడుబాబు, చిటికిరెడ్డి సత్యనారాయణ, బాదిరెడ్డి రమణ, సీపీఎం కొత్తవలస మండల కన్వీనర్ గాడి అప్పారావు, డేగల అప్పలరాజు తదితరులు నిలదీశారు. రెవెన్యూలోని గెడ్డలు, చెరువులు మూసేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తిన విధంగా వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. సమస్యను ఉన్నత అధికారులకు నివేదిస్తామని ఉప తహసీల్దారు అప్పలనాయుడు, ఎంఆర్ఐ తిరుపతిరావు చెప్పారు.

● అప్పన్నదొరపాలెంలో సర్పంచి ఉగ్గిన అమ్మతల్లి అధ్యక్షతన మండల ప్రత్యేక అధికారి, డీఈవో జి.నాగమణి ఆధ్వర్యంలో గ్రామసభను తహసీల్దారు కె.శ్రీనివాసరావు నిర్వహించారు. తాత్కాలిక ఎంపీపీ పి.రాజన్న, జడ్పీటీసీ సభ్యురాలు కోళ్ల రమణమ్మ, తెదేపా మండల శాఖ అధ్యక్షులు కోళ్ల వెంకటరమణ పాల్గొని వెలుగు ఆధ్వర్యంలో చంద్రన్న బీమా పథకం కింద విద్యార్థులకు మంజూరైన ఉపకార వేతనాల పత్రాలను పంపిణీ చేశారు. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని, గిరిజనులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, గత జన్మభూమిలో పింఛన్ల కోసం ఇచ్చిన దరఖాస్తులు పరిష్కరించాలని, గ్రామంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని, గిరిజనుల సాగులో ఉన్న భూములకు 'డి'పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య తరఫున నాయకులు గిరిబాబు, నర్సింగరావు వినతిపత్రాలు అందజేశారు.

● రెల్లిలో సర్పంచి బోగాది జగదీశ్వరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఖరీఫ్‌లో వేసిన వరి పంట వర్షాభావం వల్ల దెబ్బతిందని ఆదుకోవాలని రైతులు కోరారు. రెల్లి ఎస్సీకాలనీ వాసులకు శ్మశాన భూమి కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.

ఐఎంఏ వైద్యుల నిరసన

గజపతినగరం, న్యూస్‌టుడే: ఆసుపత్రులపై వేటువేసే విధంగా నిబంధనలు సడలించేందుకు పూనుకోవడం సరికాదని గజపతినగరం ఐఎంఏ వైద్యులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇండియన్ మెడికల్ కౌన్సిల్ విధానాన్ని మార్చి జాతీయ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఎన్ఎంసీ విధానంలో దేశవ్యాప్తంగా 2.9 కోట్ల మంది వైద్యులు సమస్యలను ఎదుర్కొనడమే కాకుండా వైద్యం ప్రజలకు అందించలేరని వైద్యులు బీఎస్ఆర్ మూర్తి, వి.కృష్ణారావు, ఎస్.పెద్దినాయుడు, వి.సూర్యనారాయణమూర్తి, నాగనరేంద్ర, దేవీప్రసాద్ అన్నారు. ఐఎంఏ పిలుపు మేరకు మంగళవారం గజపతినగరంలో వైద్యులంతా ఆసుపత్రులను ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూసివేసి నిరసన తెలియజేశారు. కార్పొరేట్ ఆసుపత్రులను బలోపేతం చేసేలా ఎన్ఎంసీ విధానాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు, పేదలకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



కరపత్రాలతో నిరసన తెలియజేస్తున్న వైద్యులు



తోటపల్లి దేవస్థానంలో నేటి పూజలు

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ప్రధాన ఆలయంలో ఉదయం 4.30 గంటలకు కవాట ఉద్ఘాటన, ఆరాధన, 6 గంటలకు శాత్తుమొరై, మంగళాశాసనం, బాలభోగం, 6.15 గంటలకు సర్వదర్శనం, నిత్యపూజలు, నిత్యకల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు మహారాజభోగం, 12.30 గంటలకు తలుపులు మూయుట, 3 గంటలకు తలుపులు తీయుట, సర్వదర్శనం, 6 గంటలకు ఆరాధన, 7.30 గంటలకు కవాట బంధనం నిర్వహిస్తారు.

కురుపాం

నిర్మాణాలపై అవగాహన

ఎల్విన్‌పేట(గుమ్మలక్ష్మీపురం), న్యూస్‌టుడే: గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో రాంకుమార్ ఆధ్వర్యంలో ఎల్విన్‌పేట పీబీ కాలనీలో విద్యార్థులు మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగంపైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని, ప్రతి ఒక్కరు మరుగుదొడ్లను నిర్మించుకోవాలన్నారు. నిర్మాణాలు చేపట్టిన తరువాత వాటిని సక్రమంగా వినియోగించినట్లయితే వ్యాధుల నుంచి దూరం కావొచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికే జన్మభూమి-మాఊరు



పి.ఆమిటిలో రైతులకు రుణవిముక్తి పత్రాలు అందజేస్తున్న విజయరామరాజు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా గుర్తించి వాటి పరిష్కారం కోసం జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి, మండ గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు విన్నవించేందుకు మండల కేంద్రానికి రానవసరం లేదని, గ్రామాల్లోకి అన్నిశాఖల అధికారులు రావడం జరుగుతుందన్నారు. అలాంటి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ధాత్రాజ్, పార్వతీపురం ఆర్డీవో సుదర్శనదొర, ఎంపీపీ తాడంగి సాయమ్మ, జడ్పీటీసీ సభ్యులు అలజంగి భాస్కరరావు, తహసీల్దారు వెంకటరమణ పాల్గొన్నారు. ఎంపీడీవో ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో లక్కగూడ, కొండవాడ పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు.

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కురుపాం తెదేపా ఇన్‌ఛార్జి జనార్ధన థాత్రాజు అన్నారు. జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదమేరంగి, పరజపాడు, చింతలబెలగాం, కన్నపుదొరవలస గ్రామాల్లో సభలు జరిగాయి. కన్నపుదొరవలస గ్రామంలో జరిగిన కార్యక్రమంలో థాత్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఎన్టీఆర్ గృహాలు, రేషన్ కార్డులు, వెలుగు ద్వారా మహిళలకు రుణాలు, పేదలు పింఛను అందిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెదమేరంగి, చింతలబెలగాం, పరజపాడులో జరిగిన సభల్లో ఎంపీపీ దత్తి కామేశ్వరి, జడ్పీటీసీ డొంకాడ మంగమ్మ పాల్గొన్నారు. పరజపాడు గ్రామంలో గత కొన్నేళ్లుగా గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేదని, ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులను నిలదీశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సాల్మన్‌రాజు, తహసీల్దారు కె.వి.ఎస్.భాస్కరరావు, ఎంపీడీవో ఎస్.డి.శ్యామ్‌సుందర్, ఇతర అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

కొమరాడ, న్యూస్‌టుడే : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో లక్ష్మీశ అన్నారు. సివిని జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొని పథకాల తీరుపై సమీక్ష నిర్వహించారు. సర్పంచి పొట్నూరు కుమారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జన్మభూమి ప్రత్యేకాధికారులు భా స్కరరావు, సత్యనారాయణ సభను కొనసాగించారు. మండల స్థాయిలో అధికారులతో సంక్షేమ పథకాలను సభలో చదివి వినిపించారు. అర్హత ఉన్నా పింఛన్లు అందడం లేదని పలువురు సమస్యలేవనెత్తారు. దీంతో కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంక, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నంగిరెడ్డి మధుసూదనరావు, వెంకటనాయుడు, ఎంపీడీవో రామారావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. విక్రాంపురంలో గ్రామసభ జరిగింది. పరుశురాంపురంలో జరిగిన సభలో జడ్పీటీసీ సభ్యులు శనపతి పావని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. గుణానపురంలో తహసీల్దారు రాజకుమారి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.

టొంపలపాడు(కురుపాం), న్యూస్‌టుడే: కొండలమీద గ్రామాలకు గృహాలు మంజూరు చేయాలని గత జన్మభూమిలో వినతులు అందజేసినప్పటికీ మంజూరు కాలేదని తిత్తిరి పంచాయతీకి చెందిన పులిపుట్టి, బల్లేరుగూడ, తులసి గ్రామాలకు చెందిన గిరిజనులు అధికారులను నిలదీశారు. మంగళవారం టొంపలపాడులో జన్మభూమి గ్రామసభను నిర్వహించారు. గృహాలమంజూరులో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉందని దీంతో అర్హులైన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల ప్రత్యేకాధికారి సమాధానం ఇస్తూ ఇప్పటికే రేకిళ్ల మంజూరైన వారికి కొత్తగృహాలు మంజూరుకు అవకాశం లేకపోయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.ఇందిరాకుమారి, ఏఎంసీ ఛైర్మన్ కోలారంజిత్‌కుమార్, మాజీ ఎంపీపీ జీవీ రమణమూర్తి, ఎంపీడీవో పైడితల్లి పలుశాఖల అధికారులు పాల్గొన్నారు. తహసీల్దారు



సివిని గ్రామ సభలో పాల్గొన్న పీవో లక్ష్మీశ

బృందం జరడలో గ్రామసభను నిర్వహించగా రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు వినతి పత్రం అందించారు.

రావివలస, లఖనాపురం(గరుగుబిల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు రాధాకృష్ణ అన్నారు. మంగళవారం 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమంలో భాగంగా రావివలస సర్పంచి బలరాంనాయుడు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పథకాలు, వాటి అమలు తీరును ప్రజలకు వివరించారు. ఎంపీపీ ఉషాసరస్వతి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఆయాశాఖల అధికారులు స్పందించి సత్వరం చర్యలు చేపట్టాలన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు జగదీశ్వరి, ఎంపీటీసీ సభ్యులు బాపూజీనాయుడు, పొగిరి విజయ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



తిత్తిరి పంచాయతీలో అధికారులను నిలదీస్తు న్న గిరిజనులు



పరుశురాంపురంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యులు పావని



పెదమేరంగిలో సభలో ప్రసంగిస్తున్న ఎంపీపీ కామేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు రాధాకృష్ణ

గురుకుల విద్యార్థులకు శుద్ధజలం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు సరైన తాగునీటి సౌకర్యం లేకపోవడంతో చేతి పంపుల నీటినే తాగాల్సిన పరిస్థితి నెలకొనేది. దీంతో అనేకమంది విద్యార్థులు అనారోగ్యానికి సైతం గురయ్యేవారు. సమస్యను గుర్తించిన అధికారులు విద్యార్థులకు శుద్ధజలం అందించేందుకు చర్యలు చేపట్టారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సుమారు రూ.2 లక్షల విలువచేసే ఆర్వో ప్లాంట్లను ఇటీవల అమర్చారు. భద్రగిరి ఏపీఆర్ బాలుర, పీటీజీ బాలికల పాఠశాలలు, కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరికరాలను ప్రారంభించడంతో శుద్ధజలాన్ని విద్యార్థులు వినియోగిస్తున్నారు.



ఏపీఆర్ పాఠశాలలో ఆర్వోప్లాంటు ప్రారంభిస్తున్న దృశ్యం

నేడు పలు గ్రామాల్లో సభలు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: బుధవారం నాలుగు పంచాయతీల్లో'జన్మభూమి-మాఊరు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.డి.శ్యామ్‌సుందర్ తెలిపారు. ఎంపీడీవో బృందం ఉదయం కుదమ, మధ్యాహ్నం తురకనాయుడువలసలో,తహసీల్దారుబృందంఉదయంచినమేరంగిలో, మధ్యాహ్నం తాళ్లడుమ్మలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: మండలంలోని వంగర, కేదారిపురం, డుమ్మంగి, రెల్ల పంచాయతీల్లో బుధవారం జన్మభూమి, మా-ఊరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులంతా హాజరవ్వాలన్నారు.

గరుగుబిల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో ఎంపీడీవో జి.పార్వతి ఆధ్వర్యంలో నాగూరు, చిలకాంలో, అలాగే సుంకి, సంతోషపురంలో తహసీల్దారు రాధాకృష్ణ ఆధ్వర్యంలో 'జన్మభూమి-మా ఊరు' గ్రామసభలు నిర్వహించనున్నట్లు ప్రత్యేకాధికారి పాండురంగ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి సహకారం అందించాలని కోరారు.

రూ.1.21 కోట్లతో రహదారుల అభివృద్ధి

లఖనాపురం(గరుగుబిల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలో చంద్రన్న బాట పథకం ద్వారా ఉపాధి, ఎస్‌డీపీకి చెందిన నిధులు రూ.1.21 కోట్లతో 44 సిమెంటు రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ జేఈ ఆనందరావు తెలిపారు. మంగళవారం లఖనాపురంలో సర్పంచి ముదిలి నర్సమ్మ చేతుల మీదుగా రూ.3 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దూరులో మూడు పనులకు రూ.11 లక్షలు, రావుపల్లిలో రూ.16 లక్షలు, కొత్తూరులో రూ.14 లక్షలు, పెదగుడబలో రూ.12 లక్షలు, శివ్వాంలో రూ.7 లక్షలు, గొట్టివలసలో రూ.6.50 లక్షలు, నాగూరులో రూ.11 లక్షలు, సంతోషపురం రూ.2 లక్షలు, తోటపల్లికి రూ.3 లక్షలు, కొత్తపల్లిలో రూ.6 లక్షలు, గిజబలో రూ.5 లక్షలు, లఖనాపురంలో రూ.5 లక్షలు, సుంకిలో రూ.3 లక్షలు, సాంబన్నవలసలో రూ.3.50 లక్షలు, చినగుడబలో రూ.10 లక్షలు, ఉద్దవోలులో రూ.4 లక్షలు, కొంకడివరంలో రూ.2 లక్షల ప్రతిపాదనలతో పనులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపీపీ ధనుంజయరావు, మాజీ ఎంపీపీ పురుషోత్తంనాయుడు, గ్రామపెద్దలు గౌరునాయుడు, జగన్నాథం, పీఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



రహదారి పనులు ప్రారంభిస్తున్న సర్పంచి నర్సమ్మ, ప్రజాప్రతినిధులు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

స్వచ్ఛభారత్‌పై విద్యార్థులకు పోటీలు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: స్వచ్ఛతపై విద్యాశాఖ ఆదేశాలతో మంగళవారం మండల వనరుల కేంద్రంలో మండల స్థాయిలో పలు రకాల పోటీలు నిర్వహించారు. జడ్పీ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వక్తృత్వం, చిత్రలేఖనం, ముగ్గులు, వ్యాసరచన పోటీల నిర్వహించారు. పోటీల్లో మరుగుదొడ్లు-మన ఆత్మగౌరవంపై అన్న అంశంపై పోటీలు నిర్వహించారు. స్వచ్ఛభారత్ స్ఫూర్తితో ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో జియ్యమ్మవలస, బీజెపురం జడ్పీ పాఠశాలల హెచ్ఎంలు ఎం.శ్రీనివాసరావు, జగన్నాథ రథో, సీఆర్‌పీలు ఉన్నారు.

కురుపాం

వృద్ధమిత్రతో ఆసరా



వృద్ధురాలికి దుప్పట్లు అందిస్తున్న పీవో

కొమరాడ, న్యూస్‌టుడే: పోలీసుల ఆధ్వర్యంలో చేపడుతున్న వృద్ధమిత్ర కార్యక్రమం ఎంతోమందికి ఆసరాగా నిలుస్తుందని గిరిజన సంక్షేమ పథక సంచాలకులు లక్ష్మిశ అభిప్రాయపడ్డారు. మంగళవారం సివినిలో పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో వృద్ధులకు దుప్పట్లు అందించారు. హెడ్‌కానిస్టేబుల్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

గరుగుబిల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సుంకిలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసినట్లు మంగళవారం ఎస్‌ఐ హరిబాబునాయుడు తెలిపారు. పట్టుబడ్డ ఐదుగురు జూదరుల నుంచి రూ.10,350 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తురకనాయుడువలసలో అగ్నిప్రమాదం

నాలుగు పూరిళ్లు, పది పశువుల శాలలు దగ్ధం



కాలిపోయిన పశువుల శాలలు

తురకనాయుడువలస(జియ్యమ్మవలస), న్యూస్‌టుడే: మండలంలోని తురకనాయుడువలస గ్రామంలో సోమవారం రాత్రి రెండు గంటల సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పూరిళ్లు, పది పశువుల శాలలు అగ్నికి ఆహుతయ్యాయి. రెవెన్యూ సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం సోమవారం రాత్రి అందరూ గాఢనిద్రలో ఉన్న సమయంలో యాదవవీధిలో ఓ గృహం నుంచి మంటలు రావడంతో గ్రామానికి చెందిన గుంటబోయిన రాంబాబు, యడ్ల సత్యం, పుర్రు సింహాచలం, పల్ల శ్రీనివాసరావు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. వీరి నివాసాలకు ఆనుకుని ఉన్న పది పశువుల శాలలు అగ్నికీలలకు దగ్ధమయ్యాయి. దీంతో నాలుగు ఇళ్లలోని పాత్రలు, ఇతర పరికరాలు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం ఉండొచ్చని తహసీల్దారు కె.వి.ఎస్,భాస్కరరావు తెలిపారు. పశువుల శాలలో ఉన్న పలు పశువులకు గాయాలు కాగా, పుర్రు కృష్ణకు చెందిన ఐదు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. గుంటబోయిన రమేష్ శాలలో ఉంచిన 25 వ్యవసాయ పంపుసెట్టు పైపులు కాలిపోయాయి. అయితే మంటలు ఎలా వ్యాపించాయో తెలియడం లేదని, విద్యుదాఘాతం కావొచ్చని గ్రామస్థులు పేర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ డొంకాడ మంగమ్మ, కురుపాం ఏఎంపీ మాజీ అధ్యక్షులు డొంకాడ రామకృష్ణ బాధితులను పరామర్శించారు. వీఆర్వో జి.జగజ్జీవనరావు, ఆర్‌ఐ శివ జగన్ కాలిన ఇళ్లు, శాలలను పరిశీలించి నష్టం అంచనా వేశారు.



కాలిపోయిన గృహాలను పరిశీలిస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు మంగమ్మ

మరుగుదొడ్ల ఆవశ్యకతపై పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న బాలికలు

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: మరుగుదొడ్ల ఆవశ్యకతపై మండల స్థాయిలో మంగళవారం వ్యాసరచన, ముగ్గులు, చిత్రలేఖనం పోటీలను మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద నిర్వహించారు. వ్యాసరచనలో ప్రథమం గరుగుబిల్లి, ద్వితీయం హిక్కింవలస, తృతీయం పెద్దూరు, చిత్రలేఖనంలో ప్రథమం గొట్టివలస, ద్వితీయం గరుగుబిల్లి, తృతీయం ఉల్లిభద్ర, రంగవల్లి పోటీల్లో ప్రథమం గొట్టివలస, ద్వితీయ ఉల్లిభద్ర, తృతీయం గరుగుబిల్లి పాఠశాలల విద్యార్థులు గెలుపొందారు. వీరికి ప్రధానోపాధ్యాయులు బొత్స రవికుమార్, ముమ్మిడి, ఏగోటి శంకరరావు, శ్రీనువాసరావు బహుమతులను అందజేశారు.

సమాజ చైతన్యానికే గజల్స్



గజల్స్ వినోద్‌కు పుస్తకాలను అందిస్తున్న సింహాచలం

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: ప్రజలు అన్ని రంగాల్లో చైతన్యం కావాలి తప్పితే మంత్రాలకు, మాయలకు, మోసాలకు గురికాకూడదని ప్రముఖ గజల్స్ వినోద్ అన్నారు. ఆయన మంగళవారం గరుగుబిల్లి వచ్చిన సందర్భంగా ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. విద్యార్థుల్లో పరివర్తనకు, సమాజంలో మానవతా విలువల పెంపుదలకు చైతన్యం తీసుకురావాలన్నదే తన గజల్స్ ప్రదర్శనల ముఖ్య ఉద్దేశమన్నారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, బీహార్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో 530పైగా ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. భగవత్‌గీతను సాధారణ తెలుగు పదాల్లోకి మార్చి రచించిన గరుగుబిల్లి వాసి చందక సింహాచలం వినోద్‌కు పలు గ్రంథాలను అందజేశారు.

తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలి



సన్యాసమ్మను సన్మానిస్తున్న ఎక్సైజ్ సీఐ

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: జన్మనిచ్చిన తల్లిదండ్రులను వృద్ధాప్య సమయంలో ఎలాంటి లోటు రాకుండా ప్రతిఒక్కరు రుణం తీర్చుకోవాలని పార్వతీపురం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం తోటపల్లి జట్టు సంస్థ వ్యవస్థాపకులు డి.పారినాయుడు తల్లి సన్యాసమ్మ 90 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆమెను సన్మానించారు. గిరిజన మహిళలు అక్షరాస్యతపై అభివృద్ధి సాధించాలని పారినాయుడు రాసిన పుస్తకాన్ని ఆమెకు అంకితం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గాంధీ స్మారక నిధి అధ్యక్షులు రొంగలి పోతన్న, డి.విజయ్ కుమార్, టి.మణికుమార్, రౌతు వాసుదేవరావు, గొల్లు మురళీమోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వితరణ



బ్యాగులు అందిస్తున్న సర్పంచి బలరాంనాయుడు

రావివలస(గరుగుబిల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని రావివలస సర్పంచి మరిశర్ల బలరాంనాయుడు అన్నారు. మంగళవారం ఎస్సీ వసతిగృహం విద్యార్థులకు ఆయన బ్యాగులను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు సమయం ఆసన్నమైన నేపథ్యంలో.. విద్యార్థులు ప్రతి క్షణాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రాధాకృష్ణ, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దామోదరనాయుడు, సంరక్షకుడు శ్రీనివాసరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మొండెంఖల్లు(కురుపాం), న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మొండెంఖల్లు సర్పంచి గౌరీశంకరరావు అన్నారు. మంగళవారం మొండెంఖల్లుల్లో చంద్రన్న కానుకను పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు పండగలను ఆనందంగా జరుపుకొనేందుకు ప్రభుత్వం ఏటా సరకులను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.ఇందిరాకుమారి, జిల్లాపరిషత్తు కో-ఆప్షన్ సభ్యుడు రంజిత్‌కుమార్ నాయకో పాల్గొన్నారు.



సంక్రాంతి సరకులను అందజేస్తున్న సర్పంచి, ఎంపీపీ

మెరుగుపడని సేవలు.. ...పట్టించుకోని అధికారులు



★ పై చిత్రం చూశారా.. ఏదో సమావేశంలో కుర్చున్నారనుకుంటే పొరపాటే.. పింఛన్లు కోసం సుదూరప్రాంతమైన రెల్ల నుంచి మండలకేంద్రానికి వచ్చారు. తీరా వచ్చేసరికి సాంకేతిక సమస్య కారణంగా బయోమెట్రిక్ పని చేయకపోవడంతో ఇదిగో ఇలా కార్యాలయం ఆవరణలో నిరీక్షించాల్సి వచ్చింది. సాయంత్రం వరకూ గిరిజనులు పింఛను అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో బీఎస్ఎన్ఎల్ సేవలు సక్రమంగా పనిచేయడంలేదు. సాంకేతిక సేవలు అంతంతమాత్రంగానే అందుతుండడంతో రేషన్‌సరకులు, పింఛన్ల పంపిణీకి ఇబ్బందులు తప్పటం లేదు. ఇది ఒక్కనెల అనుకుంటే పొరపాటే. ప్రతి నెలా ఇదే దుస్థితి సాగుతున్నప్పటికీ కనీసం అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం.

– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

★ పక్క చిత్రంలోని వృద్ధులను చూశారా.. పింఛన్లు కోసం ఎన్ని పాట్లు పడుతున్నారో. మండలంలోని ఎస్‌కేపాడు, జేకేపాడు, రేగులపాడు, డోకులగూడ, కొసగూడ తదితర గ్రామాలకు చెందిన వీరంతా పింఛన్ల కోసం ఎల్విన్‌పేట పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. సాయంత్రం వరకు కార్యదర్శి రాకపోవడంతో రోజంతా పస్తులుండి ఉసూరుమంటూ వెనుదిరగాల్సి వచ్చింది.



రామతీర్థంలో పూజలు

రామతీర్థం(నెల్లిమర్ల), న్యూస్‌టుడే: ఉదయం 5.00 గంటలకు సుప్రభాత సేవ, 6.30 నుంచి 7.00 బాలభోగం, 7.00 నుంచి 11.30 సుందరకాండ హవనం, సర్వదర్శనాలు, నిత్యకల్యాణం, 11.30 నుంచి 12.15 మహానివేదన, రాజభోగం, మధ్యాహ్నం 12.15 నుంచి రాత్రి 7.00 గంటల వరకు సర్వదర్శనాలు, రాత్రి 7.00 గంటల నుంచి 8.00 గంటల వరకు బాలభోగం, 8.00 తర్వాత స్వామివారికి పవళింపు సేవ.

నెల్లిమర్ల

కూరగాయల ధరలు

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: పూసపాటిరేగ మార్కెట్‌లో మంగళవారం కూరగాయల ధరలిలా ఉన్నాయి. (కిలో రూ.ల్లో): వంగ 24, టమాట 28, పొడవు చిక్కుడు 25, పొట్టిచిక్కుడు 28, దొండ 25, బీర 26, ముల్లంగి 32, క్యాబేజి 15, కాకర 40, క్యారెట్ 65, ఉల్లి 35, బంగాళాదుంపలు 15, పచ్చిమిర్చి 72, బెండ 30, క్యాప్సికం 32.

సమస్యల పరిష్కారానికే జన్మభూమి: ఎమ్మెల్యే



కనిమెల్లలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పతివాడ

కనిమెల్ల(పూసపాటిరేగ), న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్రప్రభుత్వం జన్మభూమి.. మాఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామినాయుడు అన్నారు. మండలంలోని జరిగిన కనిమెల్ల, కనిమెట్ట పంచాయతీల్లో మంగళవారం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామసభల్లో మాట్లాడుతూ అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని దశలవారీగా అమలు చేస్తున్నారన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే చేతులమీదగా పలు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ప్రసాదరావు, ఎంపీడీవో నారాయణరావు, తహసీల్దారు గిరిధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం

చొల్లంగిపేట/డి.కొల్లాం (డెంకాడ), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కంది చంద్రశేఖర్ అన్నారు. ఐదోవిడత ' జన్మభూమి-మాఊరు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం డి.కొల్లాం, చొల్లంగిపేటల్లో గ్రామసభలు నిర్వహించారు. డి.కొల్లాంలో తహసీల్దారు పి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. అర్హులైన వారు సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకుని లబ్ధిపొందాలన్నారు. చొల్లంగిపేట గ్రామసభకు జడ్పీటీసీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామసభల్లో ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్నిచదివి విన్పించారు. తర్వాత శాఖలవారీగా చేపట్టిన ప్రగతిని అధికారులు తెలియజేశారు. అర్జీల స్వీకరణకు ప్రత్యేక కౌంటరు నిర్వహించారు. డెంకాడ, మోపాడ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి రోగులకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో చొల్లంగిపేట సర్పంచి తొత్తడి సంతోషికుమారి, ఎమ్పీటీసీ సభ్యుడు డి.వెంకట రామరాజు , మాజీ సర్పంచి మహంతి నర్సునాయుడు, ఎంపీడీవో నిర్మలాదేవి, తహసీల్దారు రామకృష్ణ, ఉప తహసీల్దారు సుభాష్, వ్యవసాయాధికారి హరికృష్ణ , నాయకులు తొత్తడి శ్రీనివాసరావు, టి.సూరిబాబు, రమణమూర్తిరాజు, కలిశెట్టి రమేష్, కరణం రమణ, పిన్నింటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

తూడెం(భోగాపురం), న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించే బాధ్యత అధికారుల పైనే ఉందని ఎంపీపీ కర్రోతు బంగారాజు అన్నారు. అయిదో విడత జన్మభూమి-మావూరు కార్యక్రమాన్ని మంగళవారం భోగాపురం మండలంలోని తూడెం, కవులవాడ, చెరుకుపల్లి, చేపలకంచేరు పంచాయతీల్లో నిర్వహించారు. తూడెం గ్రామసభలో ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించాలన్నదే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. గ్రామంలో ఇంటింటి కుళాయిలు, గృహాలు లేనివారికి స్థలాలతో పాటు గృహనిర్మాణాలు అవసరమని గ్రామస్థులు విన్నవించారు. అనంతరం కవులవాడలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణస్వామి నాయుడు పాల్గొన్నారు. గ్రామ పరిస్థితులు, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పడాల రాజేశ్వరి, మండల ప్రత్యేకాధికారి కనకరాజు, సర్పంచి కుంచంనాగమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పైలరామయ్యమ్మ, ఎంపీడీవో పద్మజ, ఇతర శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పథకాలను అర్హులంతా వినియోగించుకోవాలి

వల్లూరు, గరికిపేట(నెల్లిమర్ల), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామినాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని వల్లూరు, గరికిపేట గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఉచితంగా చంద్రన్న కానుకలను అందజేస్తోందన్నారు. అర్హులందరికీ ఫింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో 2 వేల మందికి పింఛన్లు మంజూరు చేశామని చెప్పారు. లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు, రైతులకు ఈ-పాసుపుస్తకాలను అందజేశారు. అంగన్‌వాడీకేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. గరికిపేట గ్రామంలో తహసీల్దార్ కె. చిన్నారావు ఆధ్వర్యంలో జన్మభూమి గ్రామసభ నిర్వహించారు. అంగన్‌వాడీ, రేషన్ దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సువ్వాడ వనజాక్షి, జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు, మండల జన్మభూమి కమిటీ సభ్యుడు సువ్వాడ రవిశేఖర్, మండల తెదేపా అధ్యక్షుడు గేదెల రాజారావు, ఎంపీడీవో కె. రాజ్‌కుమార్, తహసీల్దార్ కె.చిన్నారావు, సర్పంచులు మామిడి ధనలక్ష్మి చింతపల్లి సత్యన్నారాయణ, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు



చొల్లంగిపేట గ్రామసభలో జన్మభూమి ప్రతిజ్ఞ చేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు , అధికారులు

అర్హులందరికీ లబ్ధి...

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నగర పంచాయతీ పరిధిలో జరజాపుపేట, నెల్లిమర్ల ప్రాంతాల్లో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తామని కమిషనర్ టి. జయరాం అన్నారు. మంగళవారం జరజాపుపేట గ్రామంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుసభలో ఆయన మాట్లాడుతూ అర్హులైనవారందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. జి+3 గృహాలకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు చంద్రన్న కానుకలు, రేషన్‌కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యులు లెంక అప్పలనాయుడు అవనాపు సత్యన్నారాయణ, బైరెడ్డి నాగేశ్వరరావు, నల్లి చంద్రశేఖర్, కింతాడ కళావతి, నగర పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కందివలసలో అంగన్వాడీ కార్యకర్తల పోషకాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు

అవగాహన అవసరం

రామతీర్థం(నెల్లిమర్ల), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని ప్రధానోపాధ్యాయుడు కొల్లి తవిటినాయుడు అన్నారు. మంగళవారం జన్మభూమి.. మా ఊరు కార్యక్రమంలో భాగంగా రామతీర్థంలో ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాచరచన, వక్తృత్వం పోటీలను నిర్వహించారు. పంచాయతీ పరిధిలో వాలీబాల్, స్కిప్పింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు సీహెచ్. సోమేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తూడెంలో చంద్రన్న బీమా పత్రాలను అందిస్తున్న ఎంపీపీ బంగారాజు



జరజాపుపేట వార్డుసభలో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం



లబ్ధిదారులకు ఈ-పాసుపుస్తకాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పతివాడ, ఎంపీపీ వనజాక్షి



రామతీర్థం ఉన్నత పాఠశాలలో వ్యాచరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తాగునీటి సరఫరా వేళలు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా వేళలు ఇలా ఉన్నాయి. ఉదయం 6.30 గంటల నుంచి 7.30 వరకు 1, 17, 18, 19, 20వ వార్డులు, జరజాపుపేటలో, ఉదయం 8.00 నుంచి 10.00 గంటల వరకు పద్మశాలివీధి, చిక్కాలవీధి, రెల్లివీధి, మొయిద కూడలి, 10, 11, 3, 4వ వార్డుల్లో, ఉదయం 6.00 నుంచి 8.00 గంటల వరకు థామస్‌పేట, కాలేజీ కాలనీ, సెగిడివీధి 13, 14, 15, 16వ వార్డుల్లో, ఉదయం 7.00 నుంచి 9.00 గంటల వరకు కొండపేట, 3, 2వ వార్డుల్లో తాగునీరు సరఫరా జరుగుతుందని నగర పంచాయతీ కమిషనర్ టి.జయరాం తెలిపారు.

డెంకాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన డెంకాడ పంచాయతీలో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 5.30 గంటల వరకు తాగునీరు సరఫరా జరుగుతుందని పంచాయతీ అధికారులు తెలిపారు.

భోగాపురం, న్యూస్‌టుడే: మండంలోని గుడివాడ, రావాడ, ముక్కాం గ్రామాల్లో ఉదయం 6గంటలకు తాగునీరు విడుదల చేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

విద్యుత్తు బిల్లుల స్వీకరణ

భోగాపురం, న్యూస్‌టుడే: భోగాపురం, గుడివాడ, రావాడ, ముంజేరు ప్రాంతాల్లో ఉన్న మీసేవ కేంద్రాల్లో బుధవారం విద్యుత్తు బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్తుశాఖ అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే డైరీ

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: నెల్లిమర్ల ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు బుధవారం నియోజకవర్గంలో జరుగనున్న జన్మభూమి కార్యక్రమంలో పాల్గొంటారు

విద్యార్థులకు క్రీడా పోటీలు

పసుపాం(పూసపాటిరేగ), న్యూస్‌టుడే: జన్మభూమి..మా ఊరు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం పూసపాటిరేగ మండలంలోని పసుపాం జడ్పీ ఉన్న పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు లీలాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆటల్లో మెలకువల గురించి తెలియజేశారు. ఉపాధ్యాయులు కూడా క్రీడాపోటీల్లో పాల్గొని విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.



పాఠశాల ఆవరణలో క్రీడాపోటీల్లో పాల్గొన్న బాలికలు

అదనపు భవనాల నిర్మాణాలెప్పుడో..

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన పూసపాటిరేగ జడ్పీ ఉన్నత పాఠశాలలో వసతి సమస్య వెంటాడుతోంది. ఇక్కడ 900వందల మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో 8 గదులే అనువుగాగా ఉన్నాయి. వసతి చాలక ఆరుబయట చెట్ల కింద, రేకుల షెడ్లలో తరగతులు నిర్వహివాల్సిన పరిస్థితి ఉంది. పాఠశాలకు అదనపు భవనాలు మంజూరైనా నిర్మాణపనులు మందకొడిగా సాగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి గుత్తేదారుపై ఒత్తిడి తెచ్చి వీటి నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పూసపాటిరేగ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన అదనపు భవనాలు

నెల్లిమర్ల

గ్యాస్ సమాచారం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్లలోని గాయత్రి గ్యాస్ ఏజెన్సీలో ముందురోజు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వినియోగదారులకు మరుసటి రోజు సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. గృహ వినియోగ సిలిండర్ ధర రూ.746, వాణిజ్యపరమైన సిలిండర్ ధర రూ.1316 మాత్రమే వినియోగదారులు చెల్లించాలని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు.

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: పూసపాటిరేగలోని గాయత్రి గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం కోనాడ, నడిపల్లి, బూరపేట, వెల్దూరు, కాలపురెడ్డి పేట, తిప్పలవలస, కిలుగుపేట, కొల్లాయవలస, పులిగెడ్డపాలెం, తమ్మయ్యపాలెం, రాయిడుపేట, పతివాడ, గోవిందపురం, రోలవాస్పిడి, కృష్ణాపురం, కొణతాలపాలెం, చౌడువాడ, కోనాయపాలెం, చింతపల్లి గ్రామాలకు గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయనున్నట్లు ఏజెన్సీ ప్రతినిధి తెలిపారు.

రైళ్ల రాకపోకల వేళలు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల రైల్వేస్టేషన్ నుంచి ఇటు విశాఖపట్నం, అటు పలాస వైపు వెళ్లే ప్యాసింజరు రైళ్ల రాకపోకల వేళలు ఇలా ఉన్నాయి. పలాస నుంచి విశాఖపట్నం వైపు ఉదయం 07.31 గంటలకు, 11.41 గంటలకు, మధ్యాహ్నం 03.19 గంటలకు, విశాఖపట్నం నుంచి పలాస వైపు ఉదయం 09.32 గంటలకు, మధ్యాహ్నం 01.32 గంటలకు, రాత్రి 08.13 గంటలకు స్టేషన్లో రైళ్లు బయలుదేరుతాయని రైల్వే అధికారులు తెలిపారు.

తెరపై ఈనాడు

● నెల్లిమర్ల- సాయిసుభద్ర: ఎంసీఏ... మిడిల్ క్లాస్ అబ్బాయ్, శ్రీనివాస: 2 కంట్రీస్ ● భోగాపురం- గోపాలకృష్ణ: 2 కంట్రీస్ ● పూసపాటిరేగ- సాయికృష్ణ: 2 కంట్రీస్

వీధిదీపాలు వెలగవు... తాగునీరు అందదు



జరజాపుపేటలో సిమెంటు రహదారికి నోచుకోని వీధి

- అభివృద్ధి పనులకు ఆమడ దూరంలో..1వ వార్డు
- నగరవాసులకు తప్పని కష్టాలు
- పట్టించుకోని నగర పంచాయతీ సిబ్బంది

నెల్లిమర్ల, న్యూస్‌టుడే

నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలోని 1వ వార్డులో కనీస మౌలిక సదుపాయాలు కరవవడంతో నగరవాసులు సమస్యలతో సతమతమవుతున్నారు. పంచాయతీ ఏర్పడి సుమారు నాలుగేళ్లవుతున్న సిబ్బంది అభివృద్ధి పనులను సజావుగా నిర్వహించడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వార్డులోని తాడుతూరివీధి, కొండలవీధి, ఎస్సీ కాలనీ.. మూడు వీధుల్లో కలిపి సుమారు 306 గృహ నిర్మాణదారులతో పాటు మరో 1,224 మంది జీవిస్తున్నారు. కాగా ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో సిమెంట్ రహదారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ఎల్ఈడీ వీధి దీపాలు సక్రమంగా వెలగక రాత్రి సమయాల్లో వృద్ధులు, చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారని నగరవాసులు బావురుమంటున్నారు. తాగునీరు అందక చాలా ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. స్థలం లేని గృహ నిర్మాణదారులకు సామూహిక మరుగుదొడ్లను నిర్మించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా.. సిబ్బంది సకాలంలో పనులు ప్రారంభించకపోవడంవల్లే నిధులు వెనక్కు మళ్లాయని వార్డువాసులు చెబుతున్నారు. తాగునీటి చేతిబోర్లు పనిచేయక సమస్యలు మరింత జఠిలంగా మారాయని స్థానికులు తెలిపారు.



ఎస్సీకాలనీలో సామాజిక భవనం దుస్థితి

వెనక్కి మళ్లిన రూ.5 కోట్ల నిధులు..!

జరజాపుపేట ఎస్సీ కాలనీలో సామాజిక భవనం శిథిలా స్థితికి చేరింది. సామాజిక కార్యక్రమాల నిర్వహణకు డ్వాక్రా మహిళలు, సేవా సంఘాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి నగర పంచాయతీకి రూ.5 కోట్లు మంజూరయ్యాయి. వీటిని సకాలంలో వినియోగించకపోవడంతో ప్రభుత్వం నిధులను వెనక్కు తీసుకున్నారు. దీంతో సామాజిక భవనం, తాగునీరు ట్యాంకు, సిమెంట్ రహదారులు, కాలువల అభివృద్ధి పనులు కేవలం ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. వచ్చిన నిధులు అందుబాటులో లేక పంచాయతీ సిబ్బంది చేతులెత్తేశారు. ప్రస్తుతం 1వ వార్డులో కనీస మౌలిక వసతుల ఏర్పాటు లేక పోవడానికి తోడు.. అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే ఆగడంతో స్థానికులకు కష్టాలు తప్పడంలేదు. ఉన్నతాధికారులు సకాలంలో స్పందించాలని వారు కోరుతున్నారు.

తాగునీరు లేక ఇబ్బందులు



నగర పంచాయతీ ఏర్పడి నాలుగేళ్ల అవుతున్న తాగునీటికి ఇబ్బందులు తప్పడంలేదు. వీధుల్లో ఉన్న కుళాయిలు, చేతిబోర్లు సక్రమంగా పని చేయవు. సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోకపోవడం సరికాదు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు సక్రమంగా అందేలా చూడాలి.

-ఆర్. కృష్ణ, 1వ వార్డువాసి (జరజాపుపేట)

మరుగుదొడ్లులేక మహిళల అవస్థలు



వార్డులో ఉన్న కొండలవీధి, ఎస్సీ కాలనీ, తాడుతూరివీధి ప్రాంతాల్లో పంచాయతీ అధికారులు అభివృద్ధి పనులు నిర్వహించాలి. సామూహిక మరుగుదొడ్ల లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్వాక్రా మహిళలు సంఘ సమావేశాలు నిర్వహించేందుకు సక్రమమైన సామాజిక భవనం అందుబాటులో లేదు. ఇక తాగునీటి కష్టాలు భరించక తప్పట్లేదు. అధికారుల స్పందన కోసమే వేచిచూస్తున్నాం.

-వై.పార్వతి, డ్వాక్రా మహిళ(ఎస్సీ కాలనీ)

అభివృద్ధి పనులు చేపడతాం



నెల్లిమర్ల నగర పంచాయతీలోని 1వ వార్డులో అభివృద్ధి పనులు చేపడతాం. మౌలిక సదుపాయాలైన తాగునీరు, వీధి దీపాలు, సిమెంట్ రహదారుల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం. సామూహిక మరుగుదొడ్డ నిర్మాణాలు, తదితర పనులకు ప్రస్తుతం టెండర్లు పిలిచాం. ఈ ప్రక్రియ పూర్తవగానే పనులను ప్రారంభిస్తాం.

-టి.జయరాం, కమిషనర్, నెల్లిమర్ల నగర పంచాయతీ

ఫిబ్రవరి 26 నుంచి కనకదుర్గమ్మ ఉత్సవాలు



ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారు

భోగాపురం, న్యూస్‌టుడే: భోగాపురం మండల కేంద్రంలోని ప్రతీ ఏటా నిర్వహిస్తున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలకు ముహూర్తం ఖరారు చేశారు. మంగళవారం ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కందులరఘుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఫిబ్రవరి 26, 27, 28 తేదీల్లో అమ్మవారి సంబరాలు నిర్వహించాలని నిర్ణయించారు. 150 ఏళ్ల చరిత్ర గల అమ్మవారి ఆలయంలో ప్రతీ ఏటా సంప్రదాయాల ప్రకారమే ఉత్సవాలు నిర్వహిస్తున్నామని రఘుబాబు తెలిపారు. వచ్చే నెల 26వ తేదీ అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన అమ్మవారి పండగ మూడురోజుల పాటు వైభవంగా చేపడతామన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణకు ప్రజల సహకారం కూడా అవసరమని ఆయన కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కొమ్మూరు సుభోషణరావు, ఆళ్ల విశ్వేశ్వరరావు, ఉదయ్‌బాబు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రదీప్‌రాజు

డెంకాడ, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆటలపోటీల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని డెంకాడ సర్పంచ్ ప్రతినిధి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దంతులూరి ప్రదీప్‌రాజు అన్నారు. జన్మభూమి.. మా ఊరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం డెంకాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలతో సత్తాచాటాలని సూచించారు. క్రీడలతో మానసిక,శారీరక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. మంగళవారం బాలురకు వాలీబాల్, బాలికలకు స్కిప్పింగ్, కేరమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను మండలస్థాయి పోటీలకు పంపిస్తామని వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ సభ్యుడు సీహెచ్.మహేశ్వరరావు, హెచ్.ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

తంగుడుబిల్లి(నెల్లిమర్ల), న్యూస్‌టుడే: గ్రామీణ యువతలో మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని మండల తెదేపా ఎస్సీసెల్ అధ్యక్షుడు పోతల రాజప్పన్న అన్నారు. మంగళవారం తంగుడుబిల్లి గ్రామంలో నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి చెందిన పట్నాయకుని నరసింహం, ఆర్.నారాయణరావు, వి. చిన్నప్పలనారాయణ, కురిమినేని అప్పలస్వామినాయుడులకు గుర్తింపుగా క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్. మోహన్‌రావు, పి. నారాయణరావు, సీహెచ్. నరేష్, యువత సమన్వయకర్త సీహెచ్. మన్మధరావు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి నైతిక విలువలు పాటించాలి

కొత్తపేట(నెల్లిమర్ల), న్యూస్‌టుడే: సమాజంలో విద్యార్థులంతా నైతిక విలువలను పాటించాలని నెల్లిమర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి. వెంకటరావు అన్నారు. మంగళవారం కొత్తపేట గ్రామంలో ఎన్ఎస్ఎస్ 1, 2 యూనిట్ల ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులంతా సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. అనంతరం కొత్తపేట, సువ్వానిపేట గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యాయామ అధ్యాపకుడు బొమ్మన రామారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎ. చంద్రశేఖర్‌రావు, ఆర్‌కే నిక్కి, కొత్తపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూరినాయుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రహదారులు ఇలా.. రాకపోకలు ఎలా!



భోగాపురం- అక్కివరంరహదారిలో దెబ్బతిన్న కల్వర్టు

నాణ్యతలోపాలతో కల్వర్టులు ఛిద్రం

రూ.లక్షలు వెచ్చించి వేస్తున్న రహదారులు కొద్దిరోజులకే పాడవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ పరిస్థితి నెలకొంటుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రహదారి నిర్మాణ పనులను అధికారులు పరిశీలించకపోవడంతో గుత్తేదారుల ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. భోగాపురం మండలంలో పలు రహదారులు, కల్వర్టుల నాణ్యతలోపంతో త్వరగా దెబ్బతింటున్నాయి. గూడెపువలస నుంచి మరడపాలెం మీదుగా కవులవాడకు వెళ్లే ర.భ.రహదారి, భోగాపురం నుంచి అక్కివరం మీదుగా చింతలవలసకు వెళ్లే రహదారి అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చించారు. కొద్ది రోజులకే అవి దెబ్బతిన్నాయి. ఉన్నతాధికారులు ఈ రహదారుల్లోనే వెళ్లి వస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో రహదారుల బాగు ఎవరికి పట్టక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. - న్యూస్‌టుడే, భోగాపురం



మరడపాలెం రహదారిలో కోతకు గురైన మదుము



కవులవాడ వద్ద ర.భ.రహదారిలో మదుము దుస్థితి

పార్వతీపురం

నేడు మహిళా రక్షక్‌పై అవగాహన

సీతానగరం, న్యూస్‌టుడే: మండలంలోని చెల్లంనాయుడువలస శ్రీనివాస పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం మహిళా రక్షక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు. మహిళల హక్కులతో పాటు మహిళా రక్షక్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

సామూహిక సీమంతాలు

సీతానగరం, న్యూస్‌టుడే: జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిడగల్లు, సుమిత్రాపురం, పెదంకలాం, పాపమ్మవలస గ్రామాల్లో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ పర్యవేక్షకుల ఆధ్వర్యంలో గ్రామ సర్పంచులు, మహిళలు గర్భిణులకు గంధం పూసి, వాయనాలు అందించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాదం కదిపి... ...నాట్యంలో మెరిసి...

- అటు చదువు, ఇటు శాస్త్రీయ నృత్యం
- ప్రతిభ చాటుతున్న పట్టణ బాలికలు

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం



విద్యావిధానంలో పోటీ పెరిగిపోయిన నేటిరోజుల్లో చాలామంది తల్లిదండ్రులు చదువు తప్ప ఇతర అంశాలను పట్టించుకోలేదు. మార్కులు, ర్యాంకులంటూ పిల్లలపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. కొంత మంది తల్లిదండ్రులు మాత్రం పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తున్నారు. చదువుతో పాటు ఇతర అంశాల్లో రాణించేలా చేస్తున్నారు. ఇందులో భాగంగానే పార్వతీపురం పట్టణంలో పలువురు చిన్నారులు శాస్త్రీయ నృత్యం నేర్చుకుంటూ ప్రతిభ చూపుతున్నారు. తమకిష్టమైన నాట్యంలో సత్తాచాటుతూ భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.

పార్వతీపురం పట్టణంలో ఇటీవల చదువుతో పాటు చిన్నారులకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు చొరవ చూపుతున్నారు. క్రీడలు, సంగీతం, ఈత, నాట్యం, ఇతర సాంస్కృతిక కళల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇందులో భాగంగానే కొంతమంది బాలికలు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ తీసుకుంటూ ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్నారు. అనతికాలంలోనే నృత్యంపై పట్టుసాధించి దుమ్మురేపుతున్నారు. ఫలితంగా క్రమశిక్షణ, శారీరక ఆరోగ్యం, చురుకుదనం సొంతం చేసుకుంటున్నారు. వేదిక భయాన్ని పోగొట్టుకుంటున్నారు. శాస్త్రీయ నృత్యం, జానపదం, కోలాటం వంటి అంశాలపై నైపుణ్యం సాధిస్తున్నారు. ఆయా బాలికల అభిప్రాయాలు వారి మాటల్లోనే.

పోటీతత్వం అలవడుతుంది



నా పేరు **ఎస్.హారిక.** మాది పార్వతీపురం పట్టణంలో పోలీసుస్టేషన్ వీధి. ఇంజినీరింగ్ చదువుతున్నాను. చిన్నతనం నుంచే మా అమ్మవద్దనే శాస్త్రీయ నృత్యంలో సాధన చేస్తున్నాను. ఇప్పటి వరకు అనేక ప్రదర్శనలు ఇచ్చాను. పలు బహుమతులు అందుకున్నాను. అందరి మన్ననలు అందుకున్నాను. నృత్యసాధనతో క్రమశిక్షణతో పాటు పోటీతత్వం అలవడుతుంది.

మంచి నాట్యకారిణిగా గుర్తింపే లక్ష్యం



నా పేరు **జి.షర్మిల.** మాది బెలగాంలోని గొడవీధి. ఆరో తరగతి చదువుతున్నాను. ఏడాదిన్నరగా నృత్య సాధన చేస్తున్నాను. దీంతో మంచి ఆరోగ్యాన్ని సొంతం చేసుకుంటున్నాను. దీంతో పాటు చురుకైన విద్యార్థినిగా గుర్తింపు తెచ్చుకున్నాను. భవిష్యత్తులో మంచి నాట్యకారిణిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే లక్ష్యం.

ఏడాది నుంచి సాధన



నా పేరు **నిహారిక.** మాది పార్వతీపురం పట్టణంలోని వైకేఎం కాలనీ. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్నా. ఏడాది నుంచి శాస్త్రీయ నృత్యంలో సాధన చేస్తున్నా. తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. నృత్యంలో మెలకువలు నేర్చుకుని పట్టుసాధించాను. ఇటీవల వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ప్రతిభ చూపాను.

బద్ధకం మాయం..



నా పేరు **ఎం.సుప్రజ.** మాది పార్వతీపురం పట్టణంలో బెలగాం ప్రాంతం. ఆరో తరగతి చదువుతున్నా. తల్లిదండ్రులు ప్రోత్సాహంతోనే శాస్త్రీయ నృత్యం నేర్చుకుంటున్నాను. నృత్య సాధనతో బద్ధకం మాయం అయ్యింది. రోజంతా ఉల్లాసంగా ఉండేందుకు నృత్యం ఎంతగానో దోహదపడుతుంది. భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలో రాణించేలా సాధన చేస్తున్నాను.

శారీరక ఆరోగ్యం..



మాది పార్వతీపురంలోని బైపాస్‌రోడ్డు ప్రాంతం. పేరు రెడ్డి మోనిష. నారాయణ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాను. రెండేళ్లుగా నృత్య సాధన చేస్తూ పలు ప్రదర్శనలు ఇచ్చాను. ఎన్నో బహుమతులు వచ్చాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో సాధన చేయడంతో శారీరక ఆరోగ్యానికి చక్కగా నృత్యం ఉప కరిస్తుంది. భవిష్యత్తులో రాష్ట్రస్థాయి ప్రదర్శనలు ఇవ్వగలననే నమ్మకముంది.

అక్క ఆదర్శం..



నా పేరు **జాహ్నవి.** మాది పార్వతీపురం. మా అక్క శాస్త్రీయ నృత్యంలో రాణిస్తోంది. దీంతో నాకూ ఆసక్తి పెరిగింది. తల్లిదండ్రుల ఇచ్చిన ప్రోత్సాహంతో నృత్యంలో శిక్షణ పొందాను. ఇప్పుడు పలు ప్రదర్శనలు ఇస్తున్నాను. తక్కువ కాలంలో ప్రతిభ చూపి బహుమతులు అందుకున్నాను. నృత్యంలో నాకంటూ గుర్తింపు తెచ్చుకున్నాను. భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలో ప్రదర్శనలు ఇవ్వాలనేదే నా లక్ష్యం.

నేడు జన్మభూమి గ్రామసభలు

బలిజిపేట, న్యూస్‌టుడే: మండలంలోని చిలకలపల్లి, నారాయణపురం, బలిజిపేట, పలగర గ్రామాల్లో బుధవారం జన్మభూమి మాఊరు గ్రామసభలు జరగనున్నాయని ఎంపీడీవో కె.ఎస్వేరురాణి తెలిపారు. ఈ గ్రామాల్లోని ప్రధాన సమస్యలపై ప్రజలు అధికారులకు వినతులందజేయాలన్నారు.

సీతానగరం, న్యూస్‌టుడే: జన్మభూమి మాఊరు గ్రామసభలు బుధవారం నాలుగు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పార్వతీశ్వరరావు తెలిపారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో సూరంపేట, గుచ్చిమి గ్రామాల్లో, తహసీల్దారు అప్పలరాజు ఆధ్వర్యంలో బూర్జ, కృష్ణరాయపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అవగాహనతోనే ఆరోగ్యం

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి అవగాహన పెంపొందించుకుంటే చక్కని ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చునని కౌమార విద్య కౌన్సిలర్ భారతి అన్నారు. మంగళవారం మండలంలోని కమిటిభద్ర కేజీబీవీ పాఠశాలలో కౌమార విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పౌష్టికాహారం, సెక్స్‌వల్ ఎడ్యుకేషన్, కౌమార దశలో మార్పులు, శారీరక ఆరోగ్య సాధనకు పాటించాల్సిన విధానాలపై అవగాహన పర్చారు.



అవగాహన పరుస్తున్న కౌన్సిలర్ భారతి

అక్షరాస్యతపై ర్యాలీ

బలిజిపేట, న్యూస్‌టుడే: గ్రామంలో సంపూర్ణ అక్షరాస్యత సాధనకు అందరూ కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు కోరారు. మంగళవారం ఆ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి తుమరాడలో అక్షరాస్యత ర్యాలీ చేశారు. 'అందరూ చదవాలి, అందరూ ఎదగాలి' అంటూ విద్యార్థులంతా నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.వి.గిరి, పి.వెంకటినాయుడు, సీహెచ్.తిరుపతిరావు, వై.దమయంతి, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఎంపీ పాఠశాల విద్యార్థులు

చంద్రన్న కానుకల పంపిణీ

నిడగల్లు(సీతానగరం), న్యూస్‌టుడే: జన్మభూమి మాఊరు గ్రామ సభ మంగళవారం నిడగల్లు గ్రామంలో తహసీల్దారు అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. శాఖల వారీగా ప్రగతిని వివరించడంతో పాటు గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సామాజిక పింఛన్లు పంపిణీకి దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. లబ్ధిదారుల వేలిముద్రలు నమోదు కాకపోవడంతో ఈసమస్య ఏర్పడుతుందని స్థానికులు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో ఉమామహేశ్వరనాయుడు, గ్రామ సర్పంచి గాజాపు మంగమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే ప్రాధాన్యం : ఎమ్మెల్యే

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల పేద, బడుగు వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే బి. చిరంజీవులు అన్నారు. మంగళవారం మండలంలోని కృష్ణపల్లిలో చంద్రన్న సంక్రాంతి కానుకలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల పండగ సంక్రాంతి అన్నివర్గాలు చక్కగా చేసుకోవాలని కోరారు. జన్మభూమి కార్యక్రమ ప్రతినిధులు ప్రసాదరావు, బలరామినాయుడు, రేషన్ డిపో డీలరు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నిడగల్లులో చంద్రన్న కానుకలు అందిస్తున్న తహసీల్దారు అప్పలరాజు

పట్టణంలో సినిమాలు

సౌందర్య: హలో, పద్మశ్రీ: కంట్రీస్, వేంకటేశ్వర కళామందిర్: ఎంసీఏ(మిడిల్‌క్లాస్ అబ్బాయి)

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

డిజిటల్ తరగతులు ప్రారంభం



తరగతులను ప్రారంభిస్తున్న సర్పంచి

సంగంవలస(పార్వతీపురం గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని సంగంవలస ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం డిజిటల్ తరగతులను స్థానిక సర్పంచి అమరాపు రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు త్రినాధరావు మాట్లాడుతూ విద్యాశాఖ(ఎస్ఆర్ఏ) విభాగంలో దీనికి రూ.లక్ష నిధులు మంజూరు చేసిందని, పాఠశాల నిధుల నుంచి మరో రూ.15 వేలు కలిపి తరగతులు సిద్ధం చేశామన్నారు.

విద్యార్థులకు కంచాలు వితరణ

పాఠశాలలో విద్యార్థులకు 110 భోజన కంచాలను విశ్రాంత ఉపాధ్యాయుడు పొడగట్లపల్లి చంద్రశేఖర్ అందించారు. ఇది మంచి కార్యమని, మరింత మంది పాఠశాల అభివృద్ధికి సహకరించాలని సర్పంచి రామకృష్ణ కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కోడి వెంకటనాయుడు, సహోద్యోగులు, మారుతి యువజన సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం

ధార పారలేదు...



మండల కేంద్రానికి శివారున ఉన్న గళావల్లి ఎస్సీకాలనీలో తాగునీరందిస్తున్న అంబేడ్కర్ జల జీవనధార పథకం 20 రోజులుగా పనిచేయడం లేదు. ఈ పథకానికి సాంకేతిక లోపాల కారణంగా సరఫరా నిలిచిపోయింది. ఈ పథకం పనిచేయనందున ఎస్సీకాలనీ వాసులంతా తాగునీటికి ఇబ్బందులెదుర్కొంటున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గళావల్లి(బలిజిపేట)

పేదరికం లేని సమాజ స్థాపనకు కృషి

‘జన్మభూమి-మాఊరు’ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ జగదీష్, ఎమ్మెల్యే చిరంజీవులు



పార్వతీపురంలో వైకాపా శ్రేణులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీ జగదీష్

బెలగాం, న్యూస్‌టుడే: పేదరికం లేని సమాజాన్ని తీసుకొచ్చేందుకు తెదేపా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్సీ జగదీష్, ఎమ్మెల్యే బి.చిరంజీవులు పేర్కొన్నారు. మంగళవారం పార్వతీపురం పురపాలక సంఘం 1, 2, 3, 28 వార్డుల్లో ‘జన్మభూమి-మాఊరు’ కార్యక్రమం నిర్వహించారు. ఒకటో వార్డులో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి శ్రమిస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో ఎమ్మెల్సీ జగదీష్ జన్మభూమి కార్యక్రమంపై ప్రమాణం చేయించారు. పురపాలిక కమిషనరు శ్రీనివాసరావు, ప్రత్యేకాధికారి ఆర్‌కేఎం రాజు, తెదేపా నాయకులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమా...రాజకీయం కోసమా: రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం ‘జన్మభూమి-మాఊరు’ కార్యక్రమం నిర్వహిస్తుంది తప్ప రాజకీయాలు చేసేందుకు కాదని వైకాపాను ఉద్దేశించి ఎమ్మెల్సీ డి.జగదీష్ అన్నారు. ఒకటో వార్డులో కార్యక్రమం జరుగుతుండగా వైకాపా నాయకులు కె.బాలకృష్ణ, ఎం.రవికుమార్, కార్యకర్తలు వేదిక వద్దకు వచ్చి గత జన్మభూమిలో ఇచ్చిన దరఖాస్తులు ‘బుగ్గిపాలు’ చేశారా అంటూ ప్రశ్నించారు. దీంతో జగదీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘ఏం తమాషా చేస్తున్నారా...గతంలో ఇచ్చిన దరఖాస్తులకు రసీదులు తీసుకోలేదా... ఈ వార్డులో రూ.45 లక్షల అభివృద్ధి పనులు జరిగిన విషయం తెలియదా’ అంటూ ప్రశ్నించారు. వైకాపా రాజకీయం చేయాలనుకుంటే ఇది వేదిక కాదన్నారు. సమస్యలపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు.

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని సాంకేతిక అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి ప్రణాళికతో తీసుకెళుతున్నారని ఎమ్మెల్సీ జగదీష్ అన్నారు. మంగళవారం మండలంలో జన్మభూమి కార్యక్రమాలను ఎమ్మెల్యే బి.చిరంజీవులుతో కలిసి ప్రారంభిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1100 నంబరు ప్రతీపల్లెలో ప్రతి వ్యక్తికి తెలిసిందని, దీని ఘనత సీఎందేనన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రన్న బీమాతో పేద కుటుంబాలను ఆదుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు తెదేపా ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అడ్డాపుశీలలో జన్మభూమి కార్యక్రమం ఆరంభంలో ఎంపీపీ హరిప్రియా థాట్రాజ్ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. గోపాలపురంలో తహసీల్దార్ అజురఫీజాన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామమందిరంపై సర్పంచి పెండ చిన్నమ్మలు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో వినతులు స్వీకరించారు.



అడ్డాపుశీలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

తుమరాడ, వెంగాపురం(బలిజిపేట), న్యూస్‌టుడే: నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు వర్తింపజేసేందుకు కృషి చేయాలని వైకాపా నాయకుడు అలజంగి జోగారావు కోరారు. వెంగాపురం, తుమరాడ గ్రామాల్లో ఎంపీపీ పెంకి పార్వతి అధ్యక్షతన మంగళవారం ‘జన్మభూమి - మాఊరు’ గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా వెంగాపురం గ్రామసభలో వైకాపా నాయకుడు వివిధ సంక్షేమ పథకాలు అర్హులకు అందడంలేదని, వీటి మంజూరులో అర్హులైన నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీపీ పార్వతి, జడ్పీటీసీ సభ్యురాలు మండల రాధ, అధికారులను కోరారు. తుమరాడ సభలో అర్హులకు మంజూరైన వివిధ సంక్షేమ పథకాల చెక్కులు, మంజూరు పత్రాలు, చంద్రన్న సంక్రాంతి సరకులను ఎంపీపీ చేతులమీదుగా అందజేశారు. తుమరాడ గ్రామసభలో ఎంపీడీవో కె.ఎస్తేరురాణి, సర్పంచి బొంగు సూర్యనారాయణ, ఇతర అధికారులు, వెంగాపురం గ్రామసభలో జడ్పీటీసీ సభ్యురాలు మండల రాధ, తహసీల్దారు బీవీలక్ష్మి, ఈవోపీఆర్డీ దేవకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బర్లి(బలిజిపేట గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలో బర్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం తహసీల్దారు బి.వి.లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన జన్మభూమి మాఊరు గ్రామసభలో వివిధ సమస్యలపై ప్రజలు అధికారులను నిలదీశారు. పట్టాదారు పుస్తకాలు ఆన్‌లైన్ చేసుకునేందుకు ఏడాది క్రితం మీ సేవలో దరఖాస్తు చేసుకున్నా ఆన్‌లైన్ కాకపోవడానికి కారణమేమిటని ప్రశ్నించారు. వివిధ సమస్యలపై అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు మండల రాధ, సర్పంచి పాలూరు సరస్వతి, ఎంపీటీసీ సభ్యుడు పాలూరు నారాయణరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వెంగాపురం సభలో ఎంపీపీ పార్వతికి సమస్యలు విన్నవిస్తున్న వైకాపా నాయకుడు జోగారావు

స్పందన అంతంతే..

సుమిత్రాపురం(సీతానగరం), న్యూస్‌టుడే: ఎంపీడీవో పార్వతీశ్వరరావు ఆధ్వర్యంలో సుమిత్రాపురం, పెదంకలాం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. జన్మభూమి ప్రతిజ్ఞ, ముఖ్యమంత్రి సందేశం, శాఖల వారీగా ప్రగతికే పరిమితమైంది. రేషన్‌కార్డులు, సామాజిక పింఛన్లు కొత్తగా మంజూరు చేయకపోవడంతో స్థానికులు సభలకు హాజరయ్యేందుకు పెద్దగా ఆసక్తిని చూపలేదు.



సుమిత్రాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పారదర్శకత పాటించాలి

సీతానగరం, న్యూస్‌టుడే: జన్మభూమి మాఊరు గ్రామ సభలు పారదర్శకంగా నిర్వహించాలని పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల జోనల్ అధికారి కె.సాంబశివరావు కోరారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటి రోజు గ్రామసభలు జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామసభలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మండలాలకు కళాజాత బృందాలను పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్వతీపురం ఆర్డీవో బి.సుదర్శనదొర, మండల ప్రత్యేకాధికారి రామచంద్రరావు, ఎంపీడీవో పార్వతీశ్వరరావు, తహసీల్దారు అప్పలరాజు, ఏవో ఉమామహేశ్వరనాయుడు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న జోనల్ అధికారి సాంబశివరావు

విద్యుత్తు బిల్లుల వసూలు చేసే ప్రాంతాలివే

బలిజిపేట: మిర్తివలస, తుమరాడ. సీతానగరం: అప్పయ్యపేట సబ్‌స్టేషన్. పార్వతీపురం గ్రామీణం: పెదమరికి. – న్యూస్‌టుడే, బలిజిపేట.



ముత్యాల ముగ్గులు..

‘జన్మభూమి మాఊరు’ కార్యక్రమం సందర్భంగా వెంగాపురం ఎంపీ పాఠశాల విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని తరగతులకు చెందిన విద్యార్థినులు పాఠశాల మైదానంలో వివిధ రంగులతో ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో అయిదో తరగతికి చెందిన కె.ప్రసన్న ప్రథమ, నాలుగో తరగతికి చెందిన బి.సంధ్యన ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.అప్పలస్వామి, ఉపాధ్యాయులు బహుమతులందజేశారు. – న్యూస్‌టుడే, వెంగాపురం(బలిజిపేట)

లీకులు.. బాధలు...



పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడి ఆలయం వీధిలో పైలెట్ ప్రాజెక్టు పనులు అర్థాంతరంగా వదిలేశారు. దీంతో పైపుల నుంచి లీకైన నీరు నిలిచి, వీధి బురదగా మారుతోంది. దీనివల్ల రాత్రిపూట దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పరిస్థితి చెబుతామంటే ప్రాజెక్టు అధికారులు, పనివారు కనిపించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిన్నయ్య వద్ద ప్రస్తావించగా పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, తాళ్లబురిడి (పార్వతీపురం గ్రామీణం)

సేవాభావం కొనసాగించాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ రామలక్ష్మి

గాదెలవలస/జానుమల్లువలస(సీతానగరం), న్యూస్‌టుడే: ప్రత్యేక శిబిరంలో నిర్వహించిన సేవాభావం కొనసాగించాలని మాజీ ఎంపీపీ బి.రామలక్ష్మి అన్నారు. మంగళవారం గాదెలవలసలో బొబ్బిలి ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో వలంటీర్లు వారం రోజులు పాటు పలు సేవా కార్యక్రమాలు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ బి.అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చింతాడ ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.మల్లినాయుడు, గాదెలవలస గ్రామ సర్పంచి చుక్క సింహాచలం, అధికారులు రామకృష్ణ, సత్యనారాయణ, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతు బజారు సమాచారం

పార్వతీపురం రైతు బజారులో మంగళవారం సాయంత్రానికి కూరగాయల ధరలు(కిలో రూ.ల్లో) టమోటా-12, వంకాయలు-24, బెండకాయలు-34 దొండకాయలు-26, బీరకాయలు-25, చిక్కుడు కాయలు-30, అల్లం-36, పచ్చిమిర్చి-30, బంగాళదుంపలు-12, ఉల్లి-36, కాకర-25, వెల్లుల్లి-36, క్యారెట్-36, బీట్‌రూటు-34, అరటికాయ-5(ఒక్కటి), బుట్ట-22, ఆనపకాయ-12

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

వంటగ్యాస్ సరఫరా చేసే గ్రామాలివే:

బలిజిపేట:వెంగాపురం, బర్లి, మిర్తివలస, పణుకువలస, సుభద్ర, శివరాంపురం, బలిజిపేట, తుమరాడ, అజ్జాడ, చాకరాపల్లి. సీతానగరం:తామరకండి, బళ్లకృష్ణాపురం, బగ్గందొరవలస, గెడ్డలుప్పి, కొత్తవలస, రెడ్డివానివలస, రామవరం, ఆర్.వెంకంపేట. పార్వతీపురం గ్రామీణం:నర్సిపురం, పులిగుమ్మి, బందలుప్పి, ఎమ్మానగర్, కృష్ణాపురం బెలగాం: పార్వతీపురం పట్టణంలో జగన్నాథపురం, పాత బస్టాండు, రాయిగఢ్ మార్గంలో 442 సిలిండర్లు పంపిణీ చేస్తారు.

– న్యూస్‌టుడే, బలిజిపేట.

విద్యార్థులకు బహుమతులు

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరు మండలంలో ఓడీఎఫ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల పేర్లతో లాటరీ తీసి విజేతలకు మండల విద్యాశాఖ అధికారి గణపతి బహుమతులు అందజేశారు. శివరాంపురానికి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కిలపర్తి హేమలతకు సైకిల్ బహుమతిగా రాగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్రి ప్రసాదరావుకు అందజేశారు. పెద బోరబంద పాఠశాల విద్యార్థిని బోనెల రామలక్ష్మి, దీసరి హేమంత్‌లకు బహుమతులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అందజేశారు.

సాలూరు

సామూహిక సీమంతాలు

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరు పట్టణ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం మూడు వార్డులలో గర్భిణులకు సామూహిక సీమంత కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘ అధ్యక్షురాలు విజయకుమారి హాజరై మాట్లాడుతూ ఆసుపత్రుల్లో ప్రసవానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఎం.నాయుడు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి రమాదేవి, పలువురు వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బడుగు వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్సీ



లోతుగెడ్డలో జరిగిన జన్మభూమి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జగదీష్

లోతుగెడ్డ/ఆంద్ర/కుంటినవలస/పెదచామలాపల్లి (మెంటాడ), న్యూస్‌టుడే: పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. మంగళవారం మండలంలోని లోతుగెడ్డ గ్రామంలో జరిగిన జన్మభూమి-మాఊరు గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ తెదేపా ప్రభుత్వం అమలుచేస్తుందన్నారు. సామాజిక భద్రతా పింఛన్లు అయిదు రెట్లు పెంచిందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా చంద్రన్న బీమా పథకాన్ని ప్రవేశపెట్టి అసంఘటిత రంగ కార్మికుల కుటుంబాల్లో వెలుగు నింపిన ప్రభుత్వం తెదేపా అన్నారు. పెదచామలాపల్లిలో జరిగిన జన్మభూమి గ్రామసభలో ఆ గ్రామ ఉప సర్పంచి సత్యం మాట్లాడుతూ 51 మరుగుదొడ్లకు దరఖాస్తు చేయగా వాటిలో 16 మరుగుదొడ్లకే అనుమతులు మంజూరు చేయడంలో అంతర్యమేమిటని అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు ఎస్. కృష్ణమూర్తి, కె. చంద్రావతి, సింహాచలం, రాయి ఆదమ్మలు అధ్యక్షత వహించారు.

కవిరిపల్లి, కాశీపట్నం,(మక్కువ), న్యూస్‌టుడే: ప్రజలకు సమస్యలు లేకుండా చేయడమే జన్మభూమి లక్ష్యమని జన్మభూమి కమిటీ మండల అధ్యక్షులు పెంట తిరుపతిరావు అన్నారు. మంగళవారం మక్కువ మండలంలోని కవిరిపల్లి, కాశీపట్నం గ్రామాల్లో జన్మభూమి-మా ఊరు గ్రామసభలు నిర్వహించారు. కవిరిపల్లి గ్రామంలో సర్పంచి జన్ని ఆదిలక్ష్మి అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ద్వారా వచ్చిన వినతులు పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఎంపీడీవో జి.రామారావుతో కలిసి వినతులు స్వీకరించారు. కాశీపట్నం గ్రామంలో సర్పంచి కోట్ల నారాయణరావు అధ్యక్షతన తహసీల్దారు కె.వి.రామారావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. మక్కువ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. రెండు పంచాయతీల్లో రేషన్ కార్డులు 40 పంపిణీ చేశారు. రేషన్ కార్డులు, పింఛను, ఇళ్ల కోసం 97 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో ఉపతహసీల్దారు చంద్రమౌళి, ఈవోపీఆర్‌డీ కె.సూర్యనారాయణ, ఏపీవో కె.శ్రీనివాసరావు, మావుడి ప్రసాదనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న తిరుపతిరావు

అధికారులను నిలదీత

పి.కోనవలస/కర్రివలస(పాచిపెంట), న్యూస్‌టుడే: మండలం పి.కోనవలస, కర్రివలస, గ్రామ సభల్లో పలు సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు అధికారులను నిలదీశారు. ఆయా గ్రామాల్లో మంగళవారం 'జన్మభూమి-మా ఊరు' గ్రామ సభలు జరిగాయి. పి.కోనవలస సభకు జన్మభూమి ప్రత్యేక అధికారిణి కె.సావిత్రి హాజరు కాగా కర్రివలస సభకు మండల ప్రత్యేక అధికారి పిఎస్వీ.లక్ష్మీనారాయణ హాజరయ్యారు. పి.కోనవలసలో సభకు అధికారులు గంట ఆలస్యంగా వచ్చారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని పైలెట్ ప్రోజెక్టు ద్వారా నీరు సక్రమంగా అందడం లేదని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామం నుంచి శ్మశానవాటిక రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైన రెవెన్యూ అధికారులు సర్వే చేయడంలో జాప్యం చేస్తున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. పలువురు లబ్ధిదారులకు రేషన్‌కార్డుల ద్వారా బియ్యం సక్రమంగా అందడంలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొండపేటలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసినా.. తీగలు అమర్చలేదని మహిళలు తెలిపారు. శ్రీలక్ష్మీ మహిళా సంఘానికి పసుపు కుంకుమ ప్రోత్సాహం బ్యాంకు ఖాతాలో జమ కాలేదని మహిళలు ఆరోపించారు. పంచాయతీలో 12 మంది రైతులకు నాలుగో విడత రుణ ఉపశమన పత్రాలను సాలూరు ఏఎంసీ అధ్యక్షుడు పి.ఈశ్వరరావు చేతుల మీదుగా అందచేశారు. పి.కోనవలస గ్రామ సభకు సర్పంచి గునాన పార్వతి అధ్యక్షత వహించగా ఎంపీడీవో పీఎస్.శ్రీనువాసరావు పలుశాఖల అధికారులు హాజరయ్యారు. పనుకువలస గ్రామ సభ సర్పంచి ఆత్మకూరి సరోజిని అధ్యక్షతన జరగగా పింఛన్లు మంజూరు చేయాలని వినతులు అందాయి. కర్రివలస గ్రామ సభ సర్పంచి ఇంద్రింగి లచ్చమ్మ అధ్యక్షతన జరగగా పలువురు రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు కోరుతూ వినతులు అందచేశారు. గ్రామ కూడలి నుంచి రామమందిరం వరకు సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు. గ్రామసభల్లో ఐసీడీఎస్ కార్యకర్తలు పౌష్టికాహార నమూనా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. గ్రామ సభకు తహసీల్దార్ ఎంవీకె.ఎస్.రవి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాచిపెంట సభలో సొమ్మసిల్లిన గర్భిణి

పి.కోనవలస(పాచిపెంట), న్యూస్‌టుడే: మండలంలో పి.కోనవలస, పనుకువలస, కర్రివలస గ్రామాల్లో మంగళవారం 'జన్మభూమి-మా ఊరు' గ్రామ సభలు నిర్వహించారు. సభల్లో భాగంగా అంగన్‌వాడీ శాఖ తరపున గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. పి.కోనవలసలో ఈ కార్యక్రమానికి వచ్చిన పనసలపాడు గ్రామంకు చెందిన గిరిజన గర్భిణీ మాదల గౌరి సొమ్మసిల్లి పడిపోయింది. సభకు హాజరైన పాచిపెంట పీహెచ్‌సీ వైద్యురాలు పివి.లక్ష్మీ ఆమెకు సకాలంలో వైద్యం అందించడంతో సాధారణ స్థితికి వచ్చింది. నీరసం వల్లే గౌరి సొమ్మసిల్లినట్లు వైద్యురాలు తెలిపారు.

నేడు గ్రామ సభలు

పాచిపెంట, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం 'జన్మభూమి-మా ఊరు' గ్రామ సభలు విశ్వనాధపురం, మిర్తివలస గ్రామాల్లో ఎంపీడీవో పీఎస్.శ్రీనువాసరావు ఆధ్వర్యంలో, నందేడవలస, కేరంగి గ్రామ సభలు నందేడవలస వారపు సంతల్లో నిర్వహిస్తామని తహసీల్దారు ఎంవీకెఎస్. రవి తెలిపారు.

స్వచ్ఛ సాలూరుగా ఖ్యాతి నింపాలి

సాలూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛ సాలూరుగా ఖ్యాతి పెరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని పురపాలక సంఘ అధ్యక్షురాలు గొర్లె విజయకుమారి కోరారు. మంగళవారం 1, 2 వార్డులు మెంటాడవీధిలో కోదండరామ కల్యాణ మండప సమీపంలోను, 3వ వార్డు గుమడాంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఇంటినుంచి చెత్త రోడ్డుపై పారబోయకుండా తడి, పొడిచెత్త వేర్వేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై వివరించారు. ప్రభుత్వం అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తుందన్నారు. గుమడాంలో పురపాలక ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతుకు గురైందని, నూతన భవనాలు నిర్మించాల్సి ఉన్నా జాప్యం చేస్తున్నారని పలువురు ప్రశ్నించగా దీనికి పురపాలక అధ్యక్షురాలు మాట్లాడుతూ భవన నిర్మాణం కోసం టెండర్లు పూర్తయ్యాయని ఆరు నెలల్లో భవనం నిర్మించి ప్రారంభిస్తామని చెప్పారు. కొందరు అంత్యోదయ అన్నయోజన కార్డులు, పింఛన్ల మంజూరు కోసం కోరారు. కౌన్సిలర్లు పప్పల సత్యవతి, వెంకటలక్ష్మి, నాగరత్నం, వాడాడ శోభారాణి, జన్మభూమి కమిటీ సభ్యులు నిమ్మాది తిరుపతిరావు, గొర్లె మాధవరావు, పలు శాఖల పాల్గొన్నారు.



పి.కోనవలస సభలో పాల్గొన్న ఏఎంసీ అధ్యక్షుడు ఈశ్వరరావు

అవగాహన ర్యాలీ

సాలూరు, న్యూస్‌టుడే: జన్మభూమి మా ఊరు కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జన్మభూమి ముఖ్య ఉద్దేశం వివరించారు. ముందుగా కళాశాలలో విద్యార్థులతో జాతీయ సేవాపథకం సమన్వయకర్త సత్యనారాయణ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

గ్యాస్ సమాచారం

మెంటాడ, న్యూస్‌టుడే: మండలంలోని మెంటాడ గ్రామస్థులకు మెంటాడ లక్ష్మీనారాయణ హెచ్‌పీ గ్యాస్ గ్రామీణ విత్రక్ ద్వారా సోమవారం గ్యాస్ సిలెండర్లు సరఫరా చేస్తారు. ఈ గ్యాస్ ఏజెన్సీ నుంచి ఏదైనా సమాచారం, గ్యాస్ బుకింగ్ తదితర విషయాలకు 08965 286866, 7286916108 ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు. గత నెల 27 నుంచి ఈ నెల రెండు వరకూ గ్యాస్ కోసం ఆన్‌లైన్లో పేర్లు నమోదు చేసుకున్న మండలంలోని రాబంద, మీసాలపేట, కొంపంగి, ఇద్దనవలస, చల్లపేట, కంటుభుక్తవలస, కైలాం, అమరాయవలస, బిరసాడవలస, జయతి, చాకివలస, చింతాడవలస, ఇప్పలవలస, కొండలింగాలవలస తదితర గ్రామాల వారికి గజపతినగరం శ్రీ శ్రీనివాసా గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం గ్యాస్ సిలెండర్లు సరఫరా చేస్తారు. గ్యాస్ ఏజెన్సీ నుంచి ఏదైనా సమాచారం కోసం ఫోన్ నంబర్లు 08965 285288, 9347055802కు, గ్యాస్ బుకింగ్ కోసం ప్రత్యేక నంబరు 9666023456కు ఫోన్ చేయాలని నిర్వాహకులు చెప్పారు.

చంద్రన్న సంచార చికిత్స సమాచారం

మెంటాడ, న్యూస్‌టుడే: మండలంలోని మెంటాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆంద్ర, జగన్నాథపురం గ్రామాల్లో బుధవారం చంద్రన్న సంచార చికిత్స వాహనం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులతో ఉచితంగా వైద్య సేవలు అందిస్తారు.

ఘన సత్కారం

మెంటాడ, న్యూస్‌టుడే: మండలంలోని మెంటాడ గ్రామానికి చెందిన విశ్రాంత సైనికుడు గొరజాన అప్పలనాయుడును అతని స్నేహితులు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన అప్పలనాయుడు సుమారు 16 ఏళ్ల పాటు భారత సైనిక దళంలో విధులు నిర్వహించి, మంగళవారం సాయంత్రం గ్రామానికి వచ్చిన నేపథ్యంలో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గంద్రేటి అప్పలనాయుడు మాట్లాడుతూ దేశ ప్రజలంతా స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే అదంతా సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న రక్షణ దళం చలువేనన్నారు. అప్పలనాయుడు విధి నిర్వహణలో చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డి.కృష్ణమూర్తిరాజు, విశ్రాంత సైనికుడు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత సైనికున్ని సత్కరించిన స్నేహితులు, గ్రామస్థులు, బంధువులు

ఎమ్మెల్సీ/ ఎమ్మెల్యే డైరీ

- శాసన మండలి సభ్యురాలు బుధవారం సాలూరులో ప్రజలకు అందుబాటులో ఉంటారు.
- ఎమ్మెల్యే రాజన్నదొర బుధవారం సాలూరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారు.

యోగాతోనే మానసిక ప్రశాంతత

బొబ్బిలి, న్యూస్‌టుడే: యోగాతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని పురపాలక అధ్యక్షురాలు తూముల అచ్యుతవల్లి అన్నారు. మంగళవారం స్థానిక సరస్వతి శిశుమందిరంలో అఖిల భారతీయ విద్యాకేంద్రం ఆధ్వర్యంలో యోగా శిక్షణా తరగతులు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యోగాతోనే మానసిక ఆరోగ్యం ఉంటుందన్నారు. కేంద్రం రాష్ట్ర కార్యదర్శి క్రాంతి హనుమంతురావు మాట్లాడుతూ యోగాతోనే మానసిక పరిపక్వత ఉంటుందన్నారు. సరస్వతి శిశుమందిరం కార్యదర్శి పెంట స్వామినాయుడు, సమన్వయకర్త రామారావు, సంయుక్త కార్యదర్శి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రమ్ము సీడర్‌తో నాట్లు వేస్తే మేలు

మెంటాడ, న్యూస్‌టుడే: రబీకాలంలో వేసే వరిని డ్రమ్ముసీడర్‌తో నాట్లు వేయడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఎల్.రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని మెంటాడ గ్రామంలో లగుడు కృష్ణ వ్యవసాయ క్షేత్రంలో డ్రమ్ము సీడర్‌తో వరినాట్లు వేసే విధానంపై గ్రామానికి చెందిన పలువురు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన పొడిపిరెడ్డి వెంకటరమణతో పాటు పలువురు రైతులు, ఎంపీఈవో అప్పలనాయుడు, ఎన్ఎఫ్ఎఫ్ శివ, సీఆర్‌పీ చిన్నంనాయుడు, అప్పారావు పాల్గొన్నారు.



రైతుకు అవగాహన కల్పిస్తున్న ఏవో

సాలూరు

నేడు దీపోత్సవం

మెంటాడ, న్యూస్‌టుడే: మండలంలోని మెంటాడలోని కల్యాణ వెంకటేశ్వర ఆలయంలో బుధవారం రాత్రి ఆరు గంటలకు ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకులు పీసపాటి కృష్ణమాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

రెండిళ్లు దగ్ధం

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరు పట్టణం దండిగాం రోడ్డులో సోమవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణంగా రెండిళ్లు దగ్ధమయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లింది. సింహాద్రి గోవిందమ్మ, లక్కోజు లక్ష్మీకాంతమ్మలకు చెందిన ఇళ్లు దగ్ధం కాగా ఇంట్లో వస్తువులు, బట్టలు కాలిపోయాయి. లక్ష్మీకాంతమ్మ ఇంట్లో రూ.10 వేల నగదు, గోవిందమ్మ ఇంట్లో రూ.6 వేల నగదు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.


పరిశుభ్రతా పనుల్లో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

అధికారుల స్వచ్ఛతే సేవ

సాలూరు: సాలూరు ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద మంగళవారం స్వచ్ఛతే సేవ కార్యక్రమం నిర్వహించారు. కాంప్లెక్సు పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. విజయనగరం నుంచి ఆర్టీసీ చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ రామారావు హాజరయ్యారు. ఆయన ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శ్రమదానం చేశారు.

సేవలు కొనసాగించాలి


విద్యార్థులకు కంచాలు పంపిణీ చేస్తున్న సుబ్రహ్మణ్యం

సాలూరు, న్యూస్‌టుడే: జాతీయ సేవాపథకం కింద వారం రోజుల పాటు విద్యార్థులు బంగారమ్మపేట, బొడ్డవలసలలో చేసిన సేవలు ఇకపై కూడా కొనసాగించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.సుబ్రహ్మణ్యం కోరారు. మంగళవారం జాతీయసేవా పథకం శిబిరాల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక సేవల ద్వారా ఆత్మసంతృప్తి పొందవచ్చని, పేరు, ఖ్యాతి కోసం కాకుండా పలువురికి సాయపడాలన్న సామాజిక స్పృహతో సేవలు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి వారివారి గ్రామాలలో యువతను చైతన్యపరిచి సేవలందిస్తే గ్రామాలు ప్రగతి సాధిస్తాయని తెలిపారు. జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా బొడ్డవలస పురపాలక సంఘ విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి ఉపకరించే కంచాలు, గ్లాసులు పంపిణీ చేశారు. పథకం సమన్వయకర్తలు మోహనరావు, తిరుపతిరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నీతికథలు చదవాలి

సాలూరు, న్యూస్‌టుడే: రోజు రోజుకు సామాజిక మాధ్యమాల ప్రభావం, చరవాణి, టెలివిజన్‌ల మూలంగా విద్యార్థులు నైతిక విలువలను కోల్పోతున్నారు.. ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలతో పాటు నీతికథలు, విజ్ఞానం పెంపొందించే కథలు చదవాలని వికాస తరంగిణి ప్రతినిధి తెలగాంశెట్టి విశ్వనాథం సూచించారు. సాలూరు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో మంగళవారం సాయంత్రం ప్రజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. గురువులు, తల్లిదండ్రులను గౌరవించడం, పెద్దలు, మహిళల పట్ల ఏవిధంగా ఉండాలి అన్న అంశాలు వివరించారు. నైతిక విలువలు పెంపొందించుకునేందుకు ఉపకరించే నీతికథలు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజ్ఞ కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్వనాథం

ఎన్నిసార్లు చెప్పినా ఏం లాభం

కరివలస(పాచిపెంట), న్యూస్‌టుడే: మండలం కరివలస గ్రామ రహదారితో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం గ్రామంలో నిర్వహించిన 'జన్మభూమి మా ఊరు' గ్రామ సభకు వచ్చిన అధికారుల బృందానికి గ్రామ రహదారి తీరుపై గ్రామస్థులు ఏకరువుపెట్టారు. గ్రామం నుంచి గుమ్మిడిగుడ్డి బస్సు నిలిచే కూడలి వరకు ఏర్పాటు చేసిన రహదారి హుద్‌హుద్ తుఫాన్ సమయంలో కొండవాగు ప్రవాహంతో భారీగా కోతకు గురైంది. గ్రామంలో ఇప్పటి వరకు నిర్వహించిన గ్రామ సభలకు వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ రోడ్డు మరమ్మతుల విషయంలో వినతులు అందచేసినా ఫలితం దక్కలేదని గ్రామస్థులు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


కోతకుగురైన గ్రామ రహదారి

సంకరజాతి పాడి పశువుల పెంపకంతో మంచి లాభాలు

పెదమేడపల్లి(మెంటాడ), న్యూస్‌టుడే: పాడి రైతులు సంకరజాతి పాడిపశువుల పెంపకంపై దృష్టి పెడితే మంచి లాభాలను ఆర్జించవచ్చని విశాఖ డెయిరీ పర్యవేక్షకులు మధుసూదనరావు అన్నారు. మంగళవారం మండలంలోని పెదమేడపల్లి గ్రామం పరిధిలోని రెండు పాలసేకరణ కేంద్రాల్లోని పాడి రైతులకు సంక్రాంతి నగదు బహుమతి పంపిణీ చేసే కార్యక్రమానికి హాజరైన ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. నేటికీ చాలా మంది పాడి రైతులు దేశవాళీ ఆవుల పెంపకం చేపడుతున్నారని, తద్వారా వారికి పెంపకం మంచి వచ్చే ప్రతిఫలం కన్నా, వ్యయమే ఎక్కువవుతుందని అన్నారు. అదే మేలైన సంకరజాతి పాడి పశుపోషణ చేపట్టినట్లయితే అదే ఖర్చుతో మంచి పాల దిగుబడి సాధించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా రెండు పాల సేకరణ కేంద్రాల పరిధిలోని 136 మంది రైతులకు మంజూరైన నగదు బహుమతి డబ్బు రూ.3,25,000 అందజేశారు. కార్యక్రమంలో వేతన కార్యదర్శులు బి.గౌరినాయుడు, రెడ్డి రమేష్‌తో పాటు గ్రామానికి చెందిన పాడి రైతులు పాల్గొన్నారు.


పాడిరైతులకు నగదు అందజేస్తున్న మధుసూదనరావు


మహిళలతో మాట్లాడుతున్న లక్ష్మణరావు

ఓడీఎఫ్‌పై పరిశీలన

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరు పట్టణంలో ఓడీఎఫ్‌పై దిల్లీనుంచి వచ్చిన క్వాలిటీ కంట్రోల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధి లక్ష్మణరావు మంగళవారం సర్వే నిర్వహించారు. ముందుగా పట్టణంలో సులభ్ కాంప్లెక్సులను పరిశీలించారు. ప్రజలు ఏవిధంగా వినియోగించుకుంటున్నారు.. నీటివసతి, విద్యుత్తు దీపాల ఏర్పాటు, పరిశుభ్రత పరిశీలించారు. స్థానిక మహిళలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని పలు వీధులలో పర్యటించారు. గతంలో ఓడీఎఫ్ సర్వేలో సాలూరు పురపాలక సంఘానికి ఓడీఎఫ్ పట్టణంగా గుర్తింపు వచ్చింది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి సర్వే చేసి నివేదిక ప్రభుత్వానికి పంపిస్తారని, దాని ఆధారంగా ప్రభుత్వం ఓడీఎఫ్ పట్టణం అవునా కాదా గుర్తిస్తుందని కమిషనర్ ఎం.ఎం.నాయుడు తెలిపారు. ఈ మేరకు లక్ష్మణరావు పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పలస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సాలూరు మండల ప్రత్యేకాధికారి, పట్టణ పేదరిక నిర్మూలన పథక సంచాలకులు ఎన్.లక్ష్మణనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని పారన్నవలస, పురోహితునివలస గ్రామాలలో జన్మభూమి గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అర్హులైన వారందరికి సంక్షేమ పథకాల నమోదుతో పాటు వాటిని వర్తింపజేసేట్టు కృషి చేస్తున్నామన్నారు. కొత్తగా పింఛన్లు, రేషన్‌కార్డులు కావాలనుకునేవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వడ్డీలేని రుణాలు మంజూరయిన వారికి పత్రాలను ఈ సందర్భంగా అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పేడాడ జనార్దనరావు, ఉప తహసీల్దార్ కృష్ణంరాజు, ఈఓపీఆర్డీ సాల్మన్‌రాజ్, ఏఓ వెంకటయ్య పాల్గొన్నారు. పారన్నవలస గ్రామంలో జరిగిన గ్రామసభలో ఎంపీపీ బోను ఈశ్వరమ్మ పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందరికీ వర్తింపజేస్తామన్నారు.


పత్రాలు అందిస్తున్న ప్రత్యేకాధికారి లక్ష్మణనాయుడు

అనంతరం చంద్రన్న కానుకలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామప్పు, ఏపీఓ లక్ష్మీపతిరాజు, సాక్షర భారత్ సమన్వయకర్త శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ చొక్కాపు త్రినాథ, తెదేపా నాయకులు చోడవరపు గోవిందు పాల్గొన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలలో నాణ్యత లేకపోవడంపై స్థానిక మహిళలు అధికారులను నిలదీశారు.

తెరపై ఈనాడు

శ్రీరామ: ఎస్పీవై లక్ష్మి: ఒక్క క్షణం శ్రీలక్ష్మి: 2 కంట్రీస్ వెంకటేశ్వర డీలక్స్: హలో!

విద్యుత్తు బిల్లుల స్వీకరణ

మక్కువ, న్యూస్‌టుడే: మక్కువ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని మక్కువలో బుధవారం విద్యుత్తు బిల్లులు వసూలు చేసే సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉంటారు.

మెంటాడ, న్యూస్‌టుడే: మండలంలోని ఇద్దనవలస విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో విద్యుత్తు బిల్లులు వసూలు చేసే బిల్లు కలెక్టర్లు బుధవారం కుంటినవలస గ్రామంలో వినియోగదారులకు అందుబాటులో ఉంటారు.

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు బిల్లులు స్వీకరించే బిల్లు కలెక్టర్ బుధవారం మండలంలోని సారిక, నేరేళ్లవలస గ్రామాలలో వినియోగదారులకు అందుబాటులో ఉంటారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రాజన్నదొర

గిరిజన గ్రామాల కీర్తిని చాటాలి

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల కీర్తిని నలుదిశలా చాటేలా యువత ప్రతిభా పాటవాలు చూపాలని ఎమ్మెల్యే రాజన్నదొర అన్నారు. మండలంలోని దత్తివలస గ్రామంలో మూడు రోజులుగా ఒంటి సింహాచలం జ్ఞాపకార్థం జరుగుతున్న వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గిరిజన యువత అన్ని రంగాల్లో ముందంజ వేయాలన్నారు. సాలూరు కీర్తిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో చాటేందుకు శ్రమించాలన్నారు. ఈ పోటీలలో విజేతగా తాడిలోవ బృందం, రన్నర్‌గా తాడంగివలస బృందం నిలిచింది. విజేతలకు ఎమ్మెల్యే బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ఎస్‌ఐ గణేష్, సర్పంచి సురేష్, కరాసువలస నాయకులు ప్రసాద్, వివేకానంద యువజన సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మరుగుదొడ్డి కూలిపోయింది

ఈ చిత్రం చూడండి.. మండలంలోని పురోహితునివలస గ్రామంలోని నకల రమణమ్మకు చెందిన ఇల్లు ఇది.. ఇంటిముందు కుప్పకూలిపోయిన మరుగుదొడ్డి శిథిలాలు కనిపిస్తున్నాయి కదా.. గ్రామంలో వంద గంటల్లో హడావుడిగా మరుగుదొడ్ల నిర్మాణాలు చేశారు. ఇద్దరు ముగ్గురు గుత్తేదారులు ఈ పనులు చేపట్టారు. నిర్మించిన కొన్నాళ్లకే వాటి నాణ్యత బట్టబయలైంది. తాజాగా రమణమ్మకు చెందిన మరుగుదొడ్డి ఇలా అమాంతం కూలిపోయింది. అదే సమయంలో ఆ పక్కగా ఎవరైనా వెళ్తున్నా, మరుగుదొడ్డిలో ఎవరైనా ఉన్నా పరిస్థితి ఏంటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

- న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం



విజయనగరం

తెరపై ఈనాడు

◆ ఎస్వీఎన్: మెంటల్ మదిలో ◆ శ్రీకృష్ణ: జ్యూమంజి వెల్కమ్ టు ద జంగిల్ ◆ లీలామహల్: మిడిల్ క్లాస్ అబ్బాయి ◆ హిమగిరి: ఒక్క క్షణం ◆ సప్తగిరి: 2 కంట్రీస్ ◆ న్యూపూర్ణ: హలో!, ◆ ఆదిత్య: జవాన్.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

నేటి జన్మభూమి సభలు..

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో బుధవారం 8 వార్డుల్లో సభలు జరగనున్నాయి. ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు 3, 12, 23, 33, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు 4, 13, 24, 34 వార్డుల్లో జరగనున్నాయి.

గ్యాస్ సమాచారం

◆ సాయిగ్యాస్, ఎన్.వి.ఆర్ గ్యాస్, ఎన్.సి.ఎస్ గ్యాస్, సీతారాం గ్యాస్, శ్రీరామ మారుతీ గ్యాస్ ఏజెన్సీల్లో 02వ తేదీలో బుకింగ్ చేసిన వారికి బుధవారం సరఫరా చేస్తారు. ◆ బిల్లుపై ఉన్న ధరకు అధికంగా చెల్లించరాదని గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు వినియోగదారులకు సూచిస్తున్నారు. * ఇంటికి వినియోగించే గ్యాస్ సిలిండర్ ధర రూ.746, కమర్షియల్ సిలిండర్ ధర రూ.1316లు.

– న్యూస్‌టుడే, విజయనగరం ఉడాకాలనీ

కూరగాయల ధరలు

మంగళవారం కూరగాయల వివరాలు (కిలో రూ.లలో). ◆ వంకాయలు: (రవివంగ): 32, ◆ వంకాయలు: (తెల్లవి): 32, ◆ టమోటా: (దేశవాళి): 12, ◆ బెండ: 36, ◆ కాకర: 25, ◆ బీర: 38, ◆ క్యాబేజీ: 20, ◆ పొడవు చిక్కుడు: 30, ◆ క్యారెట్: 44, ◆ దొండ: 26, ◆ బీట్ రూట్: 32, ◆ ఉల్లి: 39, ◆ బంగాళదుంపలు: 8, ◆ అల్లం: 35, ◆ పచ్చిమిర్చి: 38, ◆ వెల్లుల్లి: 38, ◆ గోరు చిక్కుడు: 23, ◆ క్యాప్సికమ్: 40, ◆ పొటల్స్: 50..

– న్యూస్‌టుడే, విజయనగరం ఉడాకాలనీ

పైడితల్లి దర్శనం

◆ ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ ◆ 5.45 గంటలకు శాశ్వత నిత్య పూజలు ◆ ఉదయం 6 గంటలకు విశిష్ట కుంకుమార్చన పూజలు ◆ 7 గంటల నుంచి అంతరాలయ దర్శనం, గోత్రనామార్చన సేవలు ◆ ఉదయం 8 గంటల నుంచి శ్రీచక్రపూజలు ◆ ఉదయం నుంచి రాత్రి వరకు(వనంగుడిలో) అద్దాల మండపం దర్శనం ◆ ప్రతి రోజూ రాత్రి 7 గంటలకు పంచ హారతులు

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

బస్సుల వేళలు

◆ హైదరాబాద్ - 16.15, ◆ విజయవాడ - 6.15, 7.15, 8.30, 9.00, 10.15, 11.15, 17.00, 18.00, 19.15, 19.50, 20.45, 22.00, 24.00. ◆ రాజమండ్రి - 11.50, ◆ రామచంద్రాపురం - 12.30 ◆ జైపూర్ - 6.45, 8.30, 2.30 ◆ నవరంగపూర్ - 5.00, 6.00 ◆ ఇంద్రావతి - 10.15, 21.30 ◆ సునాబెడ - 7.45 ◆ రాయగడ - 9.00, 16.45 ◆ బైలడిల్లా - 19.00 ◆ గుణుపూర్ - ఉదయం 5.30 * భీమవరం (వయా పాలకొల్లు) - రాత్రి 7.00.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

చంద్రబాబు పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న స్వాతిరాణి

జన్మభూమి గ్రామసభలో స్వాతిరాణి

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు శోభాస్వాతిరాణి తెలిపారు. మంగళవారం విజయనగరం మండలం కొండకరకం గ్రామంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని, రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామానికి చంద్రన్న బాట రహదారులు, రక్షిత మంచినీటి పథకాలు, పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు, నిరంతర విద్యుత్తు, వ్యవసాయదారులకు రాయితీపై యంత్రాలు అందిస్తున్న మనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. ఎమ్మెల్యే మీసాల గీత మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం.. వారి సమస్యలను తెలుసుకునేందుకు జన్మభూమి గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజు కృషితో విజయనగరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామని, కోట్లాది రూపాయలతో పనులు జరుగుతున్నాయని వివరించారు. జన్మభూమి నోడల్ అధికారి ఎమ్.వెంకటేశ్వర్లు గ్రామసభను పరిశీలించి విధివిధానాలు వివరించారు. ఎంపీడీఓ ఎమ్.శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సభలో జడ్పీటీసీ తుంపిల్లి రమణ, ఎంపీపీ కెంగువ ధనలక్ష్మి, సర్పంచి పాండ్రంకి గౌరునాయుడు, ఎంపీటీసీ సభ్యులు రాంబర్కి వరలక్ష్మి, ఈఓపీఆర్‌డీ ఐ.వి.లక్ష్మి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మంగళవారం వి.టి.అగ్రహారం జడ్పీహెచ్ఎస్‌లో సంక్షేమం అంశంపై విద్యార్థులకు వివిధ వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం క్రీడా పోటీలు జరిగాయి. ప్రధానోపాధ్యాయులు నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు



విద్యార్థినులు వేసిన ముగ్గులు

ఆకట్టుకున్న రంగవల్లులు

జన్మభూమి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కొండకరకం జిల్లా పరిషత్తు పాఠశాల విద్యార్థులు ఆకట్టుకునే రంగవల్లి వేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బొమ్మతో పాటు జన్మభూమి అంటూ అందంగా రాశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈఓ పీవీవీఎస్ఎన్ రాజు, ఉపాధ్యాయులు, మండల ప్రజాప్రతినిధులు అభినందించారు.

సొమ్మసిల్లి పడిపోయిన గర్భిణి

సామూహిక సీమంతాల కార్యక్రమంలో అపశ్రుతి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం పట్టణం 21వ వార్డు పరిధిలోని ధర్మపురిలో జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమం సందర్భంగా సామూహిక సీమంతాలకు వచ్చిన ఐదు నెలల గర్భిణి సొమ్మసిల్లి పడిపోయింది. అక్కడే ఉన్న వైద్య బృందం ఆమెకు ప్రాథమిక చికిత్స చేశారు. ఓఆర్ఎస్ ఇచ్చి ఆమెకు ఉపశమనం చేశారు. ఏమీ తినకపోవడం వల్ల నీరసం వచ్చి కళ్ళ తిరిగాయని, ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. మంత్రి గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం తనిఖీ సందర్భంగా కార్యక్రమం నిర్దేశిత సమయం కంటే గంట ఆలస్యంగా మొదలైంది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గీత

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

విజయనగరం కోట, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మీసాల గీత తెలిపారు. విజయనగరం మండలం నారాయణపురంలో మంగళవారం సాయంత్రం ఎంపీడీఓ ఎం.శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జన్మభూమి మాఊరు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతున్నాయంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఫలితమేనని చెప్పారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు బి.అనురాధ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. రాకోడు పీహెచ్‌సీ వైద్యురాలు పావని వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలందించారు. తహసీల్దార్ తాడ్డి గోవిందా, ఆర్ఐ మండలి జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరించారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువుల వినియోగంపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. సర్పంచి మజ్జి జయ, ఎంపీటీసీ సభ్యులు పడాల శ్రీనివాసరావు, ఎంపీపీ కెంగువ ధనలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు తుంపిల్లి రమణ, తెదేపా మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కోలగట్ల

కాలమానిని ఆవిష్కరణ

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: సంపాదనే ధ్యేయంగా కాకుండా సమాజహిత కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని శాసనమండలి సభ్యులు, వైకాపా ఉత్తరాంధ్ర కన్వీనర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండల యువజన విభాగం అధ్యక్షులు బోగి రమణ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక తలంపుతో ముద్రించిన కాలమానిని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. పార్టీపరంగా సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సేవాభావాన్ని అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఆశపువేణు, నడిపేన శ్రీనివాసరావు, భాస్కరరావు, బొద్దాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

విజయనగరం గంట స్తంభం, న్యూస్‌టుడే: కౌమార దశలో ఉన్న బాలికలు చిరుతిళ్లకు దూరంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకునేందుకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఆర్‌కేఎస్కే కౌన్సిలర్ కొండమ్మ అన్నారు. గోకపేట బీసీ కాలనీలోని బీసీ బాలికల వసతిగృహంలో విద్యార్థినులకు మంగళవారం ఆమె ఎనీమియా, కౌమార దశలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, పోషక విలువలు ఉండే ఆహారం అధికంగా తీసుకోవాలని చెప్పారు. ఎనీమియా సంభవించడానికి గల కారణాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా ఆమె వివరించారు.

బాలికా విద్యను ప్రోత్సహించిన ధీరవనిత

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని నారాయణ పబ్లిక్ పాఠశాలలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ బాలికావిద్యను ప్రోత్సహించిన ధీరవనిత ఆమె అని కొనియాడారు. తెలుగు భాషా సంఘం అధ్యక్షులు ఆర్.బి.రామానాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు అధికారులకు ఘనంగా వీడ్కోలు



ఉద్యోగోన్నతి పొందిన అధికారులకు సత్కారం

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరం పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ)లో ఆర్ఎస్ఐలుగా విధులు నిర్వర్తించి ఆర్ఐలుగా ఉద్యోగోన్నతి పొంది ఇతర విభాగాలకు బదిలీ అవుతున్న ఇద్దరు అధికారులను మంగళవారం ఘనంగా సత్కరించారు. పీటీసీ నుంచి అక్టోపస్‌కు కె.మురళీమోహన్, ఇంటెలిజెన్స్‌కి ఎస్.గోపాలనాయుడు బదిలీ అయిన సందర్భంగా మంగళవారం పీటీసీలో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజా శిఖామణి, ఉప ప్రిన్సిపల్ బి.మోహర్‌బాబు, డీఎస్పీలు ఎం.నరసింహారావు, ఆర్ఐలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

విజయనగరం

హెచ్‌ఐవీ బాధితులను ఆదరించాలి

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: హెచ్‌ఐవీ బాధితులను అందరి లాగే ఆదరించాలని గోల్డెన్ హెరిటేజ్ సంస్థ అధ్యక్షురాలు రాధిక మంగిపూడి అన్నారు. మంగళవారం కంటోన్మెంట్ విజయ నెట్వర్క్ కార్యాలయంలో నెట్వర్క్ సంస్థ సహకారంతో గోల్డెన్ హెరిటేజ్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.



అంజనీపుత్రునికి గారెల నైవేద్యం

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విజయనగరం కొత్త అగ్రహారం పంచముఖ ఆంజనేయస్వామిని భక్తులు గారెలతో అలంకరించారు. హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు.

– న్యూస్‌టుడే, విజయనగరం కోట



శ్రీరామస్తుతి హనుమాన్

విజయనగరం సిటీబస్సు స్టాండ్ సమీపంలోని అభయాంజనేయస్వామి మంగళవారం శ్రీరామస్తుతి హనుమాన్‌గా దర్శనమిచ్చారు. ధనుర్మాసం సందర్భంగా స్వామి వారు ఈ అలంకరణలో భక్తులకు కనువిందు చేశారు. నృత్యం చేస్తూ రామలక్ష్మణులను స్తుతిస్తున్నట్లు కనిపించే ఈ స్వామిని భక్తులు విశేషంగా దర్శించి తరించారు.

- న్యూస్‌టుడే, కంటోన్మెంట్

అమ్మ దర్శనం.. బహు తీపి..

విజయనగరం ప్రజల ఆరాధ్యదేవత శ్రీపైడితల్లి అమ్మవారు మంగళవారం జాంగ్రినైవేద్యంలో భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు మంగళవారం కావడంతో తల్లిపై భక్తితో ఒక భక్తుడు సమర్పించిన ఈ జాంగ్రిని నైవేద్యంగా సమర్పించారు. ఈ నైవేద్యంలో తల్లిని దర్శించిన భక్తులు తమ గోత్ర నామాలతో పూజాదికాలు జరుపుకున్నారు.

-న్యూస్‌టుడే, కంటోన్మెంట్



మానవతా విలువలు పెంపొందించాలి



వికలాంగునికి వీల్ చైర్ అందజేస్తున్న సుబ్బారావు తదితరులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు పిల్లల్లో మానవతా విలువలు పెంపొందించాలని కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమంచి సుబ్బారావు తెలిపారు. మంగళవారం ఫౌండేషన్ కార్యాలయంలో ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పేదల కోసం పని చేస్తుందని, నిరుపేద విద్యార్థులకు తోడ్పాటునందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా అనాథ పిల్లలకు దుస్తులు, వికలాంగులకు వీల్ చైర్ అందజేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జానకిరామ్‌ను సత్కరించారు. సుబ్బారావును తోప్పివాల వాకర్స్ క్లబ్ సత్కరించింది. కార్యక్రమంలో మధుకర్, రమేష్‌జోషి, సంతోష్, రమణారావు, విశ్వనాథం, త్రినాద్, ప్రకాష్, ఫౌండేషన్ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కనుల పండువగా ఊంజల్‌సేవ

దుప్పాడ శ్రీక్షేత్రంలోని అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఊంజల్‌సేవ ఘనంగా జరిగింది. అంతకుముందు ఆలయంలో సహస్రదీపాలంకరణ నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనర్సింహాచార్యుల ఆధ్వర్యంలో పూజాదికాలు జరిగాయి.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్



రోడ్డు పక్కనున్న నిరాశ్రయులకు దుప్పట్లు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: గడ్డకట్టుకుపోయే చలిలో రోడ్డ పక్కన రాత్రివేళలో నిద్రిస్తున్న అనాథలకు స్వచ్ఛంద సంస్థలు ఆశ్రయం కల్పించాలని వైమానిక దళ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బి.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం వేకువ జామున పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, గూడ్స్ షెడ్డు కూడలి, కన్యకాపరమేశ్వరి ఆలయం, మూడులాంతర్లు, గంటస్తంభం కూడలిలో రోడ్డు పక్క దుకాణాల వద్ద కటిక నేలపై నిద్రిస్తున్న అనాథలకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మురళీధరరావు, మధుసూదనరావు, రమేష్, శివరామ్, అనిల్, వెంకట రమణారావు, విజయకృష్ణ, జోగారావు తదితరులు పాల్గొన్నారు.



నిరాశ్రయులకు దుప్పట్లు కప్పుతున్న నిర్వాహకులు

ఇది మొక్కుబడి కార్యక్రమం

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: జన్మభూమి పేరుతో ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతుందని, ఇది మొక్కుబడి కార్యక్రమమని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు అర్జి శివప్రసాద్ విమర్శించారు. మంగళవారం ఆయన విజయనగరంలో విలేకరులతో మాట్లాడారు. గత జన్మభూమిలో అర్జీలు పూర్తిగా పరిష్కారం కాకుండానే ఇప్పుడు మరోసారి స్వీకరిస్తున్నారని తెలిపారు. ప్రజల పక్షాన బీఎస్పీ పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రాంబాబు, శివ, జగన్నాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూకంలో మోసంపై ఆమ్ ఆద్మీ ఫిర్యాదు



కేసులు నమోదు చేస్తున్న తూనికలు-కొలతల శాఖ అధికారులు

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: ర.భ.శాఖ రైతు బజారు సమీపంలో చేపలు, మాంసం విక్రయాల్లో మోసాలు జరుగుతున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన ఫిర్యాదుతో సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయం అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి కాటాలు పరిశీలించి పలువురు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కార్యదర్శి కె.దయానంద్ మాట్లాడుతూ తూనికలు- కొలతలలో జరుగుతున్న మోసాలపై తూతూమంత్రంగా చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. తూనికలు-కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ మోసాలపై కేసులు నమోదు చేస్తామన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని, అప్పుడే సమాజం ఆర్థికంగా పరిపుష్టి చెందుతుందని శ్రీకాకుళం విశ్రాంత జిల్లా న్యాయమూర్తి వెచ్చలాపు అప్పారావు అన్నారు. మంగళవారం డెరిసా క్లబ్‌లో రెండు నెలల కుట్టు, కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసిన మహిళలు, యువతకు ధ్రువీకరణ పత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ నిరుద్యోగం సమసిపోవాలంటే మనలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలన్నారు. న్యాయపరమైన సలహాలు క్లబ్ ద్వారా అందిస్తానని అప్పారావు అన్నారు. కార్యక్రమంలో రోటరీ విశ్రాంత అధ్యక్షులు గ్రంధి విష్ణుమూర్తి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి మేక కాశీవిశ్వేశ్వరుడు, కురియాకోస్, కోశాధికారి సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: శ్రీసాయికృష్ణ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. క్లబ్ గౌరవాధ్యక్షులు నూతన కమిటీని డాక్టర్ వి.ఎస్.ప్రకాశరావు అధికారికంగా ప్రకటించారు. క్లబ్ నూతన అధ్యక్షునిగా త్యాడ రామకృష్ణారావు, కార్యదర్శిగా వల్ల సత్యనారాయణ, కోశాధికారిగా ఆర్.సి.హెచ్.అప్పలనాయుడు, జాలీవాకర్‌గా వై.నల్లమారాజు, ఉపాధ్యక్షునిగా కొట్ల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా జి.నారాయణప్పడు, గౌరవ సలహాదారులుగా పిన్నింటి సూర్యనారాయణ, వై.ఎస్.స్వామి ఎన్నికయ్యారన్నారు. ఈ కార్యవర్గం ఈనెల 7న ప్రమాణస్వీకారం చేయనుందని తెలిపారు.

పవిత్రమైన వైద్యవృత్తిని కించపరచొద్దు

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: పవిత్రమైన వైద్య వృత్తిని కించపరిచేలా కేంద్ర ప్రభుత్వం ఎంసీఐను రద్దు చేసి ఎన్ఎంసీగా తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా శాఖ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పునరాలోచన చేసేందుకు తగిన ఒత్తిడి తీసుకురావల్సిన అవసరం ఉందని సూచిస్తూ మంగళవారం ఐఎంఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మంచు కుమారస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎంసీ వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవి కుమార్, అధ్యక్షులు డీవీఎస్ మూర్తి, సహాయ కార్యదర్శి ఎంపీ శేషగిరి, వైకుంఠరావు, సహాయ అధ్యక్షులు సుధీర్, శ్రీరామ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

మైనర్లకు వాహనమిస్తే యజమానిపైనే కేసు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: మైనర్లకు వాహనాలు ఇస్తే ఆ వాహన యజమానిపైనే కేసు నమోదు చేస్తామని విజయనగరం ట్రాఫిక్ ఎస్ఐ కేవీఎస్ఎం రాజు అన్నారు. పట్టణంలో పలుచోట్ల మైనర్లు వాహనాలు నడపటంపై జరిగే పరిణామాల గురించి మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొంతమంది చిన్నారులు వాహనాలు నడుపుతూ ఆయన కంట పడటంతో వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, త్వరలో చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

పంచాయతీ కార్యదర్శుల ఫలితాల్లో శిక్షణ సంస్థల హవా

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషను విడుదల చేసిన గ్రూపు-3పంచాయతీ కార్యదర్శుల ఫలితాల్లో (మార్కులు) విజయనగరం శ్రీ మేధన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సంస్థకు చెందిన మీసాల అప్పలస్వామి 163.75 మార్కులు సాధించారు. మీసాల రాంబాబు 153.42 మార్కులు సాధించినట్లు సంచాలకులు గోపాలరెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పట్టణంలో లైఫ్ స్టడీసర్కిల్‌కు చెందిన తేనెల రామకృష్ణ 158.97 మార్కులతో తొమ్మిదో ర్యాంకు సాధించినట్లు సర్కిల్ సంచాలకులు రామకృష్ణ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

పురపాలికలో తొలి రోజు 646 అర్జీలు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో మంగళవారం నుంచి ప్రారంభమైన 5వ విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో మొత్తం 646 అర్జీలు వచ్చాయి. ఒకటి, 15, 21, 31, 2, 11, 22, 32 వార్డుల్లో సభలు జరిగాయి. ఈ సభలకు ఆయా వార్డుల కౌన్సిలర్లు హాజరయ్యారు. 32వ వార్డులో జరిగిన సభకు పురపాలక సంఘ అధ్యక్షుడు ప్రసాదుల రామకృష్ణ హాజరయ్యారు. ఈ సభలు కమిషనరు వి.రవీంద్ర అధ్యక్షతన జరిగాయి.